అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 15-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 146 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50



ట్రంప్ చెవికి బుల్లెట్ గాయం.. సురక్షితంగా తరలిస్తున్న భద్రతా బలగాలు

ట్రంప్‌పై హత్యాయత్నం

శనివారం సాయంత్రం 06:15

గాయాలతో బయటపడిన మాజీ అధ్యక్షులు

- ఎన్నికల ప్రచారంలో కాల్పులు
- దుండగుణ్ని మట్టుపెట్టిన సీక్రెట్ సర్వీస్

హంతకుడు థామస్ మాథ్యూ క్రూక్స్‌గా గుర్తింపు

- ముమ్మరంగా దర్యాప్తు
- ఘటనపై అంతర్జాతీయ సమాజం దిగ్భ్రాంతి

ఖండించిన మోడీ, రాహుల్



వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ (78)పై హత్యాయత్నం జరిగింది. ఈ ఘటనలో గాయపడిన ట్రంప్ సురక్షితంగా బయటపడ్డారు. అమెరికా కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం 6.15 గంటలకు పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో ట్రంప్ ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తుండగా దండగుడు ఆయనపై కాల్పులు జరిపాడు. అమెరికా సీక్రెట్ సర్వీస్ సిబ్బంది ట్రంప్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. కాల్పుల ఘటనలో గాయపడిన ట్రంప్ ముఖంపై రక్తం కారడం కన్పించింది. కాల్పులకు తెగబడిన దుండగుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు మట్టుపెట్టారు. అతనిని పెన్సిల్వేనియాలోని బెథెల్ పార్కుకు ...3లో

కులవృత్తులకు ప్రోత్సాహం

గీత కార్మికుల భద్రతకు కాటమయ్య రక్షణ కవచం

- తాటి, ఈత వనాలు పెంచేందుకు ప్రణాళికలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వేగవంతం చేస్తాం
- స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటు
- ప్రపంచ పర్యాటక కేంద్రంగా రంగారెడ్డి జిల్లా
- హయత్‌నగర్ వరకు మెట్రో
- ఓడిపోయి ఫామ్‌హౌజ్‌లో ఉన్నవారు రాష్ట్రానికి చేసేందేమీ లేదు : 'కాటమయ్య రక్షణ కవచం' పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి



గీత కార్మికులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 11లో

గ్రూప్స్ పరీక్షల
తేదీలు మార్చాలి

ఉద్యోగార్థుల ఆందోళన న్యాయమైంది : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రూప్స్ పరీక్షల తేదీలు మార్చాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్ 2, గ్రూప్ 3, డీఎస్సీ అభ్యర్థుల పట్ల పోలీసుల నిర్బంధం ఆపాలనీ, వారి న్యాయమైన సమస్యలను తక్షణం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ చౌరాస్తాలో డీఎస్సీ అభ్యర్థులు వందలాదిగా శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు బైటాయించారని తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్‌లో కూడా అభ్యర్థులు ఆందోళన చేశారని గుర్తు చేశారు. వీరిపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించిందనీ, పెద్దఎత్తున అరెస్టులు చేసిందనీ, ఇలాంటి నిర్బంధ చర్యలను సీపీఐ(ఎం) ఖండిస్తున్నదని పేర్కొన్నారు. డీఎస్సీ అభ్యర్థులే పెద్దసంఖ్యలో గ్రూప్2, గ్రూప్ 3 పరీక్షలు కూడా రాయబోతున్నారని తెలిపారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 5వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించి, వెంటనే ఆగస్టు 7,8 తేదీల్లో గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహించాలని నిర్ణయించటంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ రెండు పరీక్షల సిలబస్ వేర్వేరుగా ఉంటుందని తెలిపారు. గ్రూప్స్ రాయదల్చుకున్న అభ్యర్థులకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నందున ఈ రెండు పరీక్షల మధ్య కనీసం నెల రోజుల వ్యవధి ఉండాలని అభ్యర్థులు కోరడం న్యాయమైందని తెలిపారు. వారి అభ్యర్థన పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరించటం సరికాదన్నారు. ఖాళీ పోస్టులు తక్షణమే భర్తీ చేస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం గ్రూప్ 2, గ్రూప్ 3 కలిపి కేవలం 2,171 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తు చేశారు. అభ్యర్థులు కోరుతున్నట్టుగా గ్రూప్ 2లో మరో రెండువేలు, గ్రూప్3ల మరో 3వేలు పోస్టులు పెంచి తాజా నోటిఫికేషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. కానీ 23వేల పోస్టుల స్థానంలో కేవలం 11,062 పోస్టులకే నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. ఉద్యోగార్థులకు ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని తెలిపారు. పాఠశాలల్లో పెద్దసంఖ్యలో ఖాళీ పోస్టులు ఉండటంవల్ల విద్యార్థులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమయినందున, ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, పరీక్షలయిన వెంటనే మరొక డీఎస్సీ ప్రకటించాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ లోక్‌సభ ఉపనేతగా
గౌరవ్ గొగోయ్
చీఫ్ విప్‌గా కె.సురేష్ నియామకం



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ ఉపనేతగా ఎంపీ గౌరవ్ గొగోయ్‌ని తిరిగి నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఆదివారం ఎక్స్ (ట్విటర్)లో వెల్లడించారు. గతంలోనూ గౌరవ్ గొగోయ్ పార్టీ లోక్‌సభాపక్ష ఉపనేతగా బాధ్యతలు నిర్వహించారు. ఎనిమిది సార్లు ఎంపీగా గెలిచిన సీనియర్ మెంబర్ కొడికున్నిల్ సురేష్‌ను లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్‌గా నియమించారు. వీరికి తోడు సీనియర్ నేతలు మాణిక్యం ఠాగూర్, ఎండీ జావెద్ లకు లోక్‌సభలో విప్ బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకాలకు సంబంధించి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియాగాంధీ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు. లోక్‌సభలో పార్టీ కొత్తగా నియమించిన ఉపనేత, చీఫ్ విప్, విప్‌ల పేర్లను లేఖలో ...11లో

డీఎస్సీ రద్దు
కుదరదు

ఆరువేల పోస్టులతో మరో డీఎస్సీ జాబ్ క్యాలెండర్ విడుదలకు కసరత్తు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

డీఎస్సీ పరీక్షలకు అన్నీ సిద్ధం చేశామనీ, రద్దు చేయడం కుదరదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కొంతమంది ఆ పరీక్ష వాయిదా వేయాలంటూ ఆందోళన చేయడం తగదన్నారు. దీనివల్ల అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 5 లోపు డీఎస్సీ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆరువేల ...11లో

హిందువులు, ముస్లింలు కలిసి జీవించటమే
భారత సంప్రదాయం
ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్



న్యూఢిల్లీ : హిందువులు, ముస్లింలు కలిసి మెలిసి జీవించే సంప్రదాయం భారత్‌లో ఉన్నదని ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ అన్నారు. అలీపూర్ జైలు మ్యూజియంలో నిరుపేద యువతలో పుస్తక పఠన అలవాట్లను పెంపొందించేం దుకు జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "మన దేశ ...11లో

మాదినేని కుటుంబానిది
ఉద్యమస్ఫూర్తి

సీపీఐ(ఎం), రైతు సంఘం కార్యాలయాలకు రూ.16 లక్షల విరాళం

- రామలింగయ్య - నాగేశ్వరరావు స్మారక భవనానికి శ్రీకారం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని అభినందనలు



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మాదినేని కుటుంబం ఉద్యమస్ఫూర్తిని చాటుకుంది. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పాటుపడిన మాదినేని రామలింగయ్య - నాగేశ్వరరావు ...3లో



తెరుచుకున్న జగన్నాథ ఆలయ
రత్న భాండాగారం

46 ఏండ్ల తర్వాత...

నాలుగు గంటలపాటు ప్రయత్నాలు..

రెండు గదులు తెరిచి స్ట్రాంగ్ రూమ్ సీజ్..

3లో..



రోగులకు అందుతున్న సేవలపై కలెక్టర్ గౌతమ్ ఆరా (ఫైల్)

పాలనపై ఫోకస్..

- ప్రజా క్షేత్రంలోకి జిల్లా కలెక్టర్లు
- ఆకస్మిక తనిఖీలు, పరిశీలనలు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా
- ప్రతి నెలా సీఎస్‌కు టూర్ డైరీ రిపోర్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో

'ఇక నుంచి ఒక లెక్క.. ఇప్పటి నుంచి మరో లెక్క' అన్నట్టుగా సాగనుంది జిల్లా కలెక్టర్ల పాలన. మొన్నటి వరకు వరుస ఎన్నికలు, నామినేషన్లు, ఓట్ల లెక్కింపు, ఫలితాల బిజీలో ఉన్న కలెక్టర్లు.. ఇక నుంచి నేరుగా ప్రజా క్షేత్రంలోకి వెళ్లనున్నారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, సేవల గురించి స్వయంగా ఆరా తీయనున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. కలెక్టర్లు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని సీఎస్ నుంచి ఉత్తర్వులు రావడంతో కలెక్టర్లు నేరుగా ప్రజలతో మమేకం కానున్నారు.

ఇప్పటివరకూ వరుస ఎన్నికల నేపథ్యంలో పాలనపై పెద్దగా దృష్టి సారించలేకపోయారు. కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతున్నారని భావించిన ప్రభుత్వం, వీరి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నెల 2వ తేదీన అన్ని ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్ల పనితీరుపై అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. కలెక్టర్లు క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లేలా చూడాలని ముఖ్య కార్యదర్శులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సీఎస్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు కూడా పర్యటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొంది. లబ్దిదారులు, స్థానిక ప్రభుత్వ సిబ్బందితో మమేకం కావాలనీ, వారితో ఇష్టాగోష్టిగా మాట్లాడి, పథకాలు, కార్యక్రమాలు ఏ మేరకు చేరుతున్నాయి వంటి వివరాలను సేకరించాలని నిర్దేశించింది.

ఈ అంశాలపై స్పెషల్ ఫోకస్..

జిల్లా కలెక్టర్లు ముఖ్యంగా పది అంశాలను ప్రత్యేకంగా పరిశీలించాలని సీఎస్ ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆస్పత్రుల పనితీరును తనిఖీ చేయాలి. ప్రజలకు ఆరోగ్య సేవలు ఎలా అందుతున్నాయన్న వంటి వివరాలను పరిశీలించాలి. పాఠశాలలను ...11లో

పింఛన్ రికవరీలు
ఆపండి..
సీఎస్ ఉత్తర్వులు



11లో..



ధర్నాలో మాట్లాడుతున్న ఆచార్య నాగేశ్వర్

డబుల్ ఇండ్లకు
సదుపాయాలు కల్పించండి

మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద ధర్నా

నవతెలంగాణ-ముషీరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో గత ప్రభుత్వం నిర్మించిన 65 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లల్లో తగిన సదుపాయాలు కల్పించి లబ్దిదారులకు ఇండ్లను స్వాధీనం చేయాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీపీఐ(ఎం) నగర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ హాజరై మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ప్రాంతాల్లో మంచినీటి సదుపాయం, కరెంటు, రోడ్లు, లిఫ్ట్ ఏర్పాటు చేయకపోవడంతో ఇండ్లు పొందిన పేదలు అందులో నివసించే పరిస్థితి లేదన్నారు. తక్షణమే ఈ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సదుపాయాల ...11లో

జీహెచ్ఎంసీలో భారీ వర్షం... జిల్లాల్లో మోస్తరు వాన

- యూసుఫ్‌గూడ(హైదరాబాద్)లో 8.93 సెంటీమీటర్ల వర్షపాతం
- నేడు కూడా మోస్తరు నుంచి భారీ వర్ష సూచన
- అక్కడక్కడా అతి భారీ వర్షాలు : వాతావరణ శాఖ హెచ్చరిక
- అధికారులు అలర్ట్‌గా ఉండాలని ఐఎమ్‌డీ ఆదేశం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లో ఆదివారం భారీ వర్షం కురిసింది. జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం ఆదివారం రాత్రి పది గంటల వరకు జీహెచ్ఎంసీ పరిధిలోని యూసుఫ్‌గూడ ప్రాంతంలో 8.93 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వర్షపాతం నమోదైన మొదటి 25 ప్రాంతాలూ జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉన్నాయి. మొత్తం మీద రాష్ట్రంలో ఆదివారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10:45 గంటల వరకు 660 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు కాగా అందులో 311 ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది. సోమవారం కూడా పలు జిల్లాల్లో భారీ వర్షం పడే సూచనలున్నాయనీ, అక్కడక్కడా అతి భారీ వర్షం కూడా పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న ప్రకటించారు. ఈ మేరకు నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను ఎల్లో హెచ్చరిక జాబితాలో చేర్చారు. ఈ జిల్లాల్లో మోస్తరు వాన పడుతుంది. అక్కడక్కడా భారీ వర్షం పడొచ్చని తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్, జగిత్యాల జిల్లాల్లో లోతట్టుగా ఉండే రహదారుల ప్రాంతాల్లో జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఐఎమ్‌డి సూచించింది. మున్సిపల్, వైద్య, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. 16,17,18 తేదీల్లో మోస్తరు వానలు పడే సూచనలున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయాల్లో బలమైన గాలులతో కూడిన వర్షం పడొచ్చు.

అత్యధికంగా వర్షపాతం నమోదైన ప్రాంతాలు

యూసుఫ్‌గూడ(హైదరాబాద్)	8.93 సెంటీమీటర్లు
మారేడుపల్లి(హైదరాబాద్)	8.10 సెంటీమీటర్లు
బోరబండ(హైదరాబాద్)	7.90 సెంటీమీటర్లు
షేక్‌పేట(హైదరాబాద్)	7.90 సెంటీమీటర్లు
ముషీరాబాద్(హైదరాబాద్)	7.65 సెంటీమీటర్లు
మాదాపూర్ (రంగారెడ్డి)	7.10 సెంటీమీటర్లు
ఉప్పల్(మేడ్చల్ మల్కాజిగిరి)	7.00 సెంటీమీటర్లు
హెచ్‌సీయూ(రంగారెడ్డి)	6.98 సెంటీమీటర్లు
సీతాఫల్ మండి(హైదరాబాద్)	6.88 సెంటీమీటర్లు
బన్సీలాల్‌పేట(హైదరాబాద్)	6.85 సెంటీమీటర్లు

గ్రూప్-2, 3 పరీక్షలను వాయిదా వేయాలి

- నిరుద్యోగుల పట్ల నిరంకుశత్వ తగదు : ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ కోరాయి. నిరుద్యోగుల పట్ల నిరంకుశంగా వ్యవహరించకుండా వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని సూచించాయి. ఈ మేరకు ఆదివారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్‌మూర్తి, కార్యదర్శి తాళ్ల నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటరమేశ్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'డీఎస్సీ పరీక్షలను ఈనెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ప్రభుత్వం నిర్వహిస్తున్నది. డీఎస్సీ రాసే వారిలో గ్రూప్ -2, గ్రూప్ -3 అభ్యర్థులు కూడా ఉన్నారు. గ్రూప్- 2 పరీక్షలు ఆగస్టు ఏడు, ఎనిమిది తేదీల్లో ఉన్న నేపథ్యంలో డీఎస్సీ రాసేవారికి ప్రిపరేషన్‌కు సమ యం సరిపోదు. ఈ కారణంతోనే నిరుద్యోగులు కనీసం నెలపాటు గ్రూప్ పరీక్షలు వాయిదా వేయాలని కోరుతున్నారు. ఈ డిమాండ్ కూడా సరై నదే, గతంలో పేపర్ లీకేజీలు, టీజీపీఎస్సీ తప్పిదాలతో రాష్ట్రంలో నిరు ద్యోగులు చాలా కాలాన్ని నష్టపోయారు. డీఎస్సీ, గ్రూప్స్ సిలబస్ వేర్వేరు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఈ సున్నితమైన అంశంపై అభ్యర్థులతో చర్చించి పరిష్కారం చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐగా కోరుతున్నాం. నిరు ద్యోగులను అరెస్టు చేసి కేసులు పెట్టడం, నిర్బంధించడం సరైన చర్య కాదు.

గ్రూప్-1 నోటిఫికేషన్‌లో గ్రూప్-1 పోస్టుల కంటే అదనంగా 63 పోస్టులు పెంచి పరీక్ష నిర్వహించినట్టుగానే గ్రూపు-2, గ్రూపు-3లలో కూడా పోస్టులను పెంచే ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అరెస్టు చేసిన నిరుద్యోగులను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నాం' అని ప్రకటనలో పేర్కొన్నారు.

నాన్ గెజిటెడ్ టీచర్ పోస్టులకు మాత్రమే స్టే

- గెజిటెడ్ పర్యవేక్షణాధికారుల ఖాళీల్లో క్యాడర్ స్ట్రెంగ్త్ ప్రకారం పదోన్నతులివ్వాలి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


నూతన రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 ప్రకారం స్థానిక సంస్థల ఉపాధ్యాయులంటూ ఎవరూ లేరని టీఎస్ యూటీఎఫ్ స్పష్టం చేసింది. అందరూ పాఠశాల విద్యాశాఖ నియంత్రణలోకి వచ్చారని తెలిపింది. అయితే విద్యాశాఖలోని నాన్ గెజిటెడ్ టీచర్ పోస్టులను ఏకీకత జిల్లా క్యాడర్‌గా రాష్ట్రపతి ఉత్తర్వుల్లో పేర్కొన్న అంశంపై మాత్రమే హైకోర్టు స్టే కొనసాగుతున్నదని వివరించింది. దీంతో విద్యాశాఖలోని ఉపాధ్యాయ పోస్టులను మాత్రమే తాత్కాలికంగా వేర్వేరుగా జీవోలు 255, 256, 257 ల ద్వారా 2021 ఆగస్టు 27న లోకల్ క్యాడర్‌గా వర్గీకరించారని గుర్తు చేసింది. టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షులు కె.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉప విద్యాధికారులు, పర్యవేక్షణాధికారులు, డైట్, బీఈడీ కళాశాలల అధ్యాపకుల పోస్టులను జీవో 158 (తేదీ 4.08.2021) ద్వారా మల్టీ జోనల్ పోస్టులుగా వర్గీకరించారని తెలిపారు. ఈ పోస్టులకు ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న విద్యాశాఖ పరిధిలోని ఉపాధ్యాయులందరూ అర్హులని పేర్కొన్నారు. ఆయా ఉపాధ్యాయులకు సంఖ్యాబలం ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులను కూడా రాష్ట్రపతి ఉత్తర్వుల్లో చేర్చి లోకల్ క్యాడర్‌గా వర్గీకరించిన తర్వాత పదోన్నతుల్లో సమాన అవకాశాలు కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని 2015 సెప్టెంబర్ 30న సుప్రీంకోర్టు విస్పష్టమైన తీర్పునిచ్చిందని గుర్తుచేశారు.

ఆ తీర్పుకు అనుగుణంగా పీఓ 2018 ద్వారా లోకల్ క్యాడర్ గా వర్గీకరించబడిన ఉపాధ్యాయులందరూ విద్యాశాఖలోని ఉన్నత స్థాయి పర్యవేక్షణాధికారుల పదోన్నతులకు అర్హులని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో రెండు దశాబ్దాలుగా పర్యవేక్షణాధికారుల పదవులు భర్తీకాక తీవ్రమైన సంక్షోభం నెలకొందని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవతీసుకుని వెంటనే ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు, డైట్, బిఈడి కళాశాల అధ్యాపకుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు.

పర్యాటకంపై సర్కార్ ఫోకస్

- టూరిస్ట్ స్పాట్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు
- చారిత్రక, అధ్యాత్మిక, పురావస్తు ప్రాంతాల గుర్తింపు
- కష్ణ, గోదావరి పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- ఏకో టూరిజంపై మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో కమిటీ
- డొమెస్టిక్, నాన్ డొమెస్టిక్ టూరిస్టులకు ప్రత్యేక ప్యాకేజీలు
- త్వరలో ప్రణాళిక విడుదల చేయనున్న పర్యాటకశాఖ

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కార్ టూరిజంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రపంచంలోని వనరులు అంతగా లేని అనేక దేశాలు టూరిజంపై వచ్చే ఆదాయంతోనే మనుగడ సాధిస్తున్నాయి. రాష్ట్రంలో ఎన్నో అద్భుతాలున్న ఆ రంగాన్ని ఆదాయ మార్గంగా మార్చుకోలనే లక్ష్యంతో చారిత్రక, అధ్యాత్మిక, పురావస్తు, ఏకో మొదలగు అన్ని రకాల పర్యాటకంపై ప్రభుత్వం దృష్టి సారించింది. త్వరలో ఇందుకు సంబంధించి ప్రణాళిక విడుదల చేయనున్నట్టు సమాచారం.



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఏర్పడ్డ ఏడాది 2014లో 7కోట్ల మందికి పైగా దేశీయ పర్యాటకులు, 75 వేల మందికి పైగా విదేశీ పర్యాటకులు రాష్ట్రాన్ని సందర్శించారు. ఆ తర్వాత 2015, 2016, 18 సంవత్సరాల్లో తొమ్మిది కోట్లు దాటిన టూరిస్టుల సంఖ్య ఆ తర్వాత క్రమంగా తగ్గుకుంటూ వస్తున్నది. 2020,21 సంవత్సరాల్లో అయితే కరోనా వల్ల పర్యాటకుల సంఖ్య మూడు కోట్లకు పడి పోయింది. పర్యాటక రంగంపై గత ప్రభుత్వం దృష్టి సారించక పోవడంతో టూరిస్టుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. పర్యాటక, అతిథ్య రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనంలో ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా చారిత్రక, సాంస్కృతిక, అధ్యాత్మిక ప్రాంతాలు, వారసత్వ కట్టడాలు, సహజ జల వనరులు, అడవులు, కొండలు, కోనలు, కోటలు, ప్రకృతి రమణీయతను ఆస్వాదించే ప్రాంతాలు పర్యాటక ప్రాంతాల్లో పీపీపీ పద్ధతిన ప్రాజెక్టులు చేపట్టేందుకు వారితో చర్చలు మొదలు పెట్టింది పర్యాటక శాఖ. హైదరాబాదే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా టూరిజానికి గుర్తింపు తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



వెడ్డింగ్ డిస్టినేషన్‌కు పుష్కలమైన అవకాశాలు

రాష్ట్ర నలుమూలల ఉన్న పర్యాటక ప్రాంతాలను వెడ్డింగ్ డెస్టినేషన్ కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా శ్రీశైలం వయా సోమశిల, నాగర్జున సాగర్ వరకు ఉన్న 160 కిలోమీటర్ల మేర నల్లమల అడవుల గుండా ప్రవహిస్తున్న కృష్ణా నదీ తీరం, దట్టమైన అడువులు, వన్యప్రాణులు, జలపాతాలను డెస్టినేషన్ కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నారు. రాష్ట్రంలో అన్ని రకాల టూరిజాన్ని అభివృద్ధి చేసి, పర్యాటకులను ఆకర్షించేందుకు విస్తృత ప్రచారం కల్పించనున్నారు. రాష్ట్రాన్ని సందర్శించే దేశీయ, విదేశీ పర్యాటకుల కోసం పర్యాటక శాఖ త్వరలో ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించనున్నట్టు సమాచారం.

టూరిస్ట్ హబ్‌గా హైదరాబాద్

తెలంగాణ అంటేనే హైదరాబాద్... హైదరాబాద్ అంటేనే తెలంగాణ అనేటంతగా అన్ని రంగాల్లో ప్రాచుర్యం పొందిన నగరం.దేశ, విదేశీ పర్యాటకులకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఈ నగరాన్ని టూరిస్ట్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నగరంలోని చార్మినార్, గోల్కొండ, సాలార్‌జంగ్ మ్యూజియం, అంబేద్కర్ విగ్రహం, సచివాలయం, అమరవీరుల స్థూపంతో పాటు అనేక అధ్యాతిక, చారిత్రక ప్రాంతాలను కలుపుతూ టూరిస్ట్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే మూసీని లండన్‌లోని థేమ్స్ నదీ తీరం తరహాలో రూ. 70 వేల కోట్లతో అభివృద్ధి చేసేందుకు పలు కంపెనీలతో ఇప్పటికే ఒప్పందం కుదిరింది. భవిష్యత్‌లో నగరంలో మరిన్నీ టూరిస్ట్ ప్రాంతాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ కసరత్తు చేస్తున్నది.

అధ్యాత్మిక టూరిజం

రాష్ట్రంలో అధ్యాత్మిక ప్రాంతాలకు కొదవ లేదు. యాదాద్రి లక్ష్మనర్సింహ స్వామి, వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాలు రాష్ట్రంలో బహుళ ప్రాచుర్యం పొందాయి. దేశ, విదేశాలనుంచి పర్యాటకులు తరలి వస్తారు. వీటిలతో పాటు కాళేశ్వరం, ధర్మపురి, కొండగట్టు, మంథని తదితర పుణ్యక్షేత్రాలను కలుపుతూ టెంపుల్ టూరిజం కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఆయా ప్రాంతాలను సందర్శించే వారికి టూరిజం శాఖకు చెందిన ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. ఏకో టూరిజం మాదిరిగానే అధ్యాత్మిక టూరిజాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రభత్వం కసరత్తు చేస్తున్నది.

ఏకో టూరిజం

అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో ఏకో టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మార్చి 14న ఓ కమిటీని ఏర్పాటు చేసింది. పరిశ్రమలు, గిరిజన, దేవాదాయ కమిషనర్లతోపాటు మొత్తం 17మంది ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఇప్పటికే సమావేశమైన ఈ కమిటీ ఏకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టింది. పర్యావరణానికి, వన్య ప్రాణులకు హాని కలగకుండా, వాటి సహజ ఆవాసాలను పరిరక్షిస్తూ, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ ఎకో టూరిజం పాలసీని తీసుకు రానున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 12 సర్క్యూట్లలో 40 స్పాట్లను గుర్తించారు. అడ్వెంచర్, రీక్రియేషన్, అధ్యాత్మిక, వారసత్వ సినీ, వెడ్డింగ్, నేచర్ అండ్ వైల్డ్ లైఫ్, హెరిటేజ్ అండ్ కల్చర్ తదితర అంశాల ఆధారంగా మరిన్ని ప్రాంతాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు. అటవీ, దేవాదాయ, రెవెన్యూ పర్యాటక శాఖలు సమన్వయం చేసుకుని ఆ పాలసీని రూపొందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

2014 నుంచి తెలంగాణను సందర్శించిన పర్యాటకుల సంఖ్య

క్రసంఖ్య	సంవత్సరం	దేశీయపర్యాటకులు	విదేశీపర్యాటకులు
1).	2014	7,23,99,113	75,171
2).	2015	9,45,16,316	1,66,678
3).	2016	9,52,16,030	1,66,570
4).	2017	8,52,66,596	2,51,846
5).	2018	9,28,78,329	3,18,154
6).	2019	8,30,35,894	3,23,326
7).	2020	4,00,55,581	46,700
8).	2021	3,20,00,620	5,917
9).	2022	6,07,48,425	68,401
10).	2023	5,84,47,573	1,60,912

రైతు పథకాల్లో కోత నష్టదాయకం

- తక్షణం రైతు భరోసా విడుదల చేయాలి
- గడువు లేకుండా రుణమాఫీ ఇవ్వాలి..
- 40శాతం ఉన్న కౌలుదారులను ఆదుకోవాలి : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

వ్యవసాయంలో సరైన ఆదాయం లేక సాగు నుంచి రైతులు వైదొలుగుతున్నారని, ఇటువంటి తరుణంలో ఆదుకోవాల్సింది పోయి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అరకొర సహాయంలో కోత విధిస్తే మరింత నష్టం జరుగుతుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ తెలిపారు రైతుభరోసా ఇప్పటికే జాప్యమైన నేపథ్యంలో తక్షణం విడుదల చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సాగర్ మాట్లాడారు. రాష్ట్రంలో సాగులో 40 శాతంగా ఉన్న కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతు లభించడం లేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రక టించిన మద్దతు ధర కూడా మార్కెట్లో లభించడం లేదని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు మేరకు మద్దతు ధరలు నిర్ణయించి, పార్లమెంటు చట్టం చేసి గ్యారంటీ ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు.ఏఐకేఎస్ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. గత రబీ సీజన్‌లో వర్షాలు కురవక, ప్రాజెక్టుల్లో నీరు లేక సాగు రైతులు పంటలు చేయలేదని అన్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ముమ్మరంగా సాగుతున్న ఈ తరుణంలోనే వెంటనే రైతు భరోసా విడుదల చేసి, రైతుల వ్యవసాయ అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత అందించాలని కోరారు. ఖమ్మం జిల్లాలో రైతుల సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర మంత్రులు, రైతు సంఘాలు, రైతు ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లాలో రెండు సార్లు రుణమాఫీకి నోచుకోని రైతులకు గడువుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, జిల్లా సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, శీలం పకీరమ్మ, బొక్కసాని గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు రావుల రాజబాబు, కొల్లేటి ఉపేందర్, మల్లెంపాటి రామారావు, బిగి రమేష్, తుళ్ళూరు నాగేశ్వరరావు, కొమ్మినేని నాగేశ్వరరావు, సంక్రాంతి నర్సయ్య, తోటకూర వెంకటనరసయ్య, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ పాల్గొన్నారు.

పార్టీ ఫిరాయింపులు తప్ప.. ప్రజా సమస్యలు పట్టవా ?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి ప్రశ్న



నవతెలంగాణ-మిర్యాలగూడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పార్టీ ఫిరాయింపులు తప్ప ప్రజా సమస్యలు పట్టడం లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయిందని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 40 రోజులు దాటిందని, ఇప్పటివరకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వాలు ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పార్టీ ఫిరాయింపులపై దృష్టి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని అందులో ఒకటి రెండు హామీలు తప్ప మిగిలిన పథకాలు అమలు చేయడం లేదని చెప్పారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, పెన్షన్ పెంపు, వ్యవసాయ ప్రణాళిక, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతు భరోసా అమలు చేసేందుకు ఇప్పుడు రైతుల అభిప్రాయాలు సేకరించడం సరికాదని, ఆనాడు ఎన్నికల ముందు ఎవరి అభిప్రాయాలు తీసుకొని హామీ ఇచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న 13 సమస్యలపై ఇప్పటికే ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను చిత్తశద్ధితో అమలు చేయాలని లేకపోతే భవిష్యత్‌లో ప్రజాఉద్యమాలు మొదలవుతాయని హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం పదేండ్లలో చేసిన తప్పులనే మళ్లీ చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధి కోసం దృష్టి పెట్టడం లేదని, కనీసం నిధులు తీసుకురావడంపైనా శ్రద్ధ చూపడం లేదన్నారు. కేవలం కాంగ్రెస్‌ను తిట్టేందుకే వారు ఉన్నట్టు కనిపిస్తుందని ఆరోపించారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు గౌతమిరెడ్డి, రెమిడాల పరుశురాములు, పాదురీ శశిధర్‌రెడ్డి, పగిడోజురామ్మూర్తి, పత్తిపాక అప్పారావు, ఉన్నం వెంకటేశ్వర్లు, చారి తదితరులు పాల్గొన్నారు.



త్రిపుర రాష్ట్రవ్యాప్త బంద్ విజయవంతం

- సీపీఐ(ఎం) అభ్యర్థి దారుణ హత్యకు నిరసనగా...

న్యూఢిల్లీ : త్రిపురలో ఆగస్టు 8న జరిగే జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయనున్న సీపీఐ(ఎం) అభ్యర్థిని బీజేపీ గూండాలు దారుణంగా హత్య చేయడానికి నిరసనగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన బంద్ పూర్తిగా విజయవంతమయింది. ప్రతిపక్ష పార్టీలు పిలుపు మేరకు జరిగిన ఈ బంద్‌లో ప్రజలు స్వచ్ఛంధంగా ఈ బంద్‌లో పాల్గొన్నారు. వ్యాపారాలు తమ దుకాణాలు మూసివేసి బంద్‌లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ 12 గంటల పాటు ఈ బంద్ జరిగింది. దక్షిణ త్రిపుర జిల్లా పరిషత్ స్థానం నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాదల్ శీల్ (49)పై ఈ నెల 12న రాజ్‌నగర్ వద్ద బీజేపీ గూండాలు దారుణంగా దాడికి పాల్పడ్డారు. దీంతో శీల్‌ను త్రిపుర రాజాధాని ఆగర్తలలోని జేబీపీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శీల్ మరణించాడని త్రిపుర లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్ నారాయణ్ కర్ తెలిపారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి అనేక మంది లెఫ్ట్ ఫ్రంట్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై బీజేపీ గూండాలు దాడులకు పాల్పడు తున్నారని నారాయణ్ కర్ తెలిపారు. బాదల్ శీల్‌పై జరిగిన దాడి గురించి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి వివరిస్తూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థులు తమ నాయకులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్ దాఖలు చేయడం కోసం రాజ్‌నగర్ హెచ్ఎస్ పాఠశాల వద్దకు చేరుకున్నప్పుడు అప్పటికే అక్కడ వేచి ఉన్న బీజేపీ సాయుధ గూండాలు పదునైన ఆయుధాలతో వారిపై దాడి చేశారని తెలిపారు. ఈ దాడిలో సీపీఐ(ఎం)కు చెందిన పలువురు కార్య కర్తలు గాయపడ్డారని, శీల్ తలకు బలమైన గాయం తగిలిందని చెప్పారు. శీల్ హత్యకు నిరసనగా బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు చెప్పారు. మరో ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ కూడా ఈ బంద్‌కు మద్దతు ప్రకటించింది.

శీల్‌ను హత్యను ఖండించిన ఏఐకేఎస్

బిజెపి గూండాల చేతిలో బాదల్ శీల్ దారుణంగా హత్యకు గురికావడాన్ని ఏఐకేఎస్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. త్రిపుర కిసాన్ సభ యొక్క దక్షిణ త్రిపుర జిల్లా కమిటీలో శీల్ సభ్యులని తెలిపింది. శీల్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. బాదల్ శీల్ ఉపాధ్యాయుడని, తరువాత దక్షిణ త్రిపురలో రైతు, వ్యవసాయ కార్మికుల ఉద్యమాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపింది. ఈ తరువాత ఏఐకేఎస్ బెలోనియా సబ్ డివిజన్ కమిటీ, దక్షిణ త్రిపుర జిల్లా కమిటీ సభ్యునిగానూ ఎన్నికయ్యాడని తెలిపింది. శీల్ గతంలోనూ అనేక ప్రాణాంతకమైన దాడులను ఎదుర్కొన్నారని, రాజ్‌నగర్ ప్రాంతంలో రైతు, ప్రజాస్వామిక ఉద్యమాలను బలహీన పర్చేందుకు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు బీజేపీ అతన్ని లక్ష్యంగా చేసుకుందని తెలిపింది. శీల్ హత్య కేసులో ఇప్పటి వరకూ పోలీసులు ఎవ్వరినీ అరెస్టు చేయలేదని, బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నేరగాళ్లకు రక్షణ కల్పిస్తోందని విమర్శించింది. కొన్ని వార్తల ప్రకారం దాడికి పాల్పడిన వారు బంగ్లాదేశ్‌కు పారిపోయినట్లు తెలుస్తోందని తెలిపింది. శీల్ హత్య, త్రిపురలో బీజేపీ చేస్తున్న హత్యా, హింసా రాజకీయాలకు నిరసనగా త్రిపుర ప్రజలు ఆది వారం 12 గంటల పాటు బంద్‌లో పాల్గొన్నారని తెలిపింది. శీల్ మరణం పట్ల ఎఐకెఎస్ సంతాపం వ్యక్తం చేసింది. అతని భార్య, కుమార్తె, త్రిపుర కిసాన్ సభ కార్యకర్తలకు సానుభూతి ప్రకటించింది. అలాగే, ఇలాంటి పిరికి దాడులకు త్రిపుర కిసాన్ ఉద్యమం ఎప్పటికీ లొంగిపోదని తెలిపింది. త్రిపురలో ప్రజా స్వామ్య, చట బద్ధ పాలనను పునరుద్దరించే పోరాటంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలను కూడగట్టడం ద్వారా హింసను ప్రతిఘటిస్తుందని ఏఐకేఎస్ తెలిపింది. రైతు ఉద్యమ కార్మికులతోనూ, త్రిపుర ప్రజాస్వామ్య ఉద్యమంతోనూ చేతులు కలుపుతూ బీజేపీ నేతృత్వంలోని నియంతృత్వ, మతోన్మాద శక్తులపై ఏఐకేఎస్ పోరాడుతుందని స్పష్టం చేసింది.

నిరుద్యోగులకు టైమిస్తే తప్పేంటి?

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలు వరుసగా ఉన్న నేపథ్యంలో సన్నద్ధమవ్వడానికి సమయం సరిపోవట్లేదని నిరుద్యోగులు సమయం అడుగుతున్నారనీ, కాస్త టైమిచ్చి వాటిని నిర్వహిస్తే తప్పేంటని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగల సమస్య పరిష్కారం కోసం ఎవరైనా దీక్షలు చేసే, నిరసనలు తెలిపే హక్కు ఉందని చెప్పారు. నిరుద్యోగుల పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కిరణ్‌కుమార్‌రెడ్డిలాగా వారు ప్యారాచూట్ నేతలు కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపడేసి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు.

ట్రంప్‌పై హత్యాయత్నం



ఏం జరిగింది?

ర్యాలీకి హాజరైన ప్రజానీకం కరతాళధ్వనులు చేస్తుండగా, నేపథ్యంలో 'అమెరికాను దేవుడు ఆశీర్వదిస్తాడు' అంటూ పాట విన్పిస్తుండగా ఒక్కసారిగా కలకలం రేగింది. ట్రంప్ తన ఎన్నికల ప్రసంగాన్ని ప్రారంభిస్తూ జో బైడెన్ ప్రభుత్వ హయాంలో సరిహద్దులను అక్రమంగా దాటుతున్నారని చూపే చార్టును ప్రదర్శించారు. ఇంతలో హఠాత్తుగా ఐదుసార్లు కాల్పులు జరిపిన శబ్దాలు విన్పించాయి. ఒక తుపాకీ గుండు ట్రంప్ చెవికి తగలడంతో ఆయన గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ట్రంప్ వద్దకు వెళ్లి కింద కూర్చోవాలని సూచించారు. అక్కడ ఉన్న జనం కూడా ఒక్కసారిగా కింద కూర్చున్నారు. ఆ సమయంలో మైదానంలో నిశ్శబ్దం అలముకొంది. అప్పుడప్పుడు కొన్ని అరుపులు వినిపించాయి. ట్రంప్‌ను సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు చుట్టుముట్టి ఆయనకు రక్షణగా నిలిచారు. ట్రంప్ మాత్రం దీనిని పట్టించుకోకుండా మద్దతుదారుల 'అమెరికా...అమెరికా...అమెరికా' నినాదాల మధ్య పిడికిలిని మూడుసార్లు పైకెత్తి 'ఫైట్' అంటూ నినదించారు.

అనంతరం ఆయన వేదిక దిగి అక్కడ వేచివున్న వాహనంలో ఆస్పత్రికి వెళ్లిపోయారు. ట్రంప్ ప్రసంగించే వేదికకు 130 గజాల దూరం నుండి దాడి జరిగిందని తెలుస్తోంది. హంతకుడు అక్కడ ఉన్న ఓ తయారీ కేంద్రం పై నుండి కాల్పులు జరిపాడు. అక్కడి నుండి ట్రంప్ ప్రసంగించాల్సిన ప్రదేశం ఫుట్‌బాల్ మైదానం పొడవు కంటే కొంచెం ఎక్కువగా ఉంటుంది. అంటే కాల్పులు జరిపిన వ్యక్తికి ట్రంప్ స్పష్టంగా కన్పించారన్న మాట. బహిరంగ ప్రదేశమైన బట్లర్ వ్యవసాయ ప్రదర్శన మైదానంలో ర్యాలీ జరిగింది. అక్కడ ఉన్నవన్నీ బహిరంగ క్షేత్రాలేనని న్యూయార్క్ పోస్ట్ తెలిపింది.దుండగుడిని మట్టుపెట్టేందుకు అమెరికా దళాలు వేదిక సమీపంలోని మరో భవనం పైనుండి కాల్పులు జరిపాయి. కాల్పుల అనంతరం ఆ ప్రదేశంలో దుండగుడి మృతదేహం లభించింది. దుండగుడు వేదిక పైకి కాల్పులు జరపడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని ఎఫ్‌బీఐ ప్రత్యేక ఏజెంట్ ఇన్‌ఛార్జ్ కెవిన్ రోజెక్ తెలిపారు.

ఈ కేసును ఎఫ్‌బీఐ సీరియస్‌గా తీసుకొని దర్యాప్తును ముమ్మరం చేసింది. ఘటనపై విచారణకు సీక్రెట్ సర్వీస్‌తో కలిసి పని చేస్తున్నామని అమెరికా హోం ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ అలెజాంద్రో మయోర్కాస్ చెప్పారు. విచారణకు హాజరు కావాల్సింది గా సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ కింబర్లీ చీటిల్‌ను కోరారు.

(మొదటిపేజీ తరువాయి)

చెందిన 20 సంవత్సరాల థామస్ మాథ్యూ క్రూక్స్‌గా గుర్తించారు. ఘటనా స్థలం నుండి అధికారులు ఒక ఆర్మాలైట్ రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాల్పుల ఘటనలో ఒక ప్రేక్షకుడు కూడా చనిపోయాడని, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని అసోసియేటెడ్ ప్రెస్ వార్తాసంస్థ తెలిపింది. త్వరలో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ట్రంప్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఘటన అనంతరం ట్రంప్ సామాజిక మాధ్యమంలో ఓ ప్రకటన విడుదల చేశారు. 'నా ఎడమ చెవి పైన గాయమైంది. శబ్దం వినపడగానే ఏదో జరిగిందని అర్థమైంది. కాల్పుల శబ్దాలు వినిపించాయి. నా చర్మంలో తూటా దిగిందని అనుకున్నాను. చాలా రక్తం కారింది' అని ఆయన తెలిపారు. కాల్పుల ఘటన నేపథ్యంలో సీక్రెట్ సర్వీస్, స్థానిక పోలీసులు, ఎఫ్‌బీఐ సంయుక్తంగా దర్యాప్తు ప్రారంభించాయి.

పార్టీ సదస్సుకు ముందు...

విస్కాన్సిస్‌లోని మిల్క్‌వాకీలో మరో రెండు రోజుల్లో రిపబ్లిక్ పార్టీ జాతీయ సదస్సు జరగాల్సి ఉంది. ఆ సదస్సులోనే రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ట్రంప్‌ను అధికారికంగా నామినేట్ చేస్తారు. కాల్పుల ఘటన అనంతరం రిపబ్లికన్ పార్టీ జాతీయ కమిటీ, ట్రంప్ ప్రచారకర్తలు సంయుక్తంగా ఒక ప్రకటన చేస్తూ 'మిల్క్‌వాకీలో మీతో కలవాలని ట్రంప్ కోరుకుంటున్నారు. సదస్సు యథావిధిగా జరుగుతుంది. అమెరికాకు 47వ అధ్యక్షుడిగా పనిచేసేందుకు ఈ సదస్సు ఆయనను నామినేట్ చేస్తుంది' అని తెలిపారు.

ఎవరీ క్రూక్స్ ?

ట్రంప్‌పై హత్యాయత్నం చేసిన 20 సంవత్సరాల థామస్ మాథ్యూ క్రూక్స్ పెన్సిల్వేనియాలోని బెథెల్ పార్కుకు చెందినవాడు. 2021లో డెమొక్రాట్లకు అనుబంధంగా పనిచేసే ప్రోగ్రెసివ్ టర్న్‌ఔట్ ప్రాజెక్టుకు పదిహేను డాలర్లు విరాళంగా ఇచ్చాడు. ప్రభుత్వ ఓటింగ్ రికార్డుల ప్రకారం ఇతను రిపబ్లికన్ పార్టీ మద్దతుదారుగా తన పేరును నమోదు చేసుకున్నాడు. ప్రస్తుతం అతని ఇంటి వద్ద భారీగా పోలీసులను మోహరించారు. క్రూక్స్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో ఇప్పటికే వైరల్ అయ్యాయి. కాల్పులకు ముందు అతను రికార్డు చేసినట్లు చెబుతున్న ఓ వీడియో కూడా సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతోంది. రిపబ్లికన్ పార్టీని, ట్రంప్‌ను తాను ద్వేషిస్తున్నానని అతను అందులో చెప్పాడు.



ఆందోళన వ్యక్తం చేసిన మోడీ, రాహుల్

డొనాల్డ్ ట్రంప్‌పై జరిగిన దాడిపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలు, ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని ఆయన తెలిపారు. 'నా స్నేహితుడు ట్రంప్‌పై జరిగిన దాడి నన్ను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాను. రాజకీయాలు, ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మోడీ పేర్కొన్నారు. ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ట్రంప్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా కాల్పుల ఘటనను ఖండించారు.

ప్రత్యక్షసాక్షి ఏమన్నారంటే...

ట్రంప్ ప్రసంగం ప్రారంభించిన ఐదు నుండి ఏడు నిమిషాల తర్వాత ఓ వ్యక్తి సమీపంలో ఉన్న భవనం పైకి ఎక్కడం చూశానని, అతని చేతిలో తుపాకీ ఉన్నదని ప్రత్యక్షసాక్షి ఒకరు బీబీసీకి చెప్పారు. ఆ సమయంలో తాను, తన స్నేహితులు అధికారులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించామని తెలిపారు.

లింకన్ నుంచి ట్రంప్ వరకూ.... హత్యలు, దాడులతో రక్తమోడిన అగ్రరాజ్యం



అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిపై, అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులపై దాడి జరగడం ఇది మొదటిసారి ఏమీ కాదు. దేశాధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, అధ్యక్ష ఎన్నికల క్షేత్రంలో నిలిచిన అభ్యర్థులే లక్ష్యంగా గతంలో అనేక రాజకీయ హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ వివరాలు...

కామెడీ షోకు హాజరైనప్పుడు...

హత్యకు గురైన తొలి అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్. 1865 ఏప్రిల్ 14న ఆయనను జాన్ విల్కెస్ బూత్ కాల్చి చంపాడు. లింకన్, ఆయన భార్య మేరీ టాడ్ లింకన్ వాషింగ్టన్‌లోని ఫోర్డ్స్ థియేటర్‌లో 'అవర్ అమెరికన్ కజిన్' అనే కామెడీ షోకు హాజరైన సమయంలో దాడి జరిగింది. తల వెనుక తీవ్ర గాయాలైన లింకన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. నల్ల జాతీయుల హక్కులకు మద్దతు ఇవ్వడమే లింకన్ హత్యకు కారణమని తేలింది. లింకన్ మరణానంతరం ఉపాధ్యక్షుడు ఆండ్రూ జాన్సన్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. లింకన్‌పై దాడి జరిగిన నెలలోనే 26వ తేదీన వర్జీనియాలోని బౌలింగ్ గ్రీన్ సమీపంలో ధాన్యపు కొట్టులో దాక్కున్న బూత్‌ను కాల్చి చంపారు.

బాధ్యతలు స్వీకరించిన ఆరు నెలలకే...

అమెరికా 20వ అధ్యక్షుడైన అమెస్ గార్‌ఫీల్డ్‌ను హత్య చేశారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆరు నెలలకే ఆయన హత్యకు గురయ్యారు. 1881 జూలై 2న న్యూజిలాండ్ వెళ్లేందుకు వాషింగ్టన్ రైల్వే స్టేషన్‌లో రైలు కోసం నడుస్తుండగా ఛార్లెస్ గిటౌ అనే వ్యక్తి ఆయనపై కాల్పులు జరిపాడు. గార్‌ఫీల్డ్ ఛాతిలో దిగబడిన తూటాను ఓ పరికరంతో కనిపెట్టేందుకు టెలిఫోన్‌ను కనుగొన్న అలగ్జాండర్ గ్రహం బెల్ చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ పరికరాన్ని దేశాధ్యక్షుడి కోసం ప్రత్యేకంగా తయారు చేశారు. కాల్పుల ఘటనలో తీవ్రంగా గాయపడిన గార్‌ఫీల్డ్ అనేక వారాల పాటు శ్వేతసౌధంలోనే చికిత్స పొందారు. చివరికి న్యూజెర్సీ తీరానికి తరలిస్తుండగా సెప్టెంబరులో చనిపోయారు. గిటౌను నేరస్తుడిగా నిర్ధారించి 1982లో ఉరి తీశారు.

ప్రజలతో కరచాలనం చేస్తుండగా...

అమెరికా 25వ అధ్యక్షుడైన విలియం మెకిన్లే 1901 సెప్టెంబర్ 1న న్యూయార్క్‌లోని బఫెలోలో హత్యకు గురయ్యారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం వారితో కరచాలనం చేస్తుండగా 28 సంవత్సరాల నిరుద్యోగ వైద్యుడు లియాన్ ఎఫ్ జోల్గోజ్ ఆయన ఛాతిపై పాయింట్-బ్లాంక్ రేంజ్‌లో రెండుసార్లు కాల్పులు జరిపాడు. మెకిన్లే కోలుకుంటారని వైద్యులు భావించినప్పటికీ బులెట్ గాయం చుట్టూ తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ సోకడంతో సెప్టెంబర్ 14న ప్రాణాలు కోల్పోయారు. అదే ఏడాది అక్టోబర్ 29న జోల్గోజ్‌ను దోషిగా నిర్ధారించి ఎలక్ట్రిక్ కుర్చీలో కూర్చోబెట్టి హతమార్చారు.

భార్యతో కలిసి పర్యటిస్తుండగా...

1965 నవంబర్‌లో 35వ అధ్యక్షుడైన జాన్ ఎఫ్ కెన్నడీ తన సతీమణి జాక్వెలిన్ కెన్నడీతో కలిసి డల్లాస్‌లో పర్యటిస్తుండగా మాటున దాగిన హంతకుడు లీ ఆర్వీ ఆస్వాయిడ్ అత్యంత శక్తివంతమైన తుపాకీతో కాల్చాడు. తీవ్రంగా గాయపడిన కెన్నడీని పర్క్‌లాండ్ ఆస్పత్రికి తరలించగా అక్కడ ఆయన కన్నుమూశారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులు టెక్సాస్ పాఠశాల పుస్తకాలు భద్రపరిచే కేంద్రం సమీపంలోని క్షౌరశాలలో ఆస్వాయిడ్‌ను పట్టుకున్నారు. హంతకుడిని డల్లాస్ నైట్‌క్లబ్ యజమాని జాక్ రూబీ కాల్చి చంపాడు.

దాడులు జరిగింది వీరి పైనే

అమెరికా 32వ అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ 1933 ఫిబ్రవరిలో మియామీలో ప్రసంగిస్తుండగా కాల్పులు జరిగాయి. ఈ ఘటన నుండి రూజ్‌వెల్ట్ తప్పించుకున్నప్పటికీ చికాగో మేయర్ ఆంటన్ సెర్మాక్ చనిపోయారు. ఘటనకు బాధ్యుడైన జంగారాకు మరణశిక్ష విధించారు. 1950లో దేశానికి 33వ అధ్యక్షుడిగా వ్యవహరించిన హారీ ఎస్. ట్రూమన్ నివసిస్తున్న బ్లెయిర్ హౌస్‌లోకి ఇద్దరు సాయుధులు ప్రవేశించి కాల్పులు జరిపారు. ట్రూమన్ తప్పించుకున్నప్పటికీ ఎదురు కాల్పుల్లో అధ్యక్ష భవనం పోలీసు, ఒక దుండగుడు చనిపోయారు. శ్వేతసౌధానికి చెందిన ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. 1975లో అమెరికా 38వ అధ్యక్షుడైన గారీ ఫోర్డ్ కొన్ని వారాల వ్యవధిలోనే రెండు హత్యాయత్నాల నుండి తప్పించుకున్నారు. ఇక 40వ అధ్యక్షుడైన రోనాల్డ్ రీగన్ 1981 మార్చిలో వాషింగ్టన్ డీసీలో తన ప్రసంగాన్ని ముగించి, వాహనం వైపు నడిచి వెళుతుండగా జనంలో ఉన్న జాన్ హింక్లీ జూనియర్ కాల్పులు జరిపాడు. ఈ సంఘటన నుండి ఆయన కోలుకున్నప్పటికీ మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అమెరికాకు 43వ అధ్యక్షుడిగా పనిచేసిన జార్జ్ బుష్ 2005లో జార్జియా అధ్యక్షుడు మిఖాయిల్ సాకష్వీతో కలిసి టిబిలిసిలో ఓ ర్యాలీకి హాజరు కాగా ఆయనపై చేతి గ్రెనేడ్ విసిరారు.

అయితే అది పేలకపోవడంతో ఎవరూ గాయపడలేదు. నిందితుడైన వ్లాదిమిర్ అరుటియునియన్‌కు జీవిత ఖైదు శిక్ష పడింది. రెండుసార్లు దేశాధ్యక్షుడిగా పనిచేసి, మూడోసారి పోటీకి దిగిన థియొడోర్ రూజ్‌వెల్ట్‌పై ప్రచార సందర్భంగా 1912లో మిల్వాకీలో కాల్పులు జరిగాయి. అయితే ఆయనకు తీవ్రమైన గాయాలేవీ కాలేదు. 1968లో అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన రాబర్ట్ కెన్నడీని లాస్ ఏంజెల్స్ హోటల్‌లో హత్య చేశారు. ఈ ఘటనకు ఐదు సంవత్సరాల ముందు సోదరుడైన జాన్ ఎఫ్.కెన్నడీ హత్యకు గురయ్యారు. 1972లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీపడిన జార్జ్ వాలస్‌పై కాల్పులు జరిగాయి.

అమెరికాలో హింసకు తావు లేదు : బైడెన్



కాల్పుల ఘటనను ఖండించిన పలువురు ప్రపంచ నేతలు

'ఈ తరహా హింసకు అమెరికాలో తావు లేదు' అని దేశాధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించారు. ఈ ఘటనను ఖండించడానికి ఒకే జాతిగా తామంతా ఏకమవ్వాలని చెప్పారు. కాల్పులపై తనకు సమాచారం అందించారని అంటూ తన ప్రత్యర్థిని రక్షించిన సీక్రెట్ సర్వీస్‌ను అభినందించారు. ఘటన నేపథ్యంలో బైడెన్ తన ఎన్నికల ప్రచార కార్యక్రమాలను, రాజకీయ అడ్వర్‌టైజ్‌మెంట్లను నిలిపివేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ట్రంప్‌తో మాట్లాడారు..

కాగా కాల్పుల ఘటనను పలువురు ప్రపంచ నేతలు తీవ్రంగా ఖండించారు. అమెరికా మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, జార్జ్ బుష్, బిల్ క్లింటన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడ్యూ, బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బానీస్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ, హంగరీ ప్రధాని విక్టర్ ఆర్బన్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తదితరులు ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ తీవ్రంగా ఖండించారు.

విభజన రాజకీయాలకు కాలం చెల్లింది

- ఏఐఐఈఏ నిర్విరామ కృషి ఫలితంగానే 17శాతం వేతన సవరణ
- ఇన్సూరెన్స్ ప్రీమియంపై 18శాతం జీఎస్టీని ఎత్తివేయాలి
- ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి
- ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలి : ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ).. జోనల్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్
- ఘనంగా యూనియన్ 28వ వార్షిక మహాసభ



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/ కరీంనగర్

దేశాన్ని, ప్రజల్ని మతం ప్రాతిపదికగా విభజించి ఓట్లు దండుకొని అధికారంలోకి రావాలన్న నీచమైన రాజకీయాలు ఇక ఎంతమాత్రం చెల్లవని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) జోనల్ ప్రధాన కార్యదర్శి టీవీఎన్ఎస్ రవీంద్రనాథ్ అన్నారు. ఎల్ఐసీలోని అతిపెద్ద యూనియన్ ఏఐఐఈఏ కరీంనగర్ డివిజన్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ 28వ మహాసభలు ఆదివారం అట్టహాసంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన హాజరై ప్రారంభించి మాట్లాడారు. దేశంలో, ఆ మాటకొస్తే ప్రపంచంలోనే ఎన్నికలను ఇంత అట్టడుగు స్థాయికి దిగజారేలా ఒక ప్రధానమంత్రి ప్రజలను ఆకర్షించడానికి మతాన్ని ఒక కీలకమైన అంశంగా తన ఉపన్యాసాల్లో ప్రస్తావిస్తూ ప్రజల్ని అవమానపరిచేలా, కించపరిచేలా వ్యవహరించడం వివాదాస్పదమైందన్నారు. అయినా చైతన్యవంతమైన ప్రజలు ఏ విభజన రాజకీయాలకు తావివ్వకుండా 400 సీట్లను ఆశించిన బీజేపీకి భంగపాటు కలిగించే విధంగా 240 సీట్లకు పరిమితం చేశారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది ఒక గొప్ప మార్పునకు సంకేతంగా భావించాలని తెలిపారు. అలాగే ఒక బలమైన ప్రతిపక్షం ఆధ్వర్యంలో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి రక్షణ కలుగుతుందనే నమ్మకం బలపడిందని తెలిపారు.

ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వానికి పరిమితమైన మెజారిటీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే ఇన్సూరెన్స్‌లో సంస్కరణలు తీసుకొస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇన్సూరెన్స్ రెగ్యులేటర్ ద్వారా తీసుకొచ్చే మార్పులన్నీ ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎల్ఐసీని నిర్వీర్యం చేస్తూ ఏమాత్రం ప్రజల సంక్షేమం పట్టని ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తోడ్పాటు లేకపోయినా జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి ఎల్ఐసీ అద్భుతమైన ప్రగతిని సాధిస్తూ మార్కెట్ లీడర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుందని తెలిపారు. ఏఐఐఈఏ నిర్విరామ కృషి ఫలితంగానే 17శాతం వేతన సవరణ సాధించుకున్నట్టు తెలిపారు. ముఖ్యంగా వేతన సవరణకు ఆయువుపట్టు లాంటి బేసిక్ లోడింగ్‌లో తిరుగులేని పురోగతి సాధించుకున్నట్టు చెప్పారు. బీమా తదితర రంగాల్లో పెను సంక్షోభం ఏర్పడుతుందని, ప్రజాస్వామిక హక్కుల్లో భాగమైన ట్రేడ్ యూనియన్ హక్కుల ఉల్లంఘనపై సమిష్టి పోరాటం చేయాలన్నారు. ప్రజల విశ్వాసాన్ని, మద్దతును కాపాడుకుంటూ ప్రభుత్వ కుట్రల నుంచి ఎల్ఐసీని రక్షించి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడానికి 74 సంవత్సరాలుగా కృషిచేస్తున్నట్టు తెలిపారు.

రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపోరాటాల ముందు ఏ ప్రభుత్వమైనా దిగదుడుపే అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వాన్ని వ్యతిరేకించిన వారిపై ఈడీ, ఐటీ, సీబీఐతో దాడులు చేయిస్తూ, అరెస్టు చేసి జైళ్లకు పంపుతున్నారని విమర్శించారు. ఎల్ఐసీని నిర్వర్యం చేసే కుట్ర జరుగుతుందని, దాన్ని కాపాడుకోవడానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాగా, ఈ మహాసభలు పలు తీర్మానాలు చేశారు. ఇన్సూరెన్స్ ప్రీమియం మీద విధిస్తున్న 18శాతం జీఎస్టీని వెంటనే ఎత్తివేయాలని, ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. క్లాస్ 3, 4 క్యాడర్లలో ఉద్యోగ నియామకాల్ని వెంటనే చేపట్టాలని, ఏఐఐఈఏకు వెంటనే గుర్తింపు ఇవ్వాలని, కార్మికులకు రూ.26వేల కనీస వేతనాన్ని అమలు చేయాలని తీర్మానం చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఐసీఈయూ కరీంనగర్ డివిజన్ నూతన అధ్యక్షునిగా ఎ.రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వి.వామన్‌రావు, ఉపాధ్యక్షులుగా డి.సూర్యకళ, సంయుక్త కార్యదర్శులుగా పి.బసవేశ్వర్, సి.అనుపమ, ఆర్.రాజేశం, కోశాధికారిగా యం.శ్రీలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, పదవీ విరమణ పొందిన ప్రస్తుత అధ్యక్షులు రవీంద్రనాథ్‌ను ఈ సందర్భంగా జోనల్, డివిజనల్ నాయకత్వం అన్ని శాఖల నాయకులు, సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ మహాసభలో.. యూనియన్ జోనల్ అధ్యక్షులు పి.సతీష్, సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, కోశాధికారి శ్రీనివాసన్, సికింద్రాబాద్ డివిజనల్ ప్రధాన కార్యదర్శి రఘు, ఎల్ఐసీ క్లాస్1 అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యనారాయణ, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ సంఘం నాయకుడు వాసుదేవరెడ్డి, ఏజెంట్ సంఘం నాయకులు గట్టు రాజయ్య, సీఐటీయూ నాయకుడు రమేష్, బ్యాంక్ అధికారుల సంఘం నాయకుడు దామోదర్, ఎల్ఐసీ ఓబీసీ సంఘం నాయకులు సత్తయ్య, ఎల్ఐసీ వాలిక్ సంఘ నాయకులు బుచ్చయ్య, ఎల్ఐసీ పెన్షనర్ సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతం హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల వ్యాప్తంగా 13 ఎల్ఐసీ బ్రాంచ్‌ల నుంచి నాయకులు, సుమారు 200 మంది సభ్యులు పాల్గొన్నారు.



మాదినేని కుటుంబానిది ఉద్యమస్ఫూర్తి

(మొదటిపేజీ తరువాయి)

స్మారకార్థం సీపీఐ(ఎం) కార్యాలయ భవన నిర్మాణానికి రూ.10 లక్షల విలువ చేసే స్థలంతో పాటు రూ. 5 లక్షలు, అలాగే తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయ నిర్మాణానికి రూ. 1లక్ష విరాళంగా ప్రకటించింది. ఖమ్మం జిల్లా చింతకాని మండలం కొదుమూరు గ్రామానికి చెందిన మాదినేని రామలింగయ్య ఈ నెల 2వ తేదీన మృతి చెందారు. అంతకుముందే నాలుగేండ్ల క్రితం ఆయన సోదరుడు నాగేశ్వరరావు సైతం మరణించారు. రామలింగయ్య - నాగేశ్వరరావు స్మారకార్థం సీపీఐ (ఎం) కొదుమూరు గ్రామశాఖ నిర్మించే భవనానికి రూ.10 లక్షల విలువైన స్థలంతో పాటు నిర్మాణ వ్యయంలో రూ.5 లక్షలు, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యాలయం కోసం మరో రూ.లక్ష విరాళంగా ఇస్తున్నట్టు మాదినేని రామలింగయ్య - నాగేశ్వరరావుల కుమారులు, తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, నాయకులు రాధాకృష్ణమూర్తి, రవి, హరీశ్, పుల్లయ్య ప్రకటించారు. గ్రామంలో ఆదివారం నిర్వహించిన మాదినేని రామలింగయ్య సంస్మరణ సభలో ఈ మేరకు వారు ప్రకటన చేశారు. మాదినేని సోదరులు ఉద్యమ స్ఫూర్తిని చాటడం అభినందనీయమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పోతినేని సుదర్శన్, తీగల సాగర్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు.

నిరుద్యోగుల డిమాండ్లు పరిష్కరించండి

- మీ మ్యానిఫెస్టోలోని అంశాలే వాళ్లు అడుగుతున్నారు : సీఎంకు మాజీ మంత్రి టీ హరీశ్‌రావు బహిరంగ లేఖ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో నిరుద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారంనాడాయన ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసారు. రాష్ట్రంలో గ్రూప్స్, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగుల ఆందోళనలు పెరుగుతున్నాయనీ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలనే వారు అమలు చేయాలని కోరుతున్నారని గుర్తుచేశారు. రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేస్తున్న నిరుద్యోగులను ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మీడియా సమావేశంలో ఎలాంటి పరిష్కారాన్ని ప్రస్తావించలేదన్నారు. పోరాటం చేస్తున్న విద్యార్థులను సంఘవిద్రోహ శక్తులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారనీ, ఉస్మానియా యూనివర్సిటీ సహా అభ్యర్థులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీసు బలగాలను మోహరించడం, ఇనుపకంచెలు వేయడం, ముందస్తు అరెస్టులు చేయడం, ఎక్కడికక్కడ నిర్బంధించడం వంటి చర్యలు అప్రజాస్వామికమని తెలిపారు. నిరుద్యోగుల బాధలను ప్రపంచానికి చూపిస్తున్న జర్నలిస్టులను సైతం బెదిరించడం, అరెస్టులు చేయడం, వారిపై దాడులు చేయడం హేయమైన చర్య అనీ, వీటిని తీవ్రంగా ఖండిస్తున్నానని రాసుకొచ్చారు.

తెరుచుకున్న జగన్నాథ ఆలయ రత్న భాండాగారం

- 46 ఏండ్ల తర్వాత...నాలుగు గంటలపాటు ప్రయత్నాలు..
- రెండు గదులు తెరిచి స్ట్రాంగ్ రూమ్ సీజ్


పూరీ : ఎట్టకేలకు ఒడిశా పూరీలోని జగన్నాథ ఆలయానికి చెందిన రత్న భాండాగారం తెరుచుకుంది. రత్నభాండాగార్‌ను చివరిసారిగా 1978లో తెరిచారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలు (ఎస్ఓపీ)ని అనుసరించి అధికారులు ఆదివారం మధ్యాహ్నం 1.28 గంటలకు రత్న భాండాగారాన్ని తెరిచినట్లు శ్రీ జగన్నాథ ఆలయ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ (ఎస్‌జెటిఎ) చీఫ్ అరబింద పాఢీ తెలిపారు. దాదాపు నాలుగు గంటల ప్రయత్నాల తర్వాత రెండు గదులను తెరిచామని, రత్న భాండాగారం లోపలి గది తాళాలు రాకపోవడంతో వాటిని పగులగొట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. "బయటి గదిలోని ఆభరణాలను ఆలయ సముదాయంలోని తాత్కాలిక బలమైన గదికి మార్చాము. అనంతరం స్ట్రాంగ్‌రూమ్‌ను సీల్ చేశాం. లోపలి గదిలో ఆభరణాలు ఉన్న అల్మరాలు, ట్రంక్‌లను చూసినప్పటికీ, సమయాభావం కారణంగా ఆభరణాలను మరొక తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌కు మార్చలేకపోయాము, "అని పాఢీ చెప్పారు. మరో నిర్ణీత తేదీన మిగిలిన పనులు పూర్తవుతాయని, పునరుద్ధరణ తర్వాత ఇన్నర్ ఛాంబర్ యొక్క ఆభరణాల జాబితా అదే స్థలంలో చేయబడుతుందని తెలిపారు. అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక భద్రతా ఏర్పాటు చేశామని పూరీ ఎస్‌పి పినాక్ మిశ్రా తెలిపారు. మొత్తం 11 మంది మాత్రమే రత్న భాండాగారం లోపలికి వెళ్లారని సిపిఎం కార్యాలయం ఒక ప్రకటన చేసింది. వీరిలో ఒడిశా ప్రభుత్వం నియమించిన కమిటీ ఛైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్, కమిటీ సభ్యుడు సిటికె మహంతి, ఆలయ పాలనాధికారి అరవింద పాడి, పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ శంకర్ స్వైన్, పురావస్తుశాఖ ఇంజనీర్ ఎస్‌సి పాల్, పూరీ రాజప్రతినిధితోపాటు ఐదుగురు ఆలయ సేవాయత్‌లు ఉన్నారు. వీడియోను రికార్డు చేయనున్నామని, ఆ వీడియోను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

రత్న భాండాగారాన్ని ఎప్పుడెప్పుడు తెరిచారు?

జగన్నాథ ఆలయం ఉత్తరం వైపున ఉన్న రత్న భాండాగారంలో బలభద్రుడు, జగన్నాథుడు, దేవి సుభద్ర ఆభరణాలున్నాయి. చివరిగా, 1978 మే 13 నుంచి జులై 23 వరకు ఆభరణాలు, విలువైన రాళ్ల సమగ్ర జాబితా తయారు చేశారు. ఈ జాబితా ప్రకారం రెండు గదులలో 454 బంగారు వస్తువులు, 293 వెండి వస్తువులు ఉన్నాయని గుర్తించారు. బంగారు వస్తువుల నికర బరువు 128.38 కిలోలు, 293 వెండి వస్తువులు, వాటి బరువు 221.53 కిలోలు ఉన్నాయని పేర్కొన్నారు. 1805లో 64 నగలు మాత్రమే డాక్యుమెంట్ చేయబడ్డాయి.

1952 నాటికి, శ్రీమందిర్ రికార్డ్ ఆఫ్ రైట్స్ ప్రకారం బయటి గదిలో 150 బంగారు ఆభరణాలు, లోపలి గదిలో 180 బంగారు ఆభరణాలు, 146 వెండి వస్తువులు ఉన్నాయి. 1962లో 602 ఆభరణాలున్నాయని నమోదైంది. 1967లో, 433 ఆభరణాలను మాత్రమే ధ్రువీకరించింది. 2008లో, ఒరిస్సా హైకోర్టు సూచనల ప్రకారం ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ) నిర్మాణాన్ని పరిశీలించినా, లోపలి గదిలోకి ప్రవేశించలేకపోయింది.

24 ఏళ్ల పాలనలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం రత్న భాండాగారాన్ని తెరిచేందుకు ప్రయత్నం చేయలేదు. ఆ భాండాగారాన్ని తెరవాలని కోరుతూ ఒరిస్సా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఏళ్ల తరబడి కోర్టుల్లో కేసులు, వాదోపవాదాల అనంతరం భాండాగారం విషయమై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరిజీత్ పసాయత్ ఛైర్మన్‌గా ఓ కమిటీ ఏర్పడింది. ఈ ఏడాది జులైలో బిజెపి ప్రభుత్వం ఏర్పడటంతో ఆ కమిటీని రద్దు చేసింది. జస్టిస్ బిశ్వనాథ్ రథ్ అధ్యక్షతన 16 మందితో ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నిర్ణయం మేరకు భాండాగారాన్ని తెరవాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది.



ప్రజా వాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు

"పల్లెటూరి పిల్లగాడ/ పసులగాచే మొనగాడ" అని 'మాభూమి' లో పాట రాసిన కవిగానే ఈనాటి తరానికి సుద్దాల హనుమంతు గురించి తెలుసు. ఆయన గేయ రచయిత మాత్రమే కాదు, నిరుపేదల పక్షం వహించిన ఆంధ్ర మహాసభ కార్యక్రమాల నుంచి, కమ్యూనిస్టుల ఉద్యమాల నుంచి సహజాతిసహజంగా పుట్టుకొచ్చిన వాగ్గేయకారుడు. వాగ్గేయకారుడే కాదు, కళాకారుడు, ప్రజల పక్షాన వ్యవస్థతో పోరాటాలు చేసిన ప్రజా యోధుడు కూడా.

వీరోచితమైన హైదరాబాద్ సంస్థాన విమోచన ఉద్యమ ఇతిహాసంలో ప్రజాకవి సుద్దాల హనుమంతు జీవితం- సాహిత్యం ఒక స్ఫూర్తిదాయకమైన అధ్యాయం. రామన్నపేట తాలూకా పాలడుగు గ్రామంలోని పేద పద్మశాలి కుటుంబంలో పుట్టిన హనుమంతు వీధి బడిలోనే ప్రాథమిక విద్యను పొందాడు. ఉర్దూ, తెలుగు భాషలు నేర్చుకున్నాడు. హనుమంతు తాతగారు కృష్ణా వారి కళాకారుడు, హరికథకుడు. తండ్రి బుచ్చి రాములు ఆయుర్వేద వైద్యుడు, కళాకారుడు. తన ఐదుగురు అన్నదమ్ములతో కలిసి ముప్పైఏళ్లపాటు వీధి నాటకాలు ప్రదర్శించిన కళాజీవి. 70 గ్రామాలు తిరిగి ప్రజలకు వైద్యం చేసిన ప్రజా వైద్యుడు.

హరికథలు, బుర్రకథలు, వీధి నాటకాలు, ప్రదర్శన కళల్లో రాటుదేలిన తాత తండ్రుల వారసత్వం, చక్కగా గొంతెత్తి పాడగల శ్రావ్యమైన కంఠస్వరం తనకు వరంగా లభించిన హనుమంతు, అంజయ్య గారి డ్రామా కంపెనీలో సభ్యుడిగా చేరాడు. అప్పటికే ధ్వన్యనుకరణలోనూ, గాన మాధుర్యంలోనూ మునిగి తేలుతున్న హనుమంతు నటనలో తర్ఫీదు పొందాడు. ఆడ, మగ పాత్రలు ఎన్నో ధరించాడు. నటుడిగా పదునెక్కాడు. గాన కోకిలగా గౌరవింపబడ్డాడు.

రావినారాయణరెడ్డి గారి ఉపన్యాసాలతో ఉత్తేజితుడై ఆంధ్ర మహాసభ కార్యకర్తగా, కవిగా, కళాకారుడిగా తెలంగాణ విమోచన ఉద్యమ సాహిత్యంలో విశిష్టమైన స్థానం సంపాదించాడు.

సుద్దాల హనుమంతు కాలంనాటి తెలంగాణ గ్రామాల్లోని ఆర్థిక, సామాజిక పరిస్థితులు చాలా ఘోరంగా ఉండేవి. ప్రజలంతా గ్రామంలోని నలుగురైదుగురు పెత్తందారులకు బానిసలై బతుకుతుంటారు. దారుణమైన వెట్టిచాకిరి, అంతకన్నా దారుణమైన అధికారుల జులుం. నిత్యం తన్నులు, తిట్లు. కచ్చేరీ చావిళ్ల వద్ద వంగబెట్టి మూపున బండలు, బండలే కాకుండా గ్రామ వెట్టిని రైతుల మోపున ఎక్కించి తొక్కించేవారు. పండిన పంటనంతా లెవీలని, తావానులని, నాగులని, నజరానాలని దోచుకునేవారు. బూడిద పట్టి, పెండ్లి పట్టి, సమర్త పట్టీలు సరే సరి. మధ్యయుగాలనాటి భూస్వామ్య దోపిడీని తలపింపజేసేలా ఆ అరాచకం కొనసాగేది. ఆనాటి నిజాం పాలన కాలంలో జమీందారులు, జాగీర్దార్లు, భూస్వాములు వారి తాబేదారులు చేసేటటువంటి కిరాతకాలను ఎదుర్కోవడమే ఆనాటి ఆంధ్ర మహాసభ లక్ష్యమైంది.


రచయితలు, కళాకారులు, గాయకులు గ్రామాల్లో దొరలకు శత్రువులు అయ్యారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వాలంటే సాయుధదళం కాపలా కాసే పరిస్థితులు వచ్చాయి. గాయకులు పాట పాడటమే కాదు, కార్యకర్త కూడా కావలసి వచ్చింది. సంఘం నిర్మించడంలో వారి బాధ్యత చెప్పరానిది. సంఘాలు, దళాలుగా మారిన దశలో కార్యకర్తలు సాయుధులు కావలసి వచ్చింది. ఎర్రబోళ్ళ ఊరిలో హనుమంతు మిలిటరీ శిక్షణ తీసుకున్నాడు. నాటి నుండి ఓ చేతిలో పాట, మరో చేతిలో ఆయుధం పట్టుకున్నాడు. సాంస్కృతిక రంగంలో అనేక వేషధారణలు వేస్తూనే, పోరాట రంగంలో గెరిల్లా ఎత్తుగడలతో పాల్గొన్నాడు.

మహోపన్యాసాలు చొరబారని కోణాల్లోకి తమ పాటల్ని ఈటెలుగా, కాగడాలుగా చేసి జనంలోకి స్వయంగా తీసుకెళ్లాడు. కేవలం పాటల్ని కాకుండా సాధువు, బుడబుక్కలు, ఫకీరు వేషం (దండా గానం), పిట్టలదొర మొదలైన కళారూపాలు రాసి ప్రదర్శించాడు. ఎన్నో భూస్వామ్య వ్యతిరేక గేయాలు రాసి ప్రచారం చేశాడు. ఈ విధంగా హనుమంతు తన రాజకీయ సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూ, రాజీ లేకుండా నిస్వార్థ కమ్యూనిస్టుగా జీవించాడు.

ప్రత్యేకమూ, వైవిధ్య భరితమూ అయిన కళారూపం 'గొల్ల సుద్దులు'. దిక్కూమొక్కూ లేని ప్రజలకు అత్యంత చేరువలో ఉండి అలరించి, ఆలోచింపచేస్తూ ఆచరణాత్మక క్రియాశీలక రాజకీయ అవగాహనతో నిరక్షరాస్యులు కూడా ఉద్యమంలో పనిచేసేందుకు ఊపిరి పోస్తూ వచ్చింది ఈ ప్రజా కళా విశేషం.

కథ, దర్వు, చిత్రకథ అనే ప్రక్రియలుగా ఈ గొల్ల సుద్దులు ప్రదర్శన సాగుతూ ఉంటుంది. పాట రూపంలో ఈ గొల్ల సుద్దులు కార్యక్రమం ఆసాంతం అద్భుతంగా కొనసాగుతుంది. వీటితోపాటు ప్రార్థన, కాలక్షేపం అనేవి కూడా ఉంటాయి. వీటిల్లో స్వాతంత్ర్య సమరం కోసం పడే ఆరాటాలు, సమరాన దూకిన సత్యం సాయం కోరడం వంటి అనేకాంశాల ప్రస్తావన ఉంటుంది.

వీర తెలంగాణను ఒక సాంఘిక యక్షగానం అన్నాడు గనుక, దాని రచనా విధానంలో కొన్ని కొత్త ప్రయోగాలకు అవకాశం కల్పించాడు సుద్దాల హనుమంతు. పాత్రల ప్రవేశం, దరువులు, సంభాషణలు, భాష, పాత్రల చిత్రీకరణ వంటి వాటిల్లో నూతనత్వాలకు తావిచ్చాడు. సాధారణంగా యక్షగానాల్లో ప్రారంభమప్పుడు గణపతి స్తుతి, ఇష్టదైవ ప్రార్థన వంటివి ఉంటాయి. కానీ ఇందులో అటువంటివేమీ లేకుండా సూత్రధారి భారతమాతను ప్రార్థిస్తూ రంగ ప్రవేశం చేస్తాడు. ఇందులో భూస్వాముల నైజం, వారి దోపిడీకి గురైన బడుగు జీవుల దైన్యం, ఆయా పాత్రల ద్వారా బలంగా చిత్రీకరింపబడ్డాయి. ఒక స్త్రీ నాయకత్వంలో ప్రజలంతా ఏకమై... దొరను, కరణాన్ని అంతం చేయడమన్నది యక్షగానం సాధించిన కళా ప్రయోజనం.



> **జీవితాంతం ఒక సాంస్కృతిక కెరటమై, అజేయ ఉద్యమ బాటై ఎగసినాడు సుద్దాల హనుమంతు. నమ్మిన సిద్ధాంతానికి చివరి వరకు కట్టుబడి ఉన్నాడు. పాటకు విరామం లేకుండా, గాయకుడిగా ఇసుమంతైనా అలసిపోకుండా ఆడుతూ పాడుతూ, అక్షర జ్ఞానం లేని అభాగ్యులు మొదలుకొని ఉద్యమకారులందరిలో చైతన్యం రగిలించిన మహానుభావుడు ఆయన. నేటి తరానికి సుద్దాల హనుమంతు గురించి తెలియని పరిస్థితుల్లో ఎంతో శ్రమించి, ఎక్కడెక్కడో సుద్దాల హనుమంతు మీద వచ్చిన వ్యాసాలను, ఆయన రచనలను సేకరించిన సమగ్ర సంకలనం 'ప్రజాకవి సుద్దాల హనుమంతు సమగ్ర సాహిత్యం - జీవితం' పుస్తకం**

పాటలు: ఆనాటి దుష్ట పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న తెలంగాణ రణక్షేత్రంలో ఒక సాంస్కృతిక సేనానియై ఎగసిన సమరకేతనమే సుద్దాల హనుమంతు. ఎక్కడ ఏ రూపంలో అన్యాయం, అక్రమాలు చెలరేగినా, వాటిని గ్రహించి నిలిచిన వీరకిశోరమానాడు. సతతం ప్రజల పక్షాన నిలుస్తూ, తన సర్వస్వాన్ని పోరుబాటలో సమిధను చేశాడు.

కిరాయి మూకల దుష్కృత్యాలు నిజాం పాలనలో భాగంగా మారాయి. మతం పేరుతో కొంత, భాష పేరుతో మరికొంత అలవిమాలిన అకృత్యాలు నిత్య కృత్యాలైనాయని ఒక పాటలో వివరించారు. "ఈ భూమి నీదిరా/ ఈ నిజాం ఎవడురా" అని ఊరురా తిరుగుతూ ప్రజా చైతన్యాన్ని రగిలించారు. "దెబ్బకు దెబ్బ వేయ్" అనే గీతానికి 70 సంవత్సరాల వృద్ధురాలు పిలిపే సుద్దాల హనుమంతుకు ప్రేరణ అయింది. సంఘం అంటే ఆనాడు నిర్మాణయుతమైన ఉద్యమానికి ఆధారం. సంఘ నిర్మాణ గీతాల ద్వారా రైతు కూలీలను, మహిళలను అధిక సంఖ్యలో కూడగడుతూ వచ్చారు. "లేరా జాగేలా" గేయంలో సార్వజనీయమైన అభ్యర్థన ఒకటి వినిపిస్తుంది. వెట్టి చాకిరి అరికట్టాలని ఒక గీతంలో పిలుపునిస్తారు. "అమరవీరులకు జోహార్లు" చెప్పుకోవడంతో పాటు వారి త్యాగాలు వృధా కాకూడదని వారు ఆశిస్తారు.

ప్రజా ప్రభుత్వాన్ని స్థాపిస్తామన్న ఆత్మవిశ్వాస ప్రకటన సామ్యవాదం కోసం అనే గేయం. "ఇంకెన్నడు సోషలిజం" అనే గేయాన్ని రచించినప్పుడు అధికార పార్టీ ఏదో వెలగబెడుతుంది అనుకున్న కలలు అనతి కాలంలోనే కల్లలు కావడాన్ని ప్రస్తావిస్తారు. "ఎందుకు భయం" లో ఎంతకీ ఆరిపోని ఒక మహదాకాంక్షను వెల్లడిస్తూ ఆశావహ దృక్పథాని వ్యక్తపరుస్తాడు. దేశానికి స్వాతంత్రం వచ్చి 34 సంవత్సరాలు అయినప్పుడు రాసుకున్న గేయం "ఎన్నాళ్ళీ కష్టకాలం". ఇంతటి సుదీర్ఘకాలం గడిచినప్పటికీ రైతుల కష్టాలన్నీ తొలగిపోయి సమస్యలన్నీ తుడిచిపెట్టుకుపోయి ఉండాలన్నది సుద్దాల హనుమంతు అభిప్రాయం.

బాలల పలు కష్టాలు, కడగండ్ల మీద ఆసాంత కరుణారసోద్రేకమైన గేయాన్ని- కసితో కూడిన తీవ్ర వేదనతో సృజించిన అరుదైన ఏకైక మహోద్యమ కళాకారుడు కవి సుద్దాల హనుమంతు. అతని "పల్లెటూరి పిల్లగాడా" గీతం బాల కార్మిక వ్యవస్థ మీద విసురుగా ఎక్కుపెట్టిన ఒక సార్వకాలిన అసామాన్య సాంఘిక శాస్త్రం. "శివ గోవిందా", "నందామయ గురుడ నందామయ" అనే తత్వాల కోవలో బూర్జువా రాజకీయ పార్టీల అరాచకత్వాన్ని, దోపిడిని ఎండగట్టిన విధానం బాగుంది.

జీవితాంతం ఒక సాంస్కృతిక కెరటమై, అజేయ ఉద్యమ బాటై ఎగసినాడు సుద్దాల హనుమంతు. నమ్మిన సిద్ధాంతానికి చివరి వరకు కట్టుబడి ఉన్నాడు. పాటకు విరామం లేకుండా, గాయకుడిగా ఇసుమంతైనా అలసిపోకుండా ఆడుతూ పాడుతూ, అక్షర జ్ఞానం లేని అభాగ్యులు మొదలుకొని ఉద్యమకారులందరిలో చైతన్యం రగిలించిన మహానుభావుడు ఆయన.

నేటి తరానికి సుద్దాల హనుమంతు గురించి తెలియని పరిస్థితుల్లో ఎంతో శ్రమించి, ఎక్కడెక్కడో సుద్దాల హనుమంతు మీద వచ్చిన వ్యాసాలను, ఆయన రచనలను సేకరించి సమగ్ర సంకలనంగా 'ప్రజాకవి సుద్దాల హనుమంతు సమగ్ర సాహిత్యం - జీవితం' పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయం. వీటితోపాటు చివరగా "స్మృతి గీతాలు" పేరిట 11 మంది కవులు రాసిన గేయాలు ఉన్నాయి. "మిత్రుల జ్ఞాపకాలు"లో 11 వ్యాసాలు ఉన్నాయి. ఆఖరున జయధీర్ తిరుమలరావు చేసిన ఇంటర్వ్యూను చేర్చడం బాగుంది. ప్రస్తుతం వస్తున్న యూనివర్సిటీ సిద్ధాంత గ్రంథాల కంటే మిన్నగా ఈ పుస్తకం రూపొందించడంలో సంపాదకుడు కె ఆనందాచారి తీసుకున్న శ్రద్ధ, చేసిన కృషి ప్రశంసనీయం.

(ఈ నెల 16న సాయంత్రం 5 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పుస్తక ఆవిష్కరణ సభ)



- కె.పి అశోక్ కుమార్
9700000948

కల్లోల ప్రయాణం

నది ప్రవాహం లోకి దిగినప్పుడు
నదిని ఆసాంతం స్పర్శించకుండా బయట పడే విద్య తెలియదు
నది ఒడ్డుకు చేరిన తర్వాత
అనుభవాన్నే కాని నదిని వెంట తెచ్చుకోవడం తెలియదు
నదిని ఒడిసి పట్టడం మనిషి తరమా?
నిండా మునిగినంక
దాని ప్రభావం నుంచి వెలుపల నిలబడే వాడెవడు?
కలల్ని మర్చిపోవడం జరుగుతూ వుంటుంది
కల్లోల జీవితాన్ని మరవడం సాధ్యమా?
తీపిని కాని చేదును కాని సమ పాళ్ళలో జిహ్వకు అందించడం
చర్యకు ప్రతి చర్య వెన్నతో పెట్టిన విద్య
కలల్ని కనని వాడు పీడ కలల్ని తలవని వాడు
ఎలా సుఖంగా జీవిస్తాడు
నదిని దాటి పడవను మర్చినట్టు!
నదిలోకి దిగినంత తేలికగా కలల్లోకి ప్రవేశించవచ్చు
కలల్ని తనతో వెంట తెచ్చుకోవడమే జీవిత సాధన
వడిసి పట్టాలనే కదా ప్రాకులాట
సకల జనారణ్యం కలల్ని కంటూనే వుంటుంది
నత్తగుల్లకూ ఓ కల వుంటుంది
నది నుంచి బయటపడ్డట్టు కలల్లోంచి బయట పడలేం
నదిలో స్నానించి నీళ్ళు అంటనట్టు
తడిని తుడుచుకోవడం ఇక్కడ చెల్లదు
నిప్పులో కాలిన గాయం బర్రలాంటిది
శరీరానికి అంటే వుంటుంది
కలల్ని మోయడం తల్లి బిడ్డను ప్రసవించినట్టే
దానికి కుడా రక్తమాంసాలు అంటి వుంటాయి
సాధనలో జీవితం, జీవి సమస్తం అంతరిస్తాయి
కలలు నీళ్ళ జలతారు, జీవితం ముఖమల్ దుప్పటిని పోలి
రెండు మెరుస్తుంటాయి జీవిత కలలు
ప్రభావ ప్రయాణం తీరని దాహం.

-హనీఫ్, 9247580946

డా॥అమ్మంగి వేణుగోపాల్‌కు మఖ్దూమ్ మొహియుద్దీన్ నేషనల్ అవార్డు ప్రదానం


సిటీకాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ నేషనల్ అవార్డును డా॥ అమ్మంగి వేణుగోపాల్‌కు ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రభుత్వ సిటీ కాలేజ సమావేశమందిరంలో ప్రదానం చేస్తారు. ఈ సభలో ఆచార్య పి.బాలభాస్కర్, డా॥ముదిగంటి సుజాతారెడ్డి, డా॥యాకూబ్, వాహెద్, డా॥ఏలూరి యాదయ్య, డా॥జె.రత్న ప్రభాకర్, డా॥విష్ణవ్ దత్ శుక్లా, డా॥కోయి కోటేశ్వరరావు పాల్గొంటారు.

సుఖమంచి కోటేశ్వరరావుకు తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక రంగస్థల పురస్కారం

ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు సుఖమంచి కోటేశ్వరరావుకు 25వ తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక రంగస్థల పురస్కారాన్ని జులై 21 సాయంత్రం 5.00 గంటలకు ఠాగూర్ గ్రంథాలయం, విజయవాడలో ప్రదానం చేయనున్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొంటున్నారు. 25 మంది సాహితీవేత్తలకు, కళాకారులకు సత్కారం ఉంటుంది.

- తంగిరాల ట్రస్టు చైర్మెన్ తంగిరాల చక్రవర్తి

దర్ద్ రహిత భారతం 'దర్ద్' స్వప్నం




- రాచపాళం చంద్రశేఖరరెడ్డి

**ఈ దేశమంటే/
భిన్నత్వంలో మనల్ని కలిపి కుట్టిన ఏకత్వం.
ఈ దేశమంటే మట్టికాదు,
మతమంతకంటే కాదు, ఈ దేశమంటే
మనందరి అస్తిత్వం (చాంద్‌ఉస్మాన్, దర్ద్)**

భారతదేశం ఒంటిస్తంభపు మేడ కాదు. బహుళత్వానికి నిలయం. భారతీయ జీవితం, దాని సారమైన భారతీయ సంస్కృతి బహుళత్వ శిల్పాలు. అందుకే భారతీయ సంస్కృతిని భిన్నత్వంలో ఏకత్వం అని నిర్వహించుకున్నది. ఈ బహుళత్వానికి చారిత్రక కారణాలున్నాయి. అనేక కులాలు, మతాలు, భాషలు, వేషాలు, ఆహారాలు, వివాహ పద్ధతులు సహజీవనం చేస్తున్న దేశం మనది. ఇవన్నీ భారతీయ జీవితంలోని చారిత్రక పరిణామంలో క్రమంగా ప్రవేశించాయి. ఈ వైవిధ్యాన్ని భారతదేశం ఆమోదించింది. వాటి మధ్య వైరుధ్యాలుంటే, ప్రజాస్వామికంగా పరిష్కరించుకోవటం సరైన పద్ధతి. ఈ వైవిధ్యాన్ని తుడిపేసి లేదా తొక్కిపెట్టి, ఒంటి స్తంభపు మేడ కడతామనడం, అందుకనుకూలంగా మాట్లాడడం, చర్యలకు దిగడం అప్రజాస్వామికం, నిరంకుశత్వం. రాజ్యాంగ ఉల్లంఘన కూడా.

"చెట్టాపట్టాల్ పట్టుకుని దేశస్థులంతా నడవవలెనోయ్/ అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నీ మెలగవలెనోయి/ మతం వేరైతేను యేమోయ్ మనసు లొకటై మనుషులుంటే" అని గురజాడ 1910 లోనే ప్రబోధించి మతసామరస్యాన్ని ప్రతిపాదించారు. అప్పటి నుండి అనేకమంది కవులు మత సామరస్య ప్రచారం చేశారు. ప్రజలూ సామరస్యంగానే వుంటున్నారు. పాలకులు రాజకీయ అవసరాల కోసం మత ఘర్షణలకు ఆజ్యం పోస్తున్నారు. ఇది భారతదేశం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య. మత సామరస్యం ఇప్పటి భారతీయ అవసరం. ఏ రకమైన ఆధిపత్యమూ లేని దేశమే ఆధునిక దేశం. భారతదేశం అనేక ఆధిపత్యాలతో సతమతమవుతున్నది. దాని నిర్మూలనకు ఉద్యమాలు సాగుతున్నాయి. ఆధిపత్యాలలో మతాధిపత్యం ఒకటి. ఎంతో వెనక్కి పోకుండా గత ఈ మూడు దశాబ్దాలలో మతాధిపత్యం భారతదేశంలో సృష్టించిన విధ్వంసం చూసినా మత సామరస్యం విలువ ఎంతటిదో తెలుస్తుంది. ఈ రకమైన ఆధిపత్య వాదులు తెలుసుకోవలసిందేమిటంటే దేనినీ శాశ్వతంగా అణగదొక్కలేం అన్నది. బంతిని ఎంత కిందికి విసిరేస్తే అది అంత పైకి లేస్తుందన్నది వాస్తవం. ఈ అణగదొక్కే నిరంకుశత్వం మీద నిరసనగా వచ్చిందే 'దర్ద్' కవిత్వ సంకలనం.

మూడు దశాబ్దాలుగా పుంఖానుపుంఖాలుగా వస్తున్న ముస్లిం అస్తిత్వ వాద కవిత్వానికి 'దర్ద్' కొత్త చేర్పు. గత పదేళ్లుగా ముస్లింలకు ఆధిపత్యవాదుల నుండి ఎదురౌతున్న సవాళ్లను ప్రతిఘటిస్తూ వచ్చింది ముస్లిం వాద కవిత్వం. దర్ద్ ఆ క్రమంలో వచ్చిందే.



దర్ద్ అంటే నొప్పి, బాధ, దు:ఖం. తమను ఆధిపత్య వాదులు అనుమానించడం, అవమానించడం, అణచివేయడం, తమ ఉనికికి ఆధారాలు అడగడం, పాకిస్తాన్‌కు వెళ్లిపొమ్మనడం, అనేక రకాలుగా నిర్బంధించడం, దుష్ప్రచారాలు చేయడం వంటి అమానవీయ పరిణామాల వల్ల కలిగిన బాధ దర్ద్ సారం. ఈ కావ్యంలో పరోక్షంగా ఆర్యుల రాక నుండి ప్రత్యక్షంగా గుజరాత్ గాయం నుండి సరిగ్గా ఇటీవల కొత్త చట్టాలతో ఒత్తిడి చేయడం, దానివల్ల సంభవిస్తున్న పరిణామాలను ముస్లిం కవులు విమర్శనాత్మంగా ప్రతిపాదించారు. తమ సమస్యలను గుర్తించి, వాటికి కారణాలను తెలుసుకొని, వాటికి పరిష్కారాలనూ చెప్పారు దర్ద్ కవులు.

దర్ద్ కవులు ముక్త కంఠంతో చెబుతున్నది తాము ఈ దేశ మూలవాసులమేనని. తాము ఎక్కడి నుండో వచ్చినవాళ్లం కాదని.

'మేము ముసల్మానులం/ మూలవాసులం' (షాజహాను) అన్నది ఈ కావ్య నినాదం. తాము భారతదేశంలో పుట్టి, జీవించి, భారతదేశంలోనే మరణిస్తున్న కోట్లాది భారతీయులలో భాగమని దర్ద్ కవులు చెబుతున్నారు.

'ఈ నేలపైనే పుట్టాను, ఈ మట్టిలోనే కలుస్తాను' (షైజవదీఫ్), **'ఈ దేశమూలవాసులం/ ఈ మట్టిలోనే పుట్టి/ ఈ మట్టిలోనే పెరిగి/ ఈ మట్టిలోనే మట్టయ్యేటోళ్లం'** (ఎస్.ఖుర్షీద్), **'నా వేషం నా భాష వేరయినా/ నేను ఈ దేశపు మూలవాసిని కానా?'** (జాబిలి చాంద్‌భాష).

'నా రక్తంలో ఈ దేశం వుంది' అనగలిగేంత స్థిరచిత్తంతో మాట్లాడుతున్న 'దర్ద్' కవులు. ఆర్యులు రాకముందు భారతదేశంలో ఉన్నవాళ్లు మూలవాసులు. ఆర్యుల రాకతో, వర్ణ వ్యవస్థ ఆవిర్భావంతో, మూలవాసులు అంటరానివాళ్లయ్యారు. వాళ్లు ఇప్పటి భాషలో దళితులు. ఆర్యులు సృష్టించిన మతం దళితులను అనేక రకాలుగా కట్టడి చేసింది. అవమానించింది. అదంతా ఒక చరిత్ర. కాలక్రమంలో మధ్యయుగాలలో భారతదేశంలోకి ముస్లిం పాలకులు వచ్చారు. ఇస్లాం మతంలో కులం లేదు. అందువల్ల ఆధిపత్య మతంలో అవమానాలు, అణచివేతలు అనుభవిస్తున్న మూలవాసులు కుల వివక్ష లేని ఆ మతంలోకి వెళ్లారు. అలా మూలవాసులు ముస్లిములయ్యారు. ఈ వాస్తవాన్ని దర్ద్ కవులనేకులు ప్రస్తావించారు. అఫ్సర్ కంచికచర్ల కోటేశును, అఖ్లాక్, షమ్సీ తబ్రీజ్ అన్సారీలను కలిపి చెప్పడంలో ఈ చరిత్ర ధ్వనిస్తున్నది.

కులమతాల ద్వారా మాత్రమే మనుషులను గుర్తించే దుర్మార్గ పద్ధతిని అధిక్షేపించి, అందరినీ మనుషులుగా గుర్తించండి అని యాకుబ్ గుర్తుచేశారు. **'మతము ఏదైతేను ఏమోయి?'** అని గురజాడ అన్నట్లు యాకుబ్ **'అవును, ముస్లింగానే పుట్టాను/ అయితే ఏంటి/ నేనూ మనిషినే'** అన్నారు. విశ్వాసాలు, వేషభాషలు ఎవరివి వాళ్లవైనా, అందరిలోనూ ఎర్రరక్తమే ఉన్నది అని యాకుబ్ ఎరుక పరిచారు. దర్ద్ కవులు ఫ్రెంచ్ విప్లవం అందించిన, డా॥బి.ఆర్.అంబేద్కర్ ప్రచారం చేసిన సౌభ్రాతృత్వ భావనను నొక్కి చెప్పారు. **'నేను మీలో ఒకడిని/ నాలో ప్రవహించే రక్తం/ ఈ దేశపు మట్టి రేణువుల సంగమమే'** (జాబిలి).

మొత్తం భారతీయ ప్రజాశ్రేణుల నుండి తమను వేరుచేసి చూడవద్దన్నది దర్ద్ కావ్య ప్రతిపాదన.

'చరిత్ర రాసుకోలేదు కానీ/ దేశ బలిదానాల్లో/ నా జాతి త్యాగాలెన్నో వున్నాయి గదా' (అన్వర్).

'ఈ దేశ స్వాతంత్ర్య పోరాటంలో/ ఎందరో ముస్లిములు అపూర్వ త్యాగాలతో/ అసమాన బలిదానాలతో/ మన మాతృభూమి/ విముక్తి పోరాటంలో పునీతులయ్యారు' (చీకటి మహ్మద్‌రఫీ). అందరితో పాటు దేశం కోసం పాటు పడిన, పాటుపడుతున్న దేశభక్తిని శంకించడం పట్ల దర్ద్ కవులు ఆవేదన చెందుతున్నారు. ఇబ్రహీం నిర్గుణ్ భారతీయ ముస్లిములు విభిన్న రంగాలలో రాణించి భారతదేశ కీర్తి ప్రతిష్టలను పెంచిన వారని గుర్తుచేశారు.

'ఈ మట్టి పేగు బంధంతో ఉరికబంభమెక్కిన అష్ఫా ఖుల్లాఖాన్‌లు/ ప్రపంచ పటంలో దేశానికో గుర్తింపునిచ్చిన అబ్దుల్ సలాలు/ వీధుల్ని నిద్రలేపి ఆటైన సప్దర్ హష్మీలు'

వీళ్ల చరిత్రను విస్మరించి, ముస్లిముల ఔన్నత్యాన్ని శంకించడంలోని అనౌచిత్యాన్ని దర్ద్ కవులు ప్రశ్నిస్తున్నారు.

గ్రామీణ ముస్లిములు, మిగతా ప్రజలతో ఎలా అన్యోన్యంగా కలిసి జీవిస్తారో వర్ణించారు నిసార్. **'పల్లెటూళ్లో ఉండేటి ముస్లిములము/ అరబ్బీ ఉర్దూ రానోళ్లము/ అంతా తెలుగులోనే సదువుకున్నోళ్లము.../ ఎవరింటికెళ్లినా వరసుంటది/ రక్త సంబంధమోలె పల్లె కలిసుంటది'.**

మా పుట్టుక, చావు, ఈ దేశంలోనే అనడమే కాదు... **'మరో జన్మంటూ వుంటే/ ఈ భారతభూమిలోనే జన్మించాలని వుంది'** అన్నారు గౌస్ భాషా.

'మనిషి మాత్రమే నిజమనే/ మనుషులు కావాలిప్పుడు'

ఇటీవల జన గణన కోసం పాలకులు రూపొందించిన రెండు చట్టాలు చాలా వివాదాస్పదమయ్యాయి. ఆ చట్టాలలో పౌరసత్వాన్ని నిరూపించుకునే ఆధారాలు చూపించే నియమం పట్ల దర్ద్ కవులు ఆవేదన చెందారు. పేదరికం, అవిద్య, నిరాదరణలకు గురైన ముస్లిములు భద్రత కోసం నిరంతరం యుద్ధం చేస్తున్న ముస్లిములు, తమ ఉనికికి సంబంధించిన ఆధారాలు చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోవాలంటే సాధ్యమేనా అని దర్ద్ కవులు ప్రశ్నిస్తున్నారు.

'నేనిక్కడే పుట్టాను/ అన్న ఒక్క నిజం తప్ప/ నేనీదేశ వాసిని అని/ చెప్పడానికి నా దగ్గర/ ఏ పత్రాలూ లేవు' అని ముహమూద్ స్పష్టం చేశారు. అభివృద్ధికి, ఆధునికతకు నోచుకోని సామాన్య ముస్లిముల తరపున సాబిర్, స్కైబాబాలు పుట్టుకకు ఆధారాలు చూపాలన్న నియమానికి సూటిగా సమాధానం చెప్పారు.

'నువ్వు భారతీయుడివేనా/ అంటూ గదమాయిస్తావ్/ నాకేమీ దిక్కుతోచక/ పిడికెడు మట్టి తీసి చూపిస్తా' (సాబిర్)

'ఎవడు గుర్తింపు పత్రాలు అడిగినా/ గుప్పెడు మట్టి తీసి చూపిస్తాను/ ఈ మట్టి బిడ్డను నేను' (స్కై బాబా)

పాత్రికేయుని గుడ్డలు విప్పి మత నిర్ధారణ చేసిన దుర్మార్గాన్ని దర్ద్ కవి తీవ్రంగా గర్హించారు. ముస్లిములు ఎదుర్కొంటున్న వివక్షల విషయంలో మాట్లాడవలసిన ముస్లిమేతర లౌకిక వాదులను నోరు విప్పమని కోరుతున్నారు స్కైబాబా. **'స్నేహితులుగా వున్నవాళ్లు/ మతం విషయం వచ్చేసరికి/ మౌనం వహించడం పట్ల/ మౌనం నన్ను బాధిస్తున్నది'** అని ఆవేదన పడ్డారాయన. గుర్తింపుల విషయంలో ముస్లిములకు, ఆధిపత్య వాదులకు మధ్య వున్న తేడాను ఆయన ప్రస్తావించారు... **'వారు చూపమన్న ఆధారాలు ఇద్దరమూ చూపలేకున్నా/ నువ్వు బొట్టు చూపించి వాణ్ణి మచ్చిక చేసుకోవచ్చు/ చూపించడానికి వాడికి కావలసింది నా దగ్గరేముందిరా/ నిన్ను అమితంగా ప్రేమించే నా హృదయంతప్ప'.**

ఎం.హెచ్.ముజాహిద్ ముస్లిమేతర మూలవాసి సోదరుల సహకారం అవసరమైతే తమ పట్ల చూపబడుతున్న వివక్ష అమానుషాలను ప్రతిఘటించడానికి ఈ దర్ద్ కవి సిద్ధమయ్యారు.

'కలిసిపోరాడితే పోయేదేముంది/ ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్రం కూడా/ కెరటమై కాళ్లను ముద్దాడుతుంది' (ఎస్.జవేరియా).

'ఈ దేశం ఈ దేశ మూలవాసులదే/ మేమంతా ఏకమైన నాడు/ నీ ఆటలు సాగవు గాక సాగవు' (ఎస్.ఖుర్షీద్)

ఒకే సమాజంలో నివసిస్తున్న ప్రజాశ్రేణుల మధ్య ఐక్యతను కోరుకుంటున్నది దర్ద్ కావ్యం. కవిత్వమంటే ఇదీ. కవిత్వం ఇలాగే వుండాలనే కొలమానాలతో దర్ద్‌ను పరిశీలించడం మాని, ఈ కవుల ఆవేదనను అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్య భారతదేశం భూస్వామ్య లక్షణాలను విదిలించుకుని శాస్త్రీయ, మౌలిక ప్రజాస్వామ్య దేశంగా రూపొందాలని దర్ద్ కవుల ఆకాంక్ష.

ముస్లిం సాహిత్య ప్రచురణ, ప్రచారాలలో ఉద్యమ స్ఫూర్తితో పని చేస్తున్న మిత్రుడు, ఈ కావ్య సంకలన కర్త స్కైబాబాకు అభినందనలు



ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకురావాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు





నవతెలంగాణ - బోనకల్

బూర్జువా, కమ్యూనిస్టు రాజకీయాలపై ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకురావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. మధిర మండల పరిధిలోని దెందుకూరులోని శ్రీరస్తు ఫంక్షన్‌హాల్‌లో సీపీఐ(ఎం) జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. తరగతుల ప్రారంభ సూచికంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తరగతులను పోతినేని సుదర్శన్‌రావు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తుందన్నారు. ఈ తరగతులలో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై అవగాహన కల్పించేందుకే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా తరగతుల వలన దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. ప్రస్తుతం, వర్తమాన రాజకీయాలపై అవగాహన లేకుండా కమ్యూనిస్టు రాజకీయాలు చేయలేమన్నారు. రాజకీయ సిద్ధాంతం లేకుండా కమ్యూనిస్టులు ముందుకు పోలేరన్నారు. ఇటీవల జరిగిన లోకసభ, శాసనసభ ఎన్నికలలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయన్నారు. ఆ పరిణామాలపై కమ్యూనిస్టు కార్యకర్తలు పూర్తి అవగాహన కలిగి ఉండకపోతే కమ్యూనిస్టుగా మనకు నష్టం జరుగుతుందన్నారు. ఈ రెండు ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ఒక ప్రధానమైన శక్తిగా ఎదిగిందన్నారు. ఎవరూ ఊహించని విధంగా ఎనిమిది పార్లమెంటు స్థానాలను గెలిచిందన్నారు. బిజెపి గెలుపు కమ్యూనిస్టు రాజకీయాలకు ప్రమాదకరమన్నారు. రాష్ట్ర, దేశ రాజకీయాల్లో అనేక అనూహ్య రాజకీయ పరిణామాలు వేగంగా ముందుకు వెళుతున్నాయన్నారు. వర్తమాన, భవిష్యత్తు రాజకీయాలపై కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు అవగాహన పెంచుకోవాలన్నారు. బూర్జువా రాజకీయాలు రాష్ట్ర ప్రజలకు నష్టం కలిగిస్తాయన్నారు. కమ్యూనిస్టు రాజకీయాలు ప్రజలకు మేలు చేస్తాయన్నారు. ఈ విషయాలపై కమ్యూనిస్టు నాయకులకు, కార్యకర్తలకు అవగాహన లేకపోతే ప్రజలలో అవగాహన కల్పించలేమన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు హాజరైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తు పోరాటాలకు పునాది వేసుకోవడానికి ఈ రాజకీయ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. ఈ తరగతుల వల్ల కమ్యూనిస్టు అనే వ్యక్తికి రాజకీయంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను క్షేత్రస్థాయిలో కమ్యూనిస్టులు మాత్రమే ప్రజలకు వివరించగలుగుతారన్నారు. మిగతా బూర్జువా రాజకీయ పార్టీలకు అధికారం తప్ప ప్రజా ప్రయోజనాలు పట్టవన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి మతోన్మాద విధానాలతో ముందుకు సాగుతుందని, ఇది దేశ ప్రయోజనాలకు ప్రమాదకరమన్నారు. ఈ ప్రమాదం గురించి ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకురావాల్సిన అవసరం కమ్యూనిస్టులపైనే ఉందన్నారు. ఈ శిక్షణ తరగతులలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, యనమదల విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు మన్నేపల్లి సుబ్బారావు, జిల్లా ఎకడమిక్ సెల్ సభ్యులు బండారు రమేష్, మధిర మండల నాయకులు శీలం నరసింహారావు, మంద సైదులు, మండవ ఫణీంద్ర కుమారి, అనుమోలు భాస్కరరావు, పాపినేని రామ నరసయ్య పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల ఫ్రాక్షన్ కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ జూనియర్ అసిస్టెంట్ పరీక్షపై అవగాహన సదస్సు

- ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు తూములూరి

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్(క్లర్క్) ఉద్యోగాల కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో పాల్గొనే ఆర్టీసీ ఉద్యోగులు విజేతలు కావాలని రాష్ట్ర ప్రభుత్వ గ్రూప్ వన్ అధికారి,స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ మాజీ రాష్ట్ర నాయకులు తూములూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని మంచికంటి సమావేశ మందిరంలో తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సిఐటీయూ)ఖమ్మం రీజియన్ కమిటీ ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ పోటీ పరీక్షల అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో తూములూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరీక్ష పరీక్ష రాయబోయే అభ్యర్థులకు పలు విలువైన సూచనలు చేశారు. పరీక్ష పేపర్ ఎలా ఉంటుందని,ఏ ఏ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు, ఎలా రాయాలి, డ్యూటీ చేస్తూనే ఎలా సమయం కేటాయించి చదువుకోవాలి, పరీక్షలకు సంబంధించిన మూడు రకాల పుస్తకాల గురించి ఆయన విపులంగా వివరించారు. ఈ సదస్సులో రీజియన్ పరిధిలోని ఏడు డిపోల నుంచి అధిక సంఖ్యలో జూనియర్ అసిస్టెంట్ పరీక్షలు రాసే ఉద్యోగులు .క్లాస్ విన్న ఉద్యోగులు చాలా సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంబాబు, పిట్టల సుధాకర్, జిల్లా ప్రచార కార్యదర్శి తోకల బాబు, ఖమ్మం డిపో సెక్రెటరీ రోశయ్య, సహాయ కార్యదర్శి పద్మ, ఉపాధ్యక్షులు సునీత, డిపో కోశాధికారి సరిత, నాయకులు ఎం.డి పర్వేజ్, వి.సురేష్, సుజాత, ఏ.వెంకటేశ్వర్లు, గుజ్జు కృష్ణ, దయాకర్, జి.లింగయ్య, పి.రమ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాయర్‌గా ప్రొద్దుటూరు గ్రామ వాసి

నవతెలంగాణ-బోనకల్(చింతకాని)

చింతకాని మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామానికి చెందిన కూరపాటి సుజాతను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ)గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో ప్రాతినిధ్యం వహించేందుకు 19 లాయర్లను హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్లుగా నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి ఆర్ తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. అందులో ప్రొద్దుటూరు గ్రామ వాసి కూరపాటి సుజాత ఒకరు. కూరపాటి వెంకటేశ్వర్లు, భద్రమ్మ దంపతుల కుమార్తె సుజాత. సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన సుజాత విద్యాభ్యాసం ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు ప్రొద్దుటూరు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో, 8వ తరగతి నాగలవంచ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో, 9, 10వ తరగతి ఖమ్మం పట్టణంలోని బాలికల హైస్కూల్, ఇంటర్ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల హైదరాబాద్, డిగ్రీ అంబేద్కర్ కళాశాల బాగ్ లింగంపల్లి, ఎల్ఎల్‌బి పానసీయ లా కాలేజీ హైదరాబాదులో పూర్తి చేశారు. 1996లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్లో పేరు నమోదు చేసుకున్నారు. హైకోర్టులో కె వి భాను ప్రసాద్ వద్ద జూనియర్‌గా పనిచేశారు. పలు కేసుల పరిష్కారంలో అంకితభావంతో పనిచేసి అందరు మన్ననలను పొందారు. ఈ సందర్భంగా ఖమ్మం లాయర్లతోపాటు, ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

అంగన్వాడీ సెంటర్‌కు 'కుర్చీలు' వితరణ



నవతెలంగాణ-సత్తుపల్లి

బీసీసంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ తన జన్మదినం సందర్భంగా స్థానిక మసీదు రోడ్డులోని అంగన్వాడీ సెంటర్‌కు ఆదివారం కుర్చీలను వితరణ చేశారు. అంతకు ముందు బీసీసంఘం ప్రాంతీయ కార్యాలయంలో శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేక్‌కట్ చేశారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్‌చేసి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో బీసీసంఘ రాష్ట్ర నాయకులు తేళ్ల రమేశ్, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు తోట సుజలరాణి, సంఘ నాయకులు మల్లెల్లి శ్రీనివాస్, లింగన్న, పుల్లారావు, మరీదు ప్రసాద్ పాల్గొన్నారు.

భర్తే కాలయముడు

- భార్య, ఇద్దరు కుమార్తెలను హతమార్చి... రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ
- నిందితుడు అరెస్టు..రిమాండ్‌కు తరలింపు



నవతెలంగాణ- ఖమ్మం

రఘునాథపాలెం మండలం మంచుకొండ పంచాయతీ హర్యతండాకు చెందిన ఓ తల్లి, ఇద్దరు కుమార్తెల మృతిపై మిస్టరీ వీడింది. భర్త...భార్యను, ఇద్దరు పిల్లల్ని హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినట్లు విచారణలో తేలింది. 45 రోజుల తర్వాత శవపరీక్ష నివేదికలో ఈ విషయం నిర్ధరించారు. విషం కలిపిన ఇంజక్షన్ ఇచ్చి భార్యను హత్య చేసినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. ఈ మేరకు నగర ఏసీపీ రమణమూర్తి రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.

మే 28న బాబోజీతండాకు చెందిన డాక్టర్ బోడ ప్రవీణ తన భార్య కుమారి(25), కుమార్తెలు కృషిక(4), తనిష్క(3)తో కలిసి కారులో హర్యాతండాకు బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో రోడ్డు ప్రమాదం జరిగి భార్య, కుమార్తెలు మరణించినట్లు సృష్టించడం జరిగింది. ప్రవీణ్ మాత్రం స్వల్పగాయాలతో బయటపడడంతో ప్రమాదం కేసుగా పోలీసులు నమోదు చేశారు. అయితే మృతురాలి కుటుంబసభ్యులు హత్యగా ఆరోపించడంతో దర్యాప్తు చేసిన పోలీసులు విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. నిందితుడు బోడ ప్రవీణ్ ఫిజియోథెరపిస్ట్ హైదారాబాద్‌లో ప్రభుత్వ డాక్టర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. ఆ సమయంలో కేరళకు చెందిన సోనీ ఫ్రాన్సిస్ అనే మరో నర్స్‌తో అక్రమ సంబంధం కొనసాగిస్తునట్లు ప్రవీణ్ తెలిపారని ఏసీపీ పేర్కొన్నారు. ఇంట్లో గొడవలు జరగడంతో సోనీ, ప్రవీణ్ పక్కా ప్రణాళికతో భార్య పిల్లల అడ్డు తొలగిస్తే ప్రశాంతంగా ఉండొచ్చు అని మే 28 తేదీ హైదారాబాద్ నుండి ఇంటికి బయలుదేరి సాయంత్రం సమయంలో తనతో తెచ్చుకున్న డ్రగ్ కాల్షియం ఇంజెక్షన్లో కలిపి ఇవ్వడంతో మరణించిందని దవీకరించుకొని ఇద్దరు పిల్లలను నోరుమూసి ఊపిరి ఆడకుండా చేసి చంపడం జరిగిందని నిందితుడు ఒప్పుకున్నట్లు తెలిపారు. మంచుకొండ గ్రామం దాటిన తరువాత రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించడానికి కారు లెఫ్ట్ సైడ్ పొదల్లోకి వెళ్లి చెట్టుకు గుద్ది రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడని ఒప్పుకున్నాడని ఏసీపీ తెలిపారు. ఘటన జరిగిన రోజు పోలీసులు కారును తనిఖీ చేయగా...ఖాళీ సిరంజ్ దొరికందని, దాన్ని ఎఫ్ఎస్ఎల్‌కు పంపించగా...విషం కలిపిన ఇంజక్షన్ ఇచ్చినట్లు తేలిందన్నారు. ప్రవీణ్ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని తనిఖీ చేయగా...అందులో కూడా కీలక ఆధారం లభ్యమైందన్నారు. అధిక మోతాదులో మత్తు ఇంజక్షన్ ఇస్తే ఎన్ని గంటల్లో చనిపోతారనే విషయాలను ప్రవీణ్ గూగుల్‌లో సెర్చ్ చేసినట్లు గుర్తించామన్నారు. పోస్టుమార్టం నివేదిక, ఎఫ్ఎస్ఎల్ నివేదిక ఆధారంగా నిందితుడు ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కేసు విచారణ చేసిన పోలీసులు అధికారులు సీఐ శ్రీహరి, ఎస్సై సురేష్‌ను పోలీస్ కమిషనర్ అభినందించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

మోడల్ స్కూల్లో గణిత బోధకులకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి ఆదర్శ పాఠశాలలో 6నుంచి 8వ తరగతులకు గణితము బోధించుటకు అవర్లి బేస్డ్ టీచర్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మహమ్మద్ అక్తర్ తెలిపారు. బీఎస్సీ లేదా ఎంఎస్ బీఈడీ విద్యార్హత కలిగి ఉండాలని, బోధనలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత అని ప్రిన్సిపాల్ తెలిపారు. పిరియడ్‌కు రూ.182 చొప్పున 100 పిరియాడ్‌లకు మించకుండా గౌరవ వేతనం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 19వ తారీఖు లోపు అర్హత దవపత్రాల నకళ్ళతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికను ఇంటర్వ్యూ డెమో క్లాసుల ఆధారంగా జరుగుతాయని తెలిపారు.

ఎమ్మెల్యేచే బేతుపల్లి చెరువు నుంచి నీటి విడుదల

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి పెద్దచెరువు సామర్థ్యం పూర్తిస్థాయికి చేరుకున్న నేపథ్యంలో పై ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను వేంసూరు మండలంలోని చెరువులు నింపేందుకు నేడు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చెరువుకు కాకర్లపల్లి వైపున ఏర్పాటు చేసిన లాకులకు ఎత్తి అక్విడెక్ట్ ఛానల్ ద్వారా వేంసూరు మండలానికి నీటిని తరలించనున్నారు. సోమవారం ఉదయం 7:30 గంటలకు ఈ నీటి విడుదల కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఫుట్‌బాల్ క్రీడాకారిణులకు అభినందనలు

నవతెలంగాణ-సత్తుపల్లి

రాష్ట్రస్థాయి బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఖమ్మం జట్టు తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఈ జట్టులో సత్తుపల్లి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన టి. తనుశ్రీ, కె. ధనవర్ష ముఖ్య క్రీడాకారిణులుగా ఉండి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారని జట్టు మేనేజర్ చీకటి శ్రీదేవి, ట్రెయినర్ నోయల్ జాక్సన్ తెలిపారు. ఈనెల 12, 13, 14 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో ఈ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయని వారు తెలిపారు. విజేతలు, ఉపాధ్యాయినులను హెచ్‌ఎం నీరుడు నాగేశ్వరరావు అభినందించారు.

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం..

- గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినా.. మేం రోగులను ఆదుకుంటున్నాం...
- ఎల్‌ఓసిల ద్వారా 120మందికి పైగా రూ.కోటి వరకు అందజేత
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- 132 మందికి రూ.32.66లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



నవతెలంగాణ -కూసుమంచి

పేదల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచిలోని తన క్యాంప్ కార్యాలయంలో పాలేరు నియోజకవర్గం నాలుగు మండలాల పరిధిలోని 132 మందికి రూ.32,66,500 విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డితో కలిసి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ..అనారోగ్య కారణాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం తరఫున బాధ్యతగా నేరుగా ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రోగులకు కనీసం సీఎంఆర్‌ఎఫ్ నిధులు కూడా ఇవ్వలేదని అన్నారు. మన ప్రభుత్వం వచ్చాక .. పెండింగ్ వాటిని కూడా మంజూరు చేశామని అన్నారు. ఇంకా మెరుగైన చికిత్స కోసం పాలేరు నియోజకవర్గంతో పాటు ఇతర నియోజక వర్గాలకు చెందిన 120 మందికి పైగా అనారోగ్య బాధితులకు ఎల్‌వోసీల ద్వారా రూ. కోటికి పైగా ఇప్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యకులు కళ్లెం వెంకటరెడ్డి, బెల్లం శ్రీను, మట్టే గురవయ్య, కూసుమంచి ఎంపీపీ శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు జూకూరి గోపాలరావు, కొప్పుల అశోక్, నాయకులు తమ్మినేని నవీన్, బజ్జూరి వెంకటరెడ్డి, మదాసు ఉపేందర్, హాఫీజుద్దీన్, మద్ది మల్లారెడ్డి, భుజంగ రెడ్డి, భీష్మాచారి, పెంద్ర అంజయ్య, రామిరెడ్డి, నాగేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శేఖర్ రెడ్డి కుటుంబానికి పరామర్శ

మండలంలోని జుజ్జుల్‌రావుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ఆ దూరి శేఖర్ రెడ్డి తల్లి వెంకట నరసమ్మ ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. శేఖర్‌రెడ్డి కుటుంబాన్ని ఓదార్చి వారి కుటుంబానికి సంతాప సానుభూతిని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం



రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఆదివారం ఖమ్మంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో 80 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం మున్సిపల్ మేయర్ పునుకొల్లు నీరజ, తుమ్మల యుగంధర్ చేతుల మీదుగా ఆయా డివిజన్ కాంగ్రెస్ నాయకులు కార్పొరేటర్ చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్స్ దుద్దుకూరు వెంకటేశ్వరావు, రాపర్తి శరత్, మలీదు జగన్, చామకూర వెంకన్న, పల్లెబోయిన చంద్రం, మిక్కిలినేని నరేందర్, అంజిరెడ్డి, నాళ్లం సతీష్, జాకీర్, బ్రహ్మారెడ్డి, పాలెం వెంకటరమణ, పాలకుర్తి నాగేశ్వరరావు, కొప్పెర ఉపేందర్, బాణాల లక్ష్మణ్, సింగం అంజయ్య. లక్కీ. బొమ్మ ఉదయ్ కుమార్, సీతమ్మ నాయకులు పాల్గొన్నారు.

విజయవంతమైన నెలనెలా వైద్య శిబిరం

నవతెలంగాణ-నేలకొండపల్లి



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధరరావు సేవా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో ఎన్టీఆర్ సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 19వ నెల నెలా వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కొల్లి అనుదీప్ ఎండి జనరల్ 135 మందికి రోగులకు బీపీ, షుగర్ సాధారణ జబ్బులకు, డాక్టర్ గడిపూడి రాజేష్ చెవి ముక్కు గొంతు వ్యాధి వైద్య నిపుణులు 18 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఖమ్మం శరత్ మాక్సిజన్ విజన్ వారిచే 38 మందికి కంటి వైద్య పరీక్షలు, మొత్తం191 మందికి వైద్యసేవలు అందించారన్నారు. నెలకు సరిపడా బీపీ, షుగర్ మాత్రలు వంద రూపాయలకే పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వసుంధర ఒకేషనల్ విద్యార్థులు రోగులకు మందులు వేసుకునే విధానంపై సహాయం అందించారన్నారు. గ్రామీణ వైద్యుల సేవా సంఘం వైద్యులు రోగులకి బిపి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సేవ కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాలకే పరిమితం కాకుండా పేదలకు ఉచిత సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని వైద్య శిబిరాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వైద్య శిబిరాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామీణ వైద్యుల సేవా సంఘం ప్రతినిధులు బండి పుష్ప, బండారుపల్లి నాగేశ్వరరావు, ఎస్.కె తానీష రోగులకు బిపి వైద్య సేవలు అందించారు. వసుంధర ఒకేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఈగ అనిల్ కుమార్, విద్యార్థులు, రోగులకు మందులు పంపిణీ చేయుటలో సహకరించారు. కార్యక్రమంలో కట్టెకోల వెంకటేశ్వర్లు, వల్లంచెట్ల భాస్కరరావు, కొంగర నారాయణరావు, దండా సూర్యనారాయణ, షేక్ జమాల్ పాషా, అబ్దుల్ రహీం, మంకెనపల్లి నరసింహారావు, ఏలూరి కోదండ రామారావు, దండా సైదారావు, సామాల మల్లికార్జునరావు, ధీరావత్ నాగేశ్వరరావు, బొడ్డు బాబురావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

- అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం



నవతెలంగాణ-వైరాటౌన్

గురుకులాల పాఠశాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, సొంత భవనాలు లేక, మౌలిక సౌకర్యాలు సక్రమంగా లేక పేద విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర మంత్రివర్గం గురుకుల విద్య, సమస్యలు గురించి చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, వైరా నియోజకవర్గం ఇన్చార్జి భూక్యా వీరభద్రం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వైరా మండలం పరిధిలోని రెబ్బవరం గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను భూక్యా వీరభద్రం వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, మండల కార్యదర్శివర్గ సభ్యులు తూము సుధాకర్, ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ కార్యదర్శి కోట ప్రేమ్ కుమార్‌లతో కలిసి సందర్శించారు. 750 మంది బాలికలు ఉన్నా గురుకుల పాఠశాలకు సొంత భవనం లేక పలు సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. సరిపోను మరుగుదొడ్లు లేవన్నారు. పురుగుల బియ్యంతో అన్నం పెడుతున్నారని బాలికలు ఆవేదన వ్యక్తం చేశారని వారు తెలిపారు. తాగునీరు ఆర్ఓఆర్ వాటర్ ప్లాంట్ చెడిపోయి 6 నెలలు అవుతున్నా ఇప్పటివరకు మరమ్మతులు చెయ్యలేదని, వెంటనే అధికారులు వాటర్ ప్లాంట్ బాగు చేసి విద్యార్థులకు మంచినీరు అందించాలని భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సివిల్ సప్లైయ్ ద్వారా పాఠశాలలకు సరఫరా చేస్తున్న పురుగులు పట్టిన దొడ్డు బియ్యం భోజనం పెట్టడం సరైనది కాదని, వెంటనే పురుగుల బియ్యాన్ని వెనక్కి పంపాలని, సన్న బియ్యం సరఫరా చేయాలని వైరా తహశీల్దార్‌ను కోరడంతో సన్న బియ్యం సరఫరా చేస్తామని తెలిపారు. వీధిలైట్లు లేక రాత్రిపూట పురుగులు, పాములు వస్తున్నాయని విద్యార్థులు తెలపగా వెంటనే గ్రామపంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌కు భూక్యా వీరభద్రం ఫోన్ చేసి వీధి లైటు ఏర్పాటు చేయాలని కోరారు. రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తామని పంచాయతీ కార్యదర్శి హామీ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ మాలతి ఫోన్ ద్వారా త్వరగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న గురుకుల పాఠశాలల సమస్యలపై జిల్లా అధికార యంత్రాంగం పర్యవేక్షణ చేయాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్, వార్డెన్, సిబ్బందితో సమావేశం నిర్వహించి మొబైల్ టాయిలెట్ ఏర్పాటు చేయాలని, స్థానికంగా ఉన్న సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, సంబంధించిన అధికారులకు స్పందించకపోతే ఆందోళన చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, మండల కార్యదర్శివర్గ సభ్యులు తూము సుధాకర్, ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ కార్యదర్శి కోట ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమాజాన్ని మార్చటమే కమ్యూనిస్టుల దీర్ఘకాలిక కర్తవ్యం

- సీపీఐ(ఎం)ఎకడమిక్ సెల్ జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్

నవతెలంగాణ-బోనకల్

కమ్యూనిస్టుల దీర్ఘకాలిక కర్తవ్యం సమాజాన్ని మార్చడమేనని సీపీఐ(ఎం) ఎకడమిక్ సెల్ జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ అన్నారు. మధిర మండల పరిధిలోని దెందుకూరులోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో సీపీఐ(ఎం) జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. 'గజతార్కిక భౌతికవాదం' అనే అంశాన్ని బండారు రమేష్ బోధించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. కమ్యూనిస్టుల కర్తవ్యాలు రెండు రకాలుగా ఉంటాయన్నారు. ఒకటి రోజు వారి రాజకీయాలు, రెండు సమాజాన్ని మార్చటం (విప్లవం) అన్నారు. మార్క్సిజం సిద్ధాంతం ద్వారా ఇది సాధ్యమవుతుందన్నారు. కమ్యూనిస్టులు సమాజాన్ని అర్థం చేసుకోవాలని, అర్థం చేసుకున్న తర్వాత ఆ సమాజాన్ని మార్చటానికి కృషి చేయాలన్నారు. మార్క్సిజం మూడు విభాగాలుగా ఉంటుందన్నారు. తత్వశాస్త్రం, అర్థశాస్త్రం, రాజకీయం (సోషలిజం) అనే విభాగాలుగా ఉంటుందన్నారు. సంపద కొద్ది మంది చేతులలో మాత్రమే కేంద్రీకతమై ఉందన్నారు. శ్రమ చేసే వారి దగ్గర సంపద ఉండటం లేదన్నారు. కొద్దిమంది మాత్రమే సంపదను అనుభవిస్తున్నారన్నారు. శ్రమ చేసేవాడు సంపదను అనుభవించడం లేదన్నారు.

సమాజ మార్పు తప్పదని కే.ఆనందా చారి అన్నారు. ఎప్పటికప్పుడు కమ్యూనిస్టులు అధ్యయనం చేసి అందుకు అనుకూలంగా పోరాటాలకు రూపకల్పన చేయాలన్నారు. సమాజ మార్పులో కమ్యూనిస్టు పాత్ర తప్పనిసరిగా ఉండాలన్నారు. కమ్యూనిస్టు నిత్యం మార్పు కోసం తపిస్తూ పోరాటాలు చేస్తారన్నారు. ఆ విధంగా ప్రతి కమ్యూనిస్టు భవిష్యత్తులో తయారు కావాలని కోరారు. ఈ రాజకీయ శిక్షణ తరగతులకు సిపిఎం జిల్లా కమిటీ, మండల కమిటీ సభ్యులు, జిల్లా ఫ్రాక్షన్ కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు, పూర్తి కాలం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మున్సిపల్ ఆర్ఐ రాము మృతి

నవతెలంగాణ-మధిర



మున్సిపాలిటీ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న కందుకూరి రాము(45) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. శనివారం కరీంనగర్ వెళ్లి రాత్రి సమయంలో ఖమ్మం తిరిగి వస్తుండగా గ్యాస్టిక్ నొప్పి రావడంతో మరునాడు ఖమ్మం ఆరోగ్య ఆస్పత్రికి తరలించగా అత్యవసర చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.



జల్లెపల్లిలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-తిరుమలాయపాలెం


పొంగులేటి, స్వరాజ్యం-రాఘవరెడ్డి (పీఎస్ఆర్) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ చావా శివరామకృష్ణ హాస్పిటల్ సిబ్బందితో మండల పరిధిలోని జల్లేపల్లి గ్రామంలో పది రోజుల నుండి డెంగు, మలేరియా, కలరా, చికెన్ గున్యా, వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. కొద్దిరోజులుగా జల్లిపల్లి గ్రామంలో డెంగ్యూ విష జ్వరాలతో బాధపడుతున్న గ్రామ ప్రజలకు ఉచిత వైద్యం, ఉచితంగా మందులు అందించడం జరిగింది. వైద్యం అత్యవరమైన చికిత్స అవసరమైన వారిని ఖమ్మం నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌కు రోగులను తరలించారు. వారికి ఉచితంగా వైద్యం, మందులు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రంజిత్ రావెళ్ళ, జనరల్ మెడిసిన్, డాక్టర్ రవీంద్రనాథ్ చౌదరి, ఆర్థోపెడిక్ సర్జన్ మార్కెటింగ్ మేనేజర్ కాకర్లమూడి అనిల్, మండల ఎంపీపీ బోడ మంగీలాల్, గ్రామ నాయకులు పోట్ల కిరణ్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-పెనుబల్లి

వీఎం బంజర్ జిల్లా పరిషత్ పదో తరగతి పూర్తి చేసి నలభై ఏండ్ల తరువాత పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలు మధురస్మృతులను నెమరవేసుకుంటూ ఆదివారం సందడి చేశారు. పెనుబల్లి మండలం వీఎం బంజర్ జిల్లా పరిషత్‌లో నాడు పదో తరగతి పూర్తి చేసిన వీరంతా రంగారావు బంజరు గ్రామంలోని సోమరాజు సీతారామారావు స్వగృహంలో ఏర్పాటు చేసిన ఈ అపూర్వ పూర్వ విద్యార్థుల కలయిక సమ్మేళనం వారు అత్యంత ఆనందభరితంగా గడిపారు. మిత్రులందరికీ ఒకే చోట కలుసుకొని నిత్యజీవితంలో వారు కొనసాగిస్తున్న వ్యక్తిగత ఆలోచనలను పంచుకొని సమాజానికి తమ వంతు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సోమరాజు సీతారామారావు, ఆచంట శ్రీనివాసరావు, మిట్టపల్లి జనార్ధన్, కాటినేని శ్రీనివాసరావు, జోనబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మొక్క పోచమ్మ తల్లికి ఎస్ఐ పూజలు

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని నర్సింహారావుపేట గ్రామంలో మొక్క పోచమ్మ తల్లికి ఎస్సై కొండలరావు ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బోనాల సందర్భంగా ఎస్సై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నరసింహారావుపేట, అన్నారుగూడెం, గోపాల్పేట గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

రేపు రాయల నాగేశ్వరరావుకు ఆత్మీయ సన్మానం

- డిప్యూటీ సీఎం తోపాటు మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి రాక

నవతెలంగాణ- ఖమ్మం

రాష్ట్ర గిడ్డగుల సంస్థల కార్పొరేషన్ చైర్మెన్ రాయల నాగేశ్వరరావును మంగళవారం ఘనంగా సన్మానించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ గౌరవ అధ్యక్షులు పుసులూరి నరేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నగరంలోని రామాలయం టెంపుల్ వద్ద ఉన్న వీవీసీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఈ వేడుకను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి తోపాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావుకు చేసే సన్మాన కార్యక్రమానికి శ్రీమంత కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

మీ బొగ్గుకోసం..! మా ప్రాణాలు తీస్తారా...!!

- బాంబ్ బ్లాస్టింగ్స్‌తో రాలుతున్న స్లాబు పెచ్చులు
- పునరావాసం కల్పించండి-లేకుంటే పేలుళ్లు ఆపండి
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్న కిష్టారం ఎస్సీ, బీసీ కాలనీ ప్రజలు

నవతెలంగాణ-సత్తుపల్లి

అక్కడి ప్రజలకు రాత్రి, పగలు తేడా అనేది లేకుండా కంటిపై కునుకు రావడం లేదు. నిద్ర కళ్లపై ముంచుకు వచ్చినా మంచంపై పడుకోవడమే గాని నిద్రపోయే పరిస్థితి లేదు. ఇదేంటి అక్కడి ప్రజలకు క్రూరమృగాలతో భయమా, లేక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారా అని అనుకుంటున్నారా.. అదేమి కాదు.. వాళ్ల ప్రాణభయానికి, వాళ్లకి నిద్ర రాకపోవడానికి సింగరేణి సంస్థ ఆధ్వర్యంలోని సత్తుపల్లి మండలం కిష్టారం ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనులే కారణమని చెప్పాలి. మండలంలోని కిష్టారం ఎస్సీ, బీసీ కాలనీలకు చెందిన ప్రజలు గత ఆరేండ్లుగా ఎదుర్కొంటున్న బర్నింగ్ సమస్య ఇది. ప్రతిరోజూ బొగ్గును పెకిలించేందుకు సింగరేణి ఉపయోగించే బాంబ్ బ్లాస్టింగ్స్ కారణంగా అత్యంత శక్తివంతమైన అదుర్లు, కుదుపుళ్లు (వైబ్రేషన్స్) రావడం వల్ల స్లాబు పెచ్చులు ఊడి పడుతున్నాయి. వాళ్లు పేల్చే బాంబు పేలుళ్ల కారణంగా ఒక్కోసారి స్లాబు పెచ్చులు అప్పటికప్పుడు ఊడి పడటం, మరికొన్ని పడకుండా వర్షాలు పడిన సమయాల్లో స్లాబులు నానిపోయి నీళ్లుకారడంతో పాటు పెచ్చులు రాలడం గత 2018 నుంచి జరుగుతూ వస్తోంది. అప్పటి నుంచి తమ మొరను ఆలకించే నాథులే కరవయ్యారు. గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కాలనీల్లో అనేక ఇండ్లు స్లాబులు ఊడి మంచాలపై పడుతుండటంతో కాలనీ వాసులు బెంబేలెత్తిపోతున్నారు. అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగక పోవడంతో ప్రజలు గాలిపీల్చుకున్నారు. దినదిన గండం నూరేళ్ల ఆయుస్సులా ఉంది కిష్టారం ఎస్సీ, బీసీ కాలనీ ప్రజల పరిస్థితి. సుమారుగా 800 వరకు జనాభా ఉన్న ఈ కాలనీల్లో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు నిత్యం ప్రాణభయంతో గడుపుతున్నారు.

ఓసీని ప్రారంభంలో సర్వే చేశారు.. పునరావాసం కల్పిస్తామన్నారు

2018లో కిష్టారం ఓసీని ప్రారంభించే సమయంలో కిష్టారం ఎస్సీ, బీసీ కాలనీల్లో ఉన్న 175 ఇండ్లకు సంబంధించి సింగరేణి సంస్థ సర్వే చేయించింది. 500 మీటర్ల మేర ఓసీని విస్తరణ చేయడం ద్వారా జగన్నాధపురం, కొమ్మేపల్లి గ్రామాల ప్రజలకు ఇచ్చిన విధంగా పునరావాసం కల్పిస్తామని సింగరేణి అధికారులు అక్కడి ప్రజలకు అప్పట్లో హామీ ఇచ్చారు. అయితే సింగరేణి అధికారులు చెప్పినట్లుగా ఓసీ విస్తరణను మరో వైపుకి విస్తరింపజేశారు. కొందరు రాజకీయ నాయకులు అడ్డుపడటం వల్లే సింగరేణి అధికారులు తమకు పునరావాసం కల్పించే విషయాన్ని బుట్ట దాఖలా చేశారని అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు.

జగన్నాధపురం, కొమ్మేపల్లి గ్రామాల మాదిరిగా పునరావాసం అందించాలి





మండలంలోని జగన్నాధపురం, కొమ్మేపల్లి గ్రామాలకు ఇచ్చిన మాదిరిగా తమకు పునరావాసం కల్పించాలని కిష్టారం ఎస్సీ, బీసీ కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై 2018 నుంచి మొదలుకొని ఇప్పటి వరకు పునరావాసం కోసం సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు వచ్చిన ప్రతిసారీ కలవడం, వినతిపత్రాలు అందించడం జరుగుతూ వస్తోందన్నారు. అయినా ఇప్పటి వరకు మా మొరను ఆలకించిన వారే లేకుండా పోయారన్నారు. ఉంటే ఉండంటి, చస్తే చావండి అన్న చందాన సింగరేణి అధికారుల వ్యవహారశైలి ఉందని బాధిత కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మంచంపై పడుకుని ఉండగా స్లాబు పెచ్చులు ఊడి పడ్డాయి...

ప్రత్తిపాటి అశోక్ (బాధితుడు, కిష్టారం ఎస్సీ కాలనీ)



శనివారం రాత్రి భోజనం చేశాక మంచంపై నిద్రకు ఉపక్రమించాం. వర్షం పడుతూనే ఉంది. ఇంతలో స్లాబు పెచ్చులు ఒక్కసారిగా మాపై పడ్డాయి. వెంటనే భయంతో లేచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని తెల్లవార్లు కుటుంబ సభ్యులమంతా కునుకు తీయకుండా ఉండాల్సి వచ్చింది. మేం పడే ఇబ్బందులను సింగరేణి అధికారులు గుర్తించి మాకు వేరేచోట పునరావాసం కల్పించాలని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారు.

బాంబ్ బ్లాస్టింగ్స్‌కు స్లాబులు పగుళ్లవారి కురుస్తున్నాయి

రాయల నాగేశ్వరరావు (బాధితుడు, కిష్టారం ఎస్సీ కాలనీ)



బాంబు పేల్చుళ్ల కారణంగా స్లాబులు వగుళ్లువారి వర్షాలకు కురుస్తున్నాయి. దీంతో స్లాబుపై పట్టాలు వేసుకొని ఇంట్లో తడవకుండా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఆరేండ్లుగా మమ్మల్ని ఇన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసి బొగ్గును తీసుకుంటూ మా హక్కులను సింగరేణి సంస్థ హరించేస్తోంది. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛగా జీవించే హక్కును సైతం సింగరేణి కాలరాస్తోంది. పునరావాసం కల్పించండి. లేకుంటే మీ పేలుళ్ల ఆపండి.

సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

- అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ తలారి సీతారాం

నవతెలంగాణ-తల్లాడ



పీహెచ్సి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు నిర్ధారణ అయితే చర్యలు తప్పవని అడిషనల్ డీఎంహెచ్ఓ తలారి సీతారాం తెలిపారు. ఆదివారం తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి, ఆస్పత్రిలో శిశువు జన్మించి, మరణించిన విషయంపై విచారణ నిర్వహించి మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నవజాత శిశువు మృతి చెందడం బాధాకరమన్నారు. ఉదయం 10 గంటలకు నొప్పులు ప్రారంభమైతే వాటిని వైద్య సిబ్బంది పరిశీలించి వాతం నొప్పులని, ఆమె కూర్చోవడం, లేవడం తదితర వ్యాయామాలు చూపెట్టారన్నారు. రాత్రి ఏడున్నర గంటలకు డెలివరీ నొప్పులు ప్రారంభమయ్యాయి. ఈ సమయంలో బేబీ తలభాగం వచ్చి ఆలస్యం కావడం వల్ల ఉమ్మనేరు తాగి మృతి చెందడం జరిగిందన్నారు. నొప్పులు ప్రారంభానికి ఓ గంట ముందు ఖమ్మం తరలిస్తే తల్లి బిడ్డ క్షేమంగా ఉండేవారని తెలిపారు. ఈ నేపథ్యంలో తల్లిని కాపాడుకునేందుకు ఖమ్మం తరలించామన్నారు. ఈ ఘటనకు సిబ్బంది నిర్లక్ష్యం రుజువైతే ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుంటారన్నారని పేర్కొన్నారు. ఆస్పత్రిలో నిరంతరం మెరుగైన వైద్య సేవలందిస్తామని, ప్రతి సంవత్సరం 100 సాధారణ కాన్పులు చేస్తున్నారని, ఈ సంఘటన దురదృష్టకరమన్నారు. ప్రజలు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ గిరిజన (ఎస్టీ)- బాలికల వసతి గృహం ఆకస్మిక తనిఖీ

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్



పట్టణంలోని ప్రభుత్వ గిరిజన (ఎస్టీ) బాలికల వసతి గృహాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయుకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ బాలికలను కలుసుకొని స్వయంగా బాలికలకు అందుతున్న భోజనం, వసతి ఏర్పాట్ల సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలికలకు మధ్యాహ్నం వండిన భోజనాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హాస్టల్ వసతి గృహాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని, నాణ్యమైన భోజనాన్ని చిన్నారులకు అందించాలని, సీజనల్ వ్యాధులు రాకుండా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ వైస్ చైర్మెన్ తోట సుజాల రాణి, చెన్నరావు, ఆ పార్టీ ముఖ్య నాయకులు, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలతో భావ వ్యక్తీకరణకు ప్రమాదం

- బాధితులనే బాధించే అవకాశం
- కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం
- సెమినార్‌లో సీనియర్ న్యాయవాది విద్యాసాగర్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం



కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన చట్టాలతో భావ వ్యక్తీకరణకు ప్రమాదం ఏర్పడిందని ప్రశ్నించే తత్వాన్ని చంపేసే విధంగా చట్టాలు రూపొందించబడ్డాయని సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం కల్పించడం సహేతుకం కాదన్నారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నూతన చట్టాలు సమాజంపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సెమినార్లో విద్యాసాగర్రెడ్డి మాట్లాడుతూ గత చట్టాలు బ్రిటిష్ పాలనలో రూపొందించబడ్డాయని నూతన చట్టాల రూపకల్పన పై దృష్టిసారించిన ప్రభుత్వం కులంకుషంగా చర్చించకుండానే చట్టాల అమలుకు పూనుకుందని కేవలం 43గంటల 23 సెకన్లు మాత్రమే చర్చించారని ఆయన తెలిపారు. ఈ సెమినార్లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కనకం జనార్ధన్, ఐఎల్ నాయకులు పట్టాభి, ఎస్‌కే.లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సభ్యులు శింగు నర్సింహారావు, ప్రముఖ న్యాయవాది ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలకు శిక్షణిచ్చి సర్టిఫికెట్‌లివ్వాలి

- ఆర్ఎంపీడబ్ల్యూఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

నవతెలంగాణ-మధిర



తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆర్ఎంపీలందరికి పారామెడికల్ శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్‌లు అందజేయాలని ఆర్ఎంపీడబ్ల్యూఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆర్ఎంపిడబ్ల్యూఏ మండల సమావేశం మండల అధ్యక్ష, కార్యదర్శులు అక్కినపల్లి నాగేశ్వరరావు, శ్రీహరిల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..2015లో వచ్చిన 428 జీవోతో సంబంధం లేకుండా 2009 లో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పారామెడికల్ బోర్డు ద్వారా డీడీ రూపంలో 200వందల రూపాయలు కట్టించుకొని వేలాదిమందికి శిక్షణ ఇచ్చారని అదేవిధంగా ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం అదేవిధంగా శిక్షణ ఇచ్చి అందరికీ సర్టిఫికెట్‌లు ఇవ్వాలన్నారు. మనకు త్వరలో మంచిరోజులు రాబోతున్నాయని మన ఆర్ఎంపిలకు మద్దతుగా తెలంగాణ జెఎసి చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్, ఆంధ్రప్రదేశ్ జానవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు బ్రమ్మారెడ్డి, విజ్ఞాన దర్శిని బాధ్యులు రమేష్ లాంటి మేధావులు రాష్ట్ర వైద్యాశాఖ మంత్రితో ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిపారు. త్వరలో అన్ని సంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి వేదిక ఏర్పాటు చేసి దశలవారీగా సమస్యలు పరిష్కరం కోసం కృషి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీడబ్ల్యూఏ జిల్లా నాయకులు శ్రీరాములు, షేక్ నాగుల్ మీరా, వేణు, గోపి, శ్రీహరిక్రిష్ణ, సైదులు, రమాదేవి, కిషోర్, శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి ఆధ్వర్యంలో ఐదుచోట్ల 'వైద్య' శిబిరాలు

- చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో
- వైద్య సేవలు అందించిన ప్రత్యేక వైద్య బృందాలు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలంలోని సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో ఆ సంస్థ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక వైద్య బృందాలు ఐదుచోట్ల ఆదివారం వైద్య శిబిరాలను నిర్వహించారు. సింగరేణి ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.సుజాత ఆధ్వర్యంలో వైద్య బృందాలు కిష్టారం, అంబేద్కర్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, చెరుకుపల్లి, రేజర్ల గ్రామాల్లో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఆయా ప్రాంతాల ప్రజలకు సింగరేణి వైద్య బృందాలు పరీక్షలు జరిపి మందులు అందించారు. రెండు బృందాలుగా నిర్వహించిన ఈ వైద్య శిబిరాల్లో ఆయా ప్రాంతాలకు చెందిన మొత్తం 239 మంది ప్రజలు ఈ వైద్య శిబిరాలకు హాజరై చికిత్సలు జరిపించుకొని మందులు అందుకున్నారు. ఆరుగురు ప్రత్యేక వైద్య నిపుణులతో పాటు చిన్న పిల్లల వైద్య నిపుణులు (పీడియాట్రీషియన్) ఈ వైద్య శిబిరాల్లో పాల్గొన్నారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సింగరేణి వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరాల కార్యక్రమాల్లో ఎస్ఓటూ జీఎం జీవీ కోటిరెడ్డి, కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రి అడిషనల్ సీఎంవో డాక్టర్ ఎ. విక్టరీ వందనం, వైద్యబృంద సభ్యులు, కిష్టారం ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ మునగంటి వేదాద్రి నరసింహారావు, జేవీఆర్ ఓసీ డిస్పెన్సరీ డాక్టర్ నరసింహారావు, కిష్టారం, రేజర్ల పంచాయతీ సెక్రెటరీలు రవి, దీప్తి, సీనియర్ పీవోలు కె. దేవదాస్, విజయ సందీప్, గ్రామస్తులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సూచనల మేరకు కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. షాలేంరాజు ఆదేశాల మేరకు ఈ వైద్య శిబిరాలను నిర్వహించడం జరిగిందని కిష్టారం ఓసీ పీవో ఎంవీ నరసింహారావు తెలిపారు.

గృహజ్యోతి దరఖాస్తుల సవరణలకు అవకాశం

నవతెలంగాణ-బోనకల్

గృహజ్యోతి పథక దరఖాసుదారుల సవరణల కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండల విద్యుత్ ఏఈ దొండేటి ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రజా పాలనలో గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్న 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వినియోగదారులు కొన్ని ఆన్‌లైన్ పొరపాట్ల వలన ఇప్పటి వరకు గృహ జ్యోతి పథకం ద్వారా లబ్ధి పొందని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇందుకోసం ప్రజా పాలన కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా సర్వీస్ నెంబర్ సరి చేయించుకొనవచ్చునని ఆయన తెలిపారు. అదేవిధంగా దరఖాస్తుదారుల సర్వీస్ నెంబర్ కు రేషన్ కార్డుని కూడా అనుసంధానించుకోవచ్చునని తెలిపారు. అద్దె ఇంట్లో ఉండే విద్యుత్ వినియోగదారులు మరొక ఇంటికి మారినప్పుడు ఆ ఇంటి సర్వీసు నెంబర్ కనెక్షన్ తో అనుసంధానం చేసుకొని గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్లు పొందవచ్చునని తెలిపారు. గతంలో వివిధ కారణాలతో జరిగిన పొరపాట్లను ఈ కేంద్రం ద్వారా పూర్తిస్థాయిలో సరిచేసుకొని గృహ జ్యోతి పథకం కింద లబ్ధిదారులుగా చేరవచ్చునని తెలిపారు.

మధిర : ప్రజా పాలనలో గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్న 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వినియోగదారులు కొన్ని ఆన్‌లైన్ పొరపాట్ల వలన ఇప్పటివరకు గృహ జ్యోతి పథకం ద్వారా లబ్ధి పొందనట్లయితే మధిర మున్సిపాలిటీ, మధిర, ఎర్రుపాలెం మండల ఆఫీసుల నందు ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాల ద్వారా మీ సర్వీస్ నెంబర్ సరి చేయించుకొనవచ్చు అని విద్యుత్ శాఖ సబ్ డివిజన్ ఏడిఈ ఎం. అనురాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మీ సర్వీస్ నెంబర్‌కు రేషన్ కార్డుని అనుసంధానించు కొనుట, అద్దె ఇంట్లో ఉండే విద్యుత్ వినియోగదారులు వేరోక ఇంటికి మారినప్పుడు ఆ ఇంటి సర్వీసు నెంబర్ కనెక్షన్‌తో అనుసంధానం చేసుకొని, గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్లు పొందవచ్చని పేర్కొన్నారు.

నవతెలంగాణ 7
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | జులై 15, 2024 | www.navatelangana.com

కిన్నెరసాని రిజర్వాయర్‌కు క్రమేపి పెరుగుతున్న వరద

- 401.20 అడుగులకు చేరిన నీటిమట్టం
- ఇన్ ఫ్లో 5500 క్యూసెక్కులు



నవతెలంగాణ-పాల్వంచ రూరల్

కిన్నెరసాని రిజర్వాయర్‌కు వరదనీరు క్రమేపి పెరుగుతోంది. డ్యామ్ సామర్థ్యం 407 అడుగులు కాగా.. శనివారం 401.20 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు చేరడంతో, రిజర్వాయర్ జలకలను సంతరించుకుంది. కేటీపీఎస్, డ్యామ్ సైట్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

వరదలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ముంపు ప్రాంతాల పరిశీలనలో కలెక్టర్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గోదావరి వరదలు అంతకంతకు పెరుగుతున్నందున సంబంధిత అధికారులు ముందు జాగ్రత్త చర్యగా అప్రమత్తంగా ఉండి ప్రజలు గోదావరి ముంపు బారిన పడకుండా చూడాలని, అలాగే చిన్న వర్షానికి భద్రాచలం పట్టణములోని పలు కాలనీలలో వరద నీరు ప్రవేశించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఆదివారం భద్రాచలంలోని గోదావరి వరదలు వచ్చే ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ముందుగా విస్తా కాంప్లెక్స్‌లోని వరదలకు సంబంధించిన పంపింగ్ మోటార్లను, వరద ఎక్కువైనప్పుడు గోదావరిలోకి వదిలే కనెక్షన్ సంబంధించిన పరికరాలను పరిశీలించారు. గోదావరిలోని వరద అంచనాను బట్టి సీడబ్ల్యూసీ అధికారులు మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు ప్రత్యేకంగా అమర్చిన మోటార్ల ద్వారా నీటిని గోదావరిలోకి వదిలివేస్తూ ఉండాలని అవసరమైతే మోటార్లు అదనంగా ఉంచుకోవాలని అన్నారు. గోదావరి వరదలు ముంపునకు గురి అయ్యే గ్రామాల ప్రజలకు సంబంధిత సెక్టరల్ ఆఫీసర్లు ఇప్పటినుండే వారికి తెలియజేస్తూ ఉండాలని ఏమాత్రం గోదావరి వరద పెరిగిన వెంటనే వారిని పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా అన్ని ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. విస్తా కాంప్లెక్స్‌లోని గోదావరి నీటిలోకి వదిలే అమర్చిన మోటార్లను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. అనంతరం విస్తా కాంప్లెక్స్ పక్కన ఉన్న డ్రైనేజీ పరిసరాలను ఆయన పరిశీలించి డ్రైనేజీలో చెత్త పేరుకు పోకుండా గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలన్నారు. భద్రాచలం పట్టణ ప్రాంతంలోని చుట్టుపక్కల డ్రైనేజీలలో చెత్త పేరుకుపోవడం వలన నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నందున నీరు రోడ్లపైకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. అనంతరం కూనవరం రోడ్డులో కొత్తగా నిర్మించే కరకట్ట ప్రదేశాలను ఆయన సందర్శించి, కరకట్ట నిర్మాణం పనులు ఎంతవరకు పూర్తయినవని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి వరదలు పెరగాకముందే కరకట్ట నిర్మాణము పూర్తి కావాలని ఆయన అధికారులను ఆదేశించారు. కొత్తగా నిర్మించే కరకట్ట పనులను ఆయన స్వయంగా పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అన్నారు. అనంతరం భద్రాచలం పట్టణం మరియు వార్డులలో సేకరిస్తున్న తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డులలో తరలించడానికి కొత్తగా నిర్మాణం చేపట్టే డంపింగ్ యార్డ్‌ను ఆయన పరిశీలించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి కొలువై ఉన్న భద్రాచలానికి ఇతర రాష్ట్రాల నుండే కాక వివిధ జిల్లాల నుండి ప్రతిరోజు ముఖ్యంగా సెలవు దినాలలో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని భక్తులు, పట్టణ ప్రజలు పడవేసే చెత్తను గ్రామపంచాయతీ సిబ్బంది తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించి తప్పనిసరిగా డంపింగ్ యార్డ్‌లోనే వేయాలని అందుకు గ్రామపంచాయతీ ఈవో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. వర్షాకాలం నడుస్తున్నందున చెత్త ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయి దోమలు వృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతిరోజు భద్రాచలం పట్టణంలో, వార్డులలో ఉన్న రోడ్లపై ఉన్న చెత్తను తప్పనిసరిగా తొలగించి డంపింగ్ యార్డ్‌లలో వేయాలని అన్నారు. గ్రామపంచాయతీ ఈవో సెక్రెటరీ ప్రతిరోజు తప్పనిసరిగా వార్డులను పరిశీలించి గ్రామపంచాయతీ సిబ్బంది చెత్తను తొలగిస్తున్నది లేనిది పరిశీలిస్తూ ఉండాలని అన్నారు. అలాగే డ్రైనేజీలలోని పూడికను కూడా తప్పనిసరిగా తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాసరావు, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు, ఆర్ఐ నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వ్యాయామంతో వ్యాధులను అదుపులో పెట్టుకోవచ్చు

- డాక్టర్ కే.రఘునందన రావు

నవతెలంగాణ-సుజాతనగర్

నేటి సమాజంలో వ్యాయామంతో వ్యాధులను అదుపులో పెట్టుకోవచ్చునని ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ కే.రఘునందన్ రావు తెలిపారు. ఆదివారం కాసాని లక్ష్మి ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ తప్పకుండా తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. షుగర్, బీపీ వంటి వ్యాధులను నేటి ప్రజలు సామాన్య వ్యాధులుగా పరిగణి స్తున్నారని ఎట్టి పరిస్థితులలో వీటిని నిర్లక్ష్యం వహించకూడదని అన్నారు. కాసాని లక్ష్మి ట్రస్టు ద్వారా పేదలకు సేవ చేయుటం మంచి పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ నిర్వాహకులు వీర్ల రమేష్, గురుజాల శీను తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ తెగల సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్



నవతెలంగాణ-పాల్వంచ

షెడ్యూల్డ్ తెగల సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధ్యక్షతన ఎస్పీ రోహిత్ రాజ్, అధికారులతో కలిసి ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో ముందుగా కలెక్టర్ జిల్లాలో షెడ్యూల్ తెగల అభివృద్ధికి చేపడుతున్న పనుల గురించి జాతీయ కమిషన్ సభ్యుడికి వివరించారు. అనంతరం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ మాట్లాడారు. జిల్లాలో షెడ్యూల్డ్ తెగల హక్కుల పరిరక్షణకై అధికారులు కృషి చేయాలని, షెడ్యూల్డ్ తెగల సాంఘిక-ఆర్థిక అభివృద్ధికి వివిధ ప్రణాళికల రూపకల్పనకు కృషి చేయాలని, ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలని, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా రూపొందించిన ప్రణాళికలను షెడ్యుల్డ్ కులాల వారికి అందేవిధంగా చూడాలని అన్నారు. ఈ కమిషన్‌కు ఏదైనా కేసును విచారించే విషయంలో సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు ఉంటాయని, ఏ చిన్న సమస్యను అయినా నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. అధికారులు తమ దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యపై స్పందించి పరిష్కార మార్గాలు చూపాలని అన్నారు. జిల్లాలో వున్న అన్ని మైనింగ్ కాంట్రాక్టు వివరాలు అన్ని పది రోజుల్లో నివేదికలు సమర్పించాలన్నారు. ఇది గిరిజన జిల్లా వారికి అన్ని హక్కులు ఉంటాయి, కానీ ఇక్కడ పేరు గిరిజనులది పెత్తనం గిరిజనేతరులు చేస్తున్నారు. నేను ఈ జిల్లా వాడినే నాకు అన్ని తెలుసు, గిరిజనులు హక్కులను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాటశాలలు, కళాశాలలో చదువుకునే విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. వారు ఉన్నతంగా చదివి మంచి స్థాయిలో ఉండే విధంగా వారికి కల్పిస్తున్న సంక్షేమ ఫలాలు సమయానికి అందేలా అధికారులు చూడాలని అన్నారు. అందుకు కమిషన్ తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఎక్కడ కూడా హక్కుల ఉల్లంఘన జరుగకుండా చూడాలని పోలీసు వారికి సూచించారు. అనంతరం వివిధ సమస్యలపై వచ్చిన జిల్లాలోని పలు మండలాల భాదితుల వివరాలు అడిగి తెలుసుకొని వినతులను స్వీకరించి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్‌కు సూచించారు. తెలంగాణలో ప్రధానంగా నాలుగు ఉమ్మడి జిల్లాలు అయినా ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబాబాద్ జిల్లా పై ప్రత్యేక దృష్టి పెడతాను అని అన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, ఎస్ఈఎన్‌పీడీసీ ఎల్ కొత్తగూడెం బికం సింగ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ట్రావెల్ వెల్ఫేర్ డీడీ మానెమ్మ, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, సీడీఓ శ్రీనివాసరావు, కొత్తగూడెం ఆర్డీవో మధు, జిల్లా సంక్షేమ అధికారి అనసూయ, బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర, సివిల్ సప్లైస్ అధికారిని రుక్మిణి, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖలో అర్చకుల బదిలీల వివాదం

- సాధారణ బదిలీల్లో భాగంగా ఉద్యోగస్తులతో పాటు ఆలయ అర్చకుల జాబితాను సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అనునిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించే పవిత్ర దేవాలయాలలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మరోసారి వివాదం చెలరేగింది. ఆలయంలో పనిచేస్తున్న సిబ్బందిని నాలుగేళ్లకు ఒకసారి బదిలీ చేయడం నిబంధన కాగా ఈసారి బదిలీలలో సిబ్బందితో పాటు ఆలయ అర్చకులను కూడా చేర్చడంతో వివాదం మొదలైంది. బదిలీలు కోరుకున్న వారితో పాటు నాలుగేళ్లకు పైబడి ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులు అర్చకులకు ఈసారి బదిలీలు చేస్తామని ప్రభుత్వ ప్రకటించడంతో భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు ఆందోళన బాట పట్టారు. గతంలో ప్రభుత్వాలు పాటించిన నిబంధనల ప్రకారం అర్చకులు మినహాయించి సిబ్బందిని మాత్రమే బదిలీ చేయాలని కోరుతూ ఇప్పటికే ఆలయ అర్చకులు స్థానిక శాసనసభ్యులు తెల్లం వెంకటరావుకి వినతి పత్రం అందించారు. ఆలయాల ఆగమ శాస్త్రాలను అనుసరించి పూజారి కృతువులు ఎన్నో ఏళ్లగా నిర్వహిస్తున్నామని ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న బదిలీల నిర్ణయంతో ఆగమ శాస్త్రానికి విగాంతం కలిగే ప్రమాదం ఉందని ఆలయ అర్చకులు ఆందోళన చెందుతున్నారు. తరతరాల నుండి ఇక్కడి సంస్కృతి సంప్రదాయాలను అనుసరిస్తూ సీతారామచంద్ర స్వామి వారికి కైకర్యాలు నిర్వహిస్తున్న తమను బదిలీల పేరుతో వేరే ఆలయాలకు పంపిస్తే అనేక రకాల సమస్యలు తలెత్తుతాయని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలు యాదాద్రి, భద్రాద్రి, వేములవాడ క్షేత్రాలు సహా దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాల్లో అర్చకులుగా నిర్వహిస్తున్న వారి జాబితా నో ప్రభుత్వ స్వీకరించి బదిలీ ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ విషయంపై ప్రజాప్రతినిధులు వెంటనే కల్పించుకొని బదిలీల ప్రక్రియను నిలిపే విధంగా సహకరించాలని భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన అర్చక బృందం ఎమ్మెల్యే వెంకట్రావుకి వినిపించారు. ఆలయ అర్చక సంఘం అభ్యంతరాలపై స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రావు అర్చక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా భద్రాచలం దేవస్థానం ఆలయ అర్చక బృందం ఇచ్చిన అభ్యంతరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి చరవాణి ద్వారా ఎమ్మెల్యే తీసుకో వెళ్లగా ఈ విషయంపై ముఖ్యమంత్రితో స్వయంగా మాట్లాడతానని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పటికే రామయ్య గోత్రనామ ప్రవాణాలపై ఒకవైపు వివాదం నడుస్తున్న తరుణంలో ఆలయ అర్చకుల బదిలీల నిర్ణయంతో మరోసారి ఆధ్యాత్మిక దేవాలయాలు వార్తల్లో నిలుస్తున్నాయి.



నూతన చట్టాలపై ఆటో డ్రైవర్లకు అవగాహన

నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన బానోతు రానా ప్రతాప్ ఆదివారం మండల ఆటో డ్రైవర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ కలిగి ఉండాలని, విధిగా యూనిఫామ్ ధరించాలని, తరచూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ ఉంటామని, ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని, ఆటోలు ఎక్కే మహిళల పట్ల గౌరవంగా మెలగాలని, మహిళలు ఆటోలో ఉన్న సమయంలో ఎలాంటి చెడు ఘటనలు చేసినచో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరూ నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన రాణా ప్రతాప్‌కి ఆటో డ్రైవర్లు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పాపకొల్లులో ఘనంగా ఆషాడ మాస బోనాల పండుగ

నవతెలంగాణ-జూలూరుపాడు

మండలంలోని పాపకొల్లు గ్రామంలో ఆషాడమాసం సందర్భంగా అమ్మవారి ప్రీతిగా బోనాల పండుగ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు మహిళా భక్తులు, చిన్న పెద్దలు పిల్లలు బోనాలు ఎత్తుకొని ఆలయ ప్రాంగణానికి విచ్చేసి శ్రీ శ్రీ కోట మైసమ్మ తల్లి దేవస్థానం నుండి కోళ్ల ఫారం సెంటర్ వరకు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరారు. తిరిగి ఆలయం వద్దకు చేరుకొని బొడ్రాయికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అంతేకాకుండా అమ్మవారికి ఉదయం 7 గంటలకు మామిడి తోరణ అలంకరణ, 8 గంటల నుండి 9 గంటల వరకు పురోహితులచే ప్రత్యేక అభిషేకాలు, బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. పాపకొల్లు గ్రామం పాడిపంటలతో సమృద్ధిగా పండి గ్రామం అభివృద్ధి చెందాలని, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారి ప్రీతిగా ప్రతి ఒక్కరూ మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శ్రీశ్రీశ్రీ కోట మైసమ్మ తల్లి భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.



మండలంలోనూ ఆరుగురు డబుల్ పెన్షన్ దారులు

- తిరిగి ఇవ్వడానికి సుముఖత?!

నవతెలంగాణ-అశ్వారావుపేట

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ చర్చాంశనీయంగా మారిన డబుల్ పెన్షన్ దారులు అశ్వారావుపేట మండలంలోనూ ఆరుగురు ఉన్నట్లు ప్రభుత్వం తేల్చింది. ఈ ఆరుగురు ప్రభుత్వ ఆసరా పెన్షన్‌ను వదులు కోవడం మే గాక అనర్హత పొందినప్పటి నుండి ఎంత తీసుకున్నారో అంత తిరిగి ఇచ్చేందుకు సుముఖత చూపినట్లు తెలుస్తుంది.

పెన్షన్ దారులు మూడు రకాలు

ఒకరు "ఆసరా పెన్షన్ దారులు" అంటే ప్రభుత్వ పరంగా సామాజిక భద్రతలో భాగంగా ఏ ఆసరా లేని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, గీత కార్మికులు, బీడీ కారుకులు.

రెండో రకం "ఎంప్లాయ్ పెన్షన్ దారులు".. అంటే కుటుంబంలో ఎవరైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఏదైనా కారణంతో మృతి చెందితే వారిపై ఆధారపడిన వ్యక్తులకు చెల్లించే పెన్షన్ దారులు.

మూడో రకం సర్వీస్ పెన్షన్ దారులు..అంటే ఎవరైనా కుటుంబ సభ్యులు ఉద్యోగ విరమణ పొందిన అనంతరం పొందే పెన్షన్ దారులు.

"డబుల్ పెన్షన్ దారులు" అంటే ఈ మూడు రకాలలో ఏదో ఒక పెన్షన్ పొందుతూ సామాజిక భద్రత క్రింద ఇచ్చే ఆసరా పెన్షన్ పొందే వారు అని అర్థం.

ఇలాంటి వారికి ఆసరా పెన్షన్ కంటే ఎంప్లాయ్ పెన్షన్, సర్వీస్ పెన్షన్ లే నెల నెల అధిక మొత్తంలో వస్తుంది. అందువల్ల ఆసరా పెన్షన్ వదులుకోవడం ఉత్తమం అనే అభిప్రాయంలో ఉన్నట్లు తెలుస్తుంది.



పెద్దవాగు ప్రాజెక్ట్‌కు జల కల

నవతెలంగాణ-అశ్వారావుపేట

గత మూడు రోజులుగా వాతావరణం మేఘావృతమై ఉండి రోజంతా సన్నని జల్లులు పడటంతో నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట మండలం గుమ్మడి వల్లి పంచాయతీ పరిధిలో గల చిన్నతరహా నీటి తరహా ప్రాజెక్ట్ అయిన పెద్దవాగు ప్రాజెక్ట్‌లో జల కల సంతరించుకుంది. ఈ ప్రాజెక్ట్‌కు దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో వాగులు, కాలువలు ద్వారా వర్షపు వరద చేరుతుంది.

ఈ రెండు మండలాల్లో శుక్రవారం ఉదయం నుండి శనివారం ఉదయం వరకు అశ్వారావుపేట లో 24.8 మి.మీ, దమ్మపేటలో 20.0 మి.మీ వర్షపాతం నమోదు అయింది. అశ్వారావుపేటలో ఆదివారం ఉదయానికి 24.6 వర్షపాతం నమోదు అయింది. ఈ పెద్దవాగు ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 6.10 మీటర్లు. ఆదివారం సాయంత్రం వరకు 4.90 మీటర్లు నీరు చేరింది. 5.30 మీటర్లు వరద చేరితే నీటి విడుదల చేస్తామని ఐబీ ఏఈఈ కేవిన్సీ క్రిష్ణ తెలిపారు.

మార్కెటింగ్ డైరెక్టర్‌ను కలసిన మండల నాయకులు

నవతెలంగాణ-దమ్మపేట



తెలంగాణ రాష్ట్ర సహకార మార్కెటింగ్ శాఖకు డైరెక్టర్‌గా నూతనంగా ఎన్నికైన కొత్వాల శ్రీనివాసరావును మండల నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నూతనంగా పదవిని చేపట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో రాజకీయంగా మరింతగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, చెక్కిరాల మల్లేశ్వరరావు, పానకాల సత్యనారాయణ, చిన్న శెట్టి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ చిన్న శెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మతల్లి దేవాలయంలో కొత్వాల పూజలు

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

మండలం పరిధి జగన్నాధపురం శ్రీ కనకదుర్గ దేవాలయం (పెద్దమతల్లి గుడి)లో అమ్మవారికి తెలంగాణా రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్‌గా నూతనంగా నియమింపబడిన డీసీఎంఎస్ చైర్మెన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేసారు. ఆదివారం దేవాలయంలో కొత్వాల ప్రత్యేక పూజలతో పాటు, దేవాలయం వేదం పండితులు ప్రత్యేక ఆశీర్వచనం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు శాలువాతో కొత్వాలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ఈఓ రజనీకుమారి, మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మండల అధ్యక్షులు కోండం వెంకన్న, దేవాలయం మాజీ చైర్మన్ మహీపతి రామలింగం, డైరెక్టర్లు ఎస్వీఆర్‌కే ఆచార్యులు, చింతా నాగరాజు, సంకా వెంకటరామారావు, కిలారు నాగమల్లేశ్వరరావు, సందుపట్ల శ్రీనివాస్ రెడ్డి, గంధం వెంగళరావు, మాజీ సర్పంచ్ బానోత్ అనిత, కాంగ్రెస్ నాయకులు నందా నాయక్, తుమ్మల శివారెడ్డి, కోండం పుల్లయ్య, వై.వెంకటేశ్వర్లు, దొప్పలపూడి సురేష్, బాదర్ల జోషి, గంధం నర్సింహారావు, కందుకూరి రాము, సందు ప్రభాకర్, ధర్మసోత్ ఉపేంద్ర నాయక్, పులి సత్యనారాయణ, గండు భరత్, పైడిపల్లి మహేష్, గంగుల నరేందర్ రెడ్డి, కాంట్రాక్టర్ రాంబాబు, బానోత్ బాలాజీ, మంగీలాల్, నాగారం కాలనీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవం

నవతెలంగాణ-కరకగూడెం



మండల నూతన ప్రెస్ క్లబ్‌ను మండల పరిధిలోని రైతు వేదికలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొనకంఢ్ల సాయి కిరణ్ గౌడ్ (నవతెలంగాణ), ఉపాధ్యక్షుడిగా సయ్యద్ అఫ్రోజ్ (జనం సాక్షి), ప్రధాన కార్యదర్శిగా బుడగం ప్రవీణ్ (దిశ), కార్యదర్శులుగా జాడి.విజయ్, కలం సాంబమూర్తి, యాకన్న, క్రీడా విభాగం అధ్యక్షులుగా గుడ్ల రంజిత్, సునీల్, రామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా, బట్టా భిక్షపతి, ఇల్లందుల సురేష్, మిగితా విలేకరులను సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరం సమిష్టిగా కలసిమెలసి ప్రెస్ క్లబ్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేస్తామని అన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించండి

నవతెలంగాణ-జూలూరుపాడు

మండలంలో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు తంబర్ల నరసింహారావు కోరారు. ఆదివారం వెంగన్నపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి నిరుద్యోగులకు మిషన్ భగీరథలో అవుట్ సోర్సింగ్ విధానంలో పంపు ఆపరేటర్లుగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన అన్నారు. మండలంలో వేరే జిల్లాల నుంచి వచ్చి పంపు ఆపరేటర్లుగా మండలంలోని పని చేస్తున్నటువంటి అవుట్ సోర్సింగ్ విధానం ఏదైతే ఉందో అదే విధంగా మండలంలో ఉన్నటువంటి నిరుద్యోగులను వేరే మండలాలలో అవుట్ సోర్సింగ్ విధానంలో మిషన్ భగీరథలో పని చేసుకునే అవకాశం కల్పించాలని ఎల్అండ్‌టీపీ కంపెనీని కోరుతున్నారన్నారు. జూలూరుపాడు మండలం తల్లి లాంటిది అని గుండెల నిండా పాలు ఉన్న, సంక నిండా బిడ్డలు ఉన్న ఆకలి తీర్చలేనటువంటి పరిస్థితి మండలంది అన్నారు. ఈ మండలంలో ఉన్న నిరుద్యోగులకు వేరే మండలంలో అవకాశం కల్పించకుండా ఇదే మండలంలో వేరే మండలంలో వేరే జిల్లాలో ఉన్నటువంటి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఎంతవరకు కరెక్ట్ అని ఆయన అన్నారు. తక్షణమే వారిని వేరే మండలానికి తరలించే విధంగా నిర్ణయం తీసుకొని మండలంలో ఉన్నటువంటి నిరుద్యోగులకు మిషన్ భగీరథలో పంపు ఆపరేటర్‌గా వేరే మండలంలోనైనా ఇదే మండలంలో నైనా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన అన్నారు. లేని పక్షంలో మండలంలో ఉన్నటువంటి పార్టీలన్నిటినీ కలుపుకొని కుల సంఘాల అన్నిటిని కలుపుకొని దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మిగిరి కామేశ్వరరావు, చంగల, నాగరాజు, కాకటి, నరేందర్, ఎస్, రమేష్, కె, వెంకట్, పవన్, తదితరులు పాల్గొన్నారు.



బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్

నవతెలంగాణ-దమ్మపేట

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే త్వరితగతిన పూర్తి చేసినందుకు అభినందనలు తెలియజేస్తూ...ఈ ప్రక్రియలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సత్వరమే రిలీవ్ చేసి వారి స్థానంలో సర్దుబాటు కోసం తాత్కాలిక ఉపాధ్యాయులుగా విద్యా వాలంటీలను నియమించాలని యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ వెబ్ ఆప్షన్స్‌లో దొర్లిన పొరపాట్లను సరిచేసి అప్పీల్ చేసుకున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, అలానే లెఫ్ట్ ఓవర్ వేకెన్సీ పోస్టను రీ షెడ్యూల్ ఇచ్చి పదోన్నతులు కల్పించాలని రాబోయే కాలంలో విద్యాశాఖకు ఎక్కువ నిధులు కేటాయించాలని పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేసి పీఆర్సీ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కోరారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పాఠశాలలో సర్వీస్ పర్సను నియమించి పాఠశాలల విద్యాభివృద్ధికి తోడ్పడాలని ప్రభుత్వాన్ని కోరారు. 317 బాధిత ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా పదివేల పీఎస్ హెచ్ఎం పోస్టులను బీఈడీ కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు కూడా పదోన్నతి అవకాశం ఇస్తూ భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆర్.ప్రసాద్, కోశాధికారి ఎం.రామారావు, ఉపాధ్యక్షులు సిహెచ్ కనకదుర్గ, జె.సురేష్, కార్యదర్శులు బి.వినోద్, కే.శ్రీనివాసరావు, జి.శ్రీను, పి.గోవిందరాజు, పి.వెంకట నరసింహ, విపత్తి సత్యనారాయణ, జానకి రామాచారి, ఎం.నాగరాజు, బి.సురేష్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నూతన ఎస్సైను కలిసిన మీడియా మిత్రులు

నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు నూతన సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాణా ప్రతాప్‌ను ఆదివారం మీడియా మిత్రులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



సీతారామ ప్రాజెక్ట్ ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-ములకలపల్లి

సీతారామ ప్రాజెక్ట్ సాగునీరు జిల్లా రైతాంగానికి అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా రైతాంగం వర్షాధారంతో చిన్న చిన్న కుంటల సాగునీటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాగు భూములను ప్రాజెక్టు నిర్మాణానికి వాడుకొని నిర్మాణం పూర్తి అయిన తరువాత జిల్లాకు సాగు నీరు ఇవ్వకపోవడం శోచనియమని అన్నారు. జిల్లా పక్కనే వున్న గోదావరి నీటిని సీతారామ కాలువ ద్వారా జిల్లా రైతాంగానికి అన్యాయం చేసి ఇతర ప్రాంతాలకు తరలించడం ద్వారా జిల్లా రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని అన్నారు. జిల్లాలో బీడు భూములుగా ఉన్న భూములకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ముందు ఈ జిల్లాలో ఉండబడిన బీడు భూములకు సీతారామ ప్రాజెక్ట్ కాలువ ద్వారా సాగునీరు అందించిన తరువాతే ఇతర ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఒకే దఫాలో 2 లక్షల రైతు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎరువులు, పురుగుమందులు సబ్సిడీ ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాలలో తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు కరెంట్, బోర్లు సాగునీటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మాలోత్ రావుజ, గోగ్గల ఆదినారాయణ, నిమ్మల మధు, ఊకంటి రవికుమార్, సోయం వీరస్వామి, ముదిగొండ రాంబాబు డిష్, కుంజా రామ్మూర్తి, గోపగాని లక్ష్మీ నరసయ్య, బైరు ప్రసాద్, కీసరి వెంకట్రావు, పద్దం తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు నీళ్లను ములకలపల్లి మండలానికి అందించాలి

నవతెలంగాణ-ములకలపల్లి

సీతారామ ప్రాజెక్టు నీళ్లను ముందుగా ములకలపల్లికి మండలానికి అందించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్.కె కుమార్ అన్నారు. ఆదివారం ములకలపల్లి మండలం గుట్టగూడెం గ్రామంలో ప్రదర్శన చేసి జిల్లా నాయకులు ఎస్.కె కుమార్ మాట్లాడుతూ.. కొత్తగూడెం జిల్లాలోని దుమ్ముగూడెం దగ్గర సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఖమ్మం జిల్లాకు తీసుకెళ్తున్నారు. ప్రధానంగా గోదావరి ప్రాంతం దగ్గర్లో ఉన్న ములకలపల్లి మండలంలో ఆదివాసీలు, గిరిజనేతల ప్రజలు సాగు చేసుకుంటున్నా భూములకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి సీతారామ ప్రాజెక్టు నీళ్లను అందించాలని కోరారు. అనంతరం ములకలపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి కుంజ కృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు ఆదినారాయణ, చింతల వెంకటేశ్వర్లు, సురేష్, దొబ్బ వెంకటేశ్వర్లు, కొర్రి వీరస్వామి, దుబ్బ రవి, కడియం వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ ఎస్సైగా స్వప్న బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-చంద్రుగొండ

సాధారణ బదిలీపై పాల్వంచ నుండి చంద్రుగొండకు వచ్చిన ఎస్సై జి. స్వప్న బదిలీపై వెళ్తున్న ఎస్సై మాచినేని రవి నుండి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదన్నారు. శాంతి భద్రత పరిరక్షణకు సహకరించాలని కోరారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-చంద్రుగొండ

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన జేఏసీ నాయకుల సమావేశంలో వారు మాట్లాడితూ స్వరాష్ట్రం కోసం పోరాడిన తమకు ప్రభుత్వం పథకాలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తమ పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. ఉద్యమాలకు సంబంధంలేని కొంతమంది తామే ఉద్యమకారులమంటూ చలామణి అవుతున్నారని అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల జేఏసీ నాయకులు గాదే లింగయ్య, రామిశెట్టి సైదయ్య, జాఫర్, రమేష్, రామారావు, యాకయ్య జాకీర్, నాబిద్, అన్వర్, ముస్తఫా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన మా పాడి గేదెల ఆచూకీ తెలపండి

- వేడుకుంటున్న బాధిత రైతులు

నవతెలంగాణ -దుమ్ముగూడెం

వేసవికాలంలో మేత కోసం వెళ్లిన మా పాడి గేదెల ఆచూకీ తెలపండి అంటూ బాధిత రైతులు వేడుకుంటున్నారు. మండలంలోని చిన్న బండి రేవు గ్రామానికి చెందిన రేఖం సాయి బాబు, రేఖం నరేష్ లకు చెందిన నాలుగు పాడి గేదెలు, రెండు లేగ దూడలు సుమారు నెల రోజుల క్రితం మేత కోసం విడిచి పెట్టారు. ఇంటికి తిరిగి రాలేదు. అన్ని చోట్ల గాలించిన ఆచూకీ లభ్యం కాలేదన్నారు. తెలిసిన వారు 9391933367, 628156207 తెలియజేయాలని రైతులు వేడుకుంటున్నారు.



ఆషాడ మాస బోనాల సందడి ప్రారంభం

నవతెలంగాణ -దుమ్ముగూడెం

గ్రామాలలో ఆషాడ బోనాల సందడి ప్రారంభం అయింది. ఆదివారం అష్టమిని పురస్కరించుకుని మండలంలోని నడికుడి గ్రామంలో భద్రాచలం, చర్ల ప్రధాన రహదారి పక్కన స్వయంభుగా వెలసినటువంటి శ్రీ శ్రీ మహంకాళి చాముండేశ్వరి అమ్మవారికి ఆషాడ మాస బోనాలను మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి సమర్పించారు. అమ్మవారి అనుగ్రహము కొరకు ప్రతి ఏట ఆషాడ మాసంలో ఆచారం ప్రకారం బోనాల ను సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు యశ్వంత్ శర్మ రాఘవ శర్మలతో పాటు ఆలయ సభ్యులు అపక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థలో జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ రాత పరీక్ష

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ (జేఎంఈటి) టీ అండ్ ఎస్ గ్రేడ్-సి పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేయుటకు ఆదివారం స్థానిక సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. సింగరేణి జీఎం(పర్సనల్) బిఆర్. ధీక్షితులు పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. 100 ఖాళీలకు గాను అర్హులైన 375 అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా, 361 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష ఫలితాలు ఆదివారం రాత్రి నుంచే సింగరేణి వెబ్ సైట్, సింగరేణి ప్రధాన కార్యాలయ మేయిన్ గేట్ వద్ద గల నోటీస్ బోర్డు ద్వారా తెలియజేయటం జరుగుతుందని జీఎం వెల్లడించారు.

పేటలో బోనం ఎత్తిన మహిళలు



నవతెలంగాణ - అశ్వారావుపేట

ఆషాడాన్ని పురస్కరించుకుని మహిళలు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆదివారం పట్టణంలోని మద్దిరావమ్మ ఆలయం, వడ్డెర బజార్ ముత్యాలమ్మ అమ్మవారి సన్నిధిలో వేరు వేరుగా ఆషాడం బోనాలను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా బోనాలను నెత్తిన ధరించి తీన్మార్ డప్పు వాయిద్యాలతో పట్టణంలోని పలు దేవాలయాలను దర్శించుకున్నారు. వడ్డెర బజార్, కోట మైసమ్మ, లక్ష్మీగణపతి ఆలయం, అభయాంజనేయ స్వామి, కోనేరు ముత్యాలమ్మ దేవాలయాలను దర్శించుకున్న తరువాత డ్రైవర్స్ కాలనీలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఏజెన్సీకి 'ఫీవర్'





- ఏజెన్సీపై నాలుగు వేరియంట్ల దాడి
- ఆందోళన కలిగిస్తున్న

ఆసుపత్రి సిబ్బంది కొరత

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

జులై మాసం ప్రారంభమైనది అంటేనే భద్రాచలం ఏజెన్సీకి ఫీవర్ మొదలవుతుంది. వాతావరణ మార్పుతో దోమల సైర విహారం మొదలై ఏజెన్సీ ప్రజలు విష జ్వరాలకు బలవటం ఖాయమవుతుంది. ఇప్పటికే ఏజెన్సీ వ్యాప్తంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలతో ప్రజలు ఆసుపత్రి పాలవుతున్న నేపథ్యంలో మరొక రెండు నెలల పాటు వీటి తీవ్రత మరింత పెరిగి భద్రాచలం ఏజెన్సీపై జ్వరాల పంజా విసిరే అవకాశం ఉంది. ఏజెన్సీపై డెంగీలోని నాలుగు ప్రధాన వేరియేట్లు అయిన డీఈఎన్ వి1, డిఈఎన్ వి2, డిఈఎన్ వి3, డిఈఎన్ వి4ల ప్రభావం ఏజెన్సీ ప్రాంతంపై అధికంగా ఉండే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నాలుగు వేరియంట్లు కూడా ఒకేసారి దాడి చేసే ప్రమాదం కూడా లేకపోలేదని వైద్య బృందం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డెంగీ లక్షణాలు..

డెంగీతో ఉన్నట్టుండి తీవ్ర జ్వరం భరించలేం తలనొప్పితో ప్రారంభం అవుతుంది. కళ్ళు తెరవడానికి కూడా రోగి తీవ్రమైన ఇబ్బంది పడే లక్షణంతో బాధపడుతూ చర్మంపై దుద్దర్లు కనిపించడంతోపాటు కండారాలు కీళ్ల నొప్పులు తీవ్రంగా ఉంటాయి. అధిక దాహంతో పాటు రక్తపోటు పడిపోవడంతో రోగిలో విపరీతమైన నీరసం ఏర్పడుతుంది. ప్లేట్లెట్స్ క్రమక్రమంగా పడిపోతూ ప్రమాద తీవ్రతను పెంచుతుంది. డెంగీ జ్వరాన్ని ముందుగా గుర్తిస్తే 80 శాతం వరకు ఎటువంటి ప్రమాదం ఉండదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్లేట్లెట్స్ 20వేల కంటే తగ్గిపోతే రోగి ప్రాణాలపై ప్రభావం పడుతుందని వైద్యులేచ్చరిస్తున్నారు.

ఆందోళన కలిగిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది కొరత

ఇప్పటికే ఏజెన్సీవ్యాప్తంగా విష జ్వరాలు ప్రబలిస్తున్న నేపథ్యంలో నాలుగు రాష్ట్రాలకు సరిహద్దు కేంద్రంగా ఉన్నటువంటి భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఆందోళన కలిగిస్తుంది. పూర్తిస్థాయిలో వైద్యులు సిబ్బంది లేకపోవడంతో ఏజెన్సీ ప్రజలకు ప్రభుత్వాసుపత్రిలే దిక్కైన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా జులై, ఆగస్టు, సెప్టెంబర్‌లో వచ్చే విష జ్వరాలను నియంత్రించేందుకు ప్రభుత్వ ఏరియాస్పత్రిలో ప్రత్యేక వైద్య నిపుణులు జనరల్ మెడిసిన్ వైద్య బృందం అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రయివేటు ఆసుపత్రిబాటపడుతున్నారు. డెంగ్యూ, టైఫాయిడ్ నిర్ధారించే రక్త పరీక్షలకి కావలసిన పూర్తిస్థాయి సిబ్బంది కూడా ఏరియా ఆసుపత్రి లేకపోవడంతో వైద్య రక్త పరీక్షల కోసం ప్రయివేట్ ల్యాబ్లను ఆచరిస్తున్న ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నారు.

ఆసుపత్రిలో సిబ్బందిని ఏర్పాటు చేసి ఏజెన్సీ వ్యాప్తంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి

సీపీఐ(ఎం) నియోజకవర్గ కన్వీనర్ మచ్చ వెంకటేశ్వర్లు



భద్రాచలం ఏజెన్సీ వ్యాప్తంగా విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపోను వైద్య బృందాన్ని కావలసిన మందులను ఏర్పాటు చేసి ప్రజలను కాపాడాలి. అదేవిధంగా ప్రయివేట్ స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకొని ఏజెన్సీ వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించి ఏజెన్సీ మారుమూల గ్రామాలలో ఆదివాసీ ప్రజలకు వైద్య పరీక్షలను నిర్వహించాలి. ఒకవైపు గోదారి వరదలు మరోవైపు సీజనల్ జ్వరాలు ఏజెన్సీ ప్రజలపై తీవ్ర ప్రభావం పడనున్న నేపథ్యంలో కలెక్టర్ భద్రాచలం ఏజెన్సీ ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇప్పటికే పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీఆర్ ట్రస్టు వైఎస్ఆర్ ట్రస్టుల ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించేందుకు పార్టీ సిద్ధంగా ఉంది.

వనవాసీ కళ్యాణ పరిషత్‌కు భూమి వితరణ

- దాతృత్వం చాటుకున్న జవ్వాది కుటుంబం

నవతెలంగాణ-చర్ల

మండల కేంద్రంలోని వనవాసీ కళ్యాణ పరిషత్‌కు చర్లకు చెందిన జవ్వాది కుటుంబ సభ్యులు కోదండ రాంబాబు, సుమతి రామ్ దంపతులు భూ వితరణచేసారు. గత రెండు దశాబ్దాలుగా చర్లలో వనవాసీ సంస్థను ఏర్పాటు చేసి కొమరం భీం విద్యార్థి నిలయం ద్వారా వందల మంది ఆదివాసీ విద్యార్థులకు వసతి కల్పించారు. సంస్థ క్రమ శిక్షణతో పాటు దేశంపై ప్రేమాభిమానం కలిగించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దింది. వృత్తిరీత్యా గుంటూరులో స్థిరపడిన కోదండ రాంబాబు దంపతులు వనవాసీ కళ్యాణ పరిషత్ సేవలకు ముగ్దుడయి తాను పుట్టిన జన్మభూమికి ఎంతో కొంత సేవ చేయాలని తలిచారు. అనుకున్నదే తడువు చర్లలోని తన పట్టాభూమిలో 30 లక్షల విలువ చేసే 10 సెంట్ల భూమిని కోదండ రాంబాబు తల్లి, తండ్రులు జవ్వాది నారాయణమూర్తి-జయలక్ష్మిల జ్ఞాపకార్థం సంస్థకు విరాళంగా అందచేసారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో భూమికి దస్తావేజులను తన సోదరుడు జవ్వాది జయకుమార్ చేతుల మీదుగా వనవాసీ దక్షణ క్షేత్ర సంఘటన మంత్రి శివరామకృష్ణ, తెలంగాణా ప్రాంత సంఘటనా మంత్రి వేముక ఆంజనేయులు, సహప్రాంత సంఘటనా కార్యదర్శి షహమీర్ శ్రీనివాస్‌లకు అందచేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దనం అందరి దగ్గర ఉంటుందని సేవా గుణం కొందరిలోనే ఉంటుందన్నారు. సంస్థ సేవలను గుర్తించి వితరణ అందచేయడం సంతోషకరమన్నారు. దాతల ఆశయానికి అనుగుణంగా త్వరలో స్థలంలో పేద మహిళల కొరకు కుట్టు మిషన్ కేంద్రంతో పాటు కంప్యూటర్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి స్వయం ఉపాది కల్పించేలా కృషి చేస్తామన్నారు. అనంతరం బాలికల కోసం వసతి గృహం నెలకొల్పి బాలికా విద్యనందించేలా చొరవచూపుతామన్నారు. జవ్వాది జయకుమార్‌తో పాటు స్థల దాతలు కోదండ రాంబాబు, సుమతీ రామ్ దంపతులు మాట్లాడుతూ ఇప్పటికే తమ కుటుంభం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేసారు.



ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగిఉండి సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగకరమయిన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం జయకుమార్‌తో పాటు స్థల దాతలను వనవాసీ భాద్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రాంత మహిళా కార్యకారిణి పెద్దాడ ఆశాలత, జవ్వాది కుటుంబ సభ్యులు రవికుమార్, మురళీకృష్ణ శ్రీకాంత్, పూర్ణిమ, శ్రీనివాస్, వనవాసీ ప్రతినిదులు కోరం సూర్యనారాయణ, తాటి పాపారావు. బంద స్వరూప, రామ్ లక్ష్మన్, వేములపల్లి ప్రవీణ్, గొంది శోభన్, ప్రసన్న, కోరం రామారావు పాల్గొన్నారు.

పల్లెలకు గ్రామీణ వైద్యుడే రక్ష

నవతెలంగాణ సత్తుపల్లి రూరల్

పేదలు పోతా పోతా వుంటే కాలికి వెదురు దెబ్బతగిలితే, అబ్బా అంటూ వెంటనే చిటికెడు మట్టి పూసుకొనో, పక్కనే ఉన్న ఏదో ఒక ఆకు పసర పోసుకొనో, పోవడానికి అలవాటు పడ్డ పల్లెల్లోని పేదలకు, ఆ పల్లెలోని గ్రామీణ వైద్యులే గొప్ప వైద్యోనారాయణుడుగా కనిపిస్తాడు. అటువంటి గ్రామీణ వైద్యులను నకిలీ డాక్టర్లు అంటూ దాడులు చేస్తూ.. వారి భృతి పైన, బతుకులపైన దెబ్బగొట్టాలని కొందరు చూస్తున్నారని గ్రామీణ వైద్యులు వాపోతున్నారు. వారి మాటల్లో గ్రామీణ వైద్యులు తమ వృత్తిని ఆపాలంటే..!

ప్రతి పంచాయతీకి క్వాలిఫై డాక్టర్ రావాలి. ప్రతి ఇంటికి క్వాలిఫై నర్సులు రావాలి.. అని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మన ఆదిమకాలం నుంచి, తాతా ముత్తాల నుంచి ఏ మారు మూల గ్రామంలోనైనా, అర్ధ రాత్రి, అపరాత్రి అనకుండా ఏ క్షణంలో నైనా ప్రత్యక్షమై వారి చిన్నా చితకా రోగాలను, బాధలు పోగొట్టి ప్రాణాలకు రక్షణకు ప్రతి నిత్యం కంటికి కునుకు లేకుండా నిలబడే వాడే గ్రామీణ వైద్యుడు. కొంతమంది క్వాలిఫైడ్ డాక్టర్లు, తమది, గ్రామీణ వైద్యుల బంధం గురు శిష్యులు బంధం అన్న సంగతి మరిచి. పల్లెల్లో పిలిస్తే పలుకుతూ,వారికి తెలిసిన పరిధిలో చికిత్సలు చేసి, మెరుగైన చికిత్స కోసం తగిన వైద్యులైన తమ గురువుల వద్దకు వెళ్లమని మంచి సలహాలు ఇస్తూ, ఎప్పుడు పల్లె ప్రజలకు కొండంత అండను ఇచ్చే గ్రామీణ వైద్యులను నకిలీ డాక్టర్లని ,ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మట్లాడడం సరికాదు. నిజంగా మీ వాదనలో నిజమే వుంటే , అప్పుడు మీరు ముందుగా చేయవలసింది గ్రామీణ వైద్యులపైన దాడులకు వెళ్ళవలసిన పనిలేదు. మీరు స్వచ్ఛందంగా కదలి పల్లెలకు వచ్చి పేదల ప్రాణాలకు రక్షణ కవచంగా నిలబడండి. లేదా ప్రభుత్వాలతో మాట్లాడి ప్రతి పంచాయతీకి ఒక క్వాలిఫై డాక్టర్లను ఏర్పాటు చేయమని చెప్పండి, అలాగే ప్రతి ఇంటికి వెళ్లి వైద్యం చేస్తూ, మెరుగైన వైద్యం కోసం మంచి సలహాలు ఇచ్చేలా క్వాలిఫై నర్సులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోమని మీరందరు పోరాటమే చేస్తారో, ప్రయత్నమే చేస్తారో చేయాలని గ్రామీణ వైద్యులు తెలియజేస్తున్నారు.



ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అవుతుందని ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మీనమేషాలు లెక్కపెట్టకుండా బేషరతుగా అమలుకు పూనుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కేచ్చల రంగయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలోని పార్టీ కార్యాలంలో కార్యకర్తలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతు రుణమాఫీ పెంచి ఇస్తామని చెప్పిన పెన్షన్లు ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు, ఉద్యమ కారులకు ఇళ్ల స్థలాలు, ఇల్లు, రేషన్ కార్డులు అర్హులైన వారందరికీ డబ్బులు బెడ్ రూమ్ ఇల్లు, ఉచిత వైద్యం, ఉచిత విద్య తదితర హామీలు ఇంకెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న మండల కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 29న కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించనున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలు పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, నాయిని రాజు, జాటోత్ కృష్ణ, చంద్ర అరుణ, అమర్లపూడి రాము, నూప భాస్కర్, కల్పనక్క, గోకినపల్లి ప్రభాకర్, మధుసూదన్ రెడ్డి, మాచర్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సర్టిఫికెట్లు జారీకి తహసీల్దార్ కొత్త

- తల్లిదండ్రుల సర్టిఫికెట్ల భేఖాతర్ చేస్తున్న అధికారులు
- కుల సంఘంనుంచి ధ్రువీకరణ తెస్తే ఓకే
- గతంలో తహసీల్దార్లు ఇచ్చిన సర్టిఫికెట్లు పరిగణలోకి తీసుకోం
- ఇది చింతకాని తహసీల్దార్ కార్యాలయ అధికారుల వింత పోకడ

నవతెలంగాణ-బోనకల్

మున్నూరు కాపు సర్టిఫికెట్ల జారీపై చింతకాని తహసీల్దార్ కార్యాలయ అధికారులు మున్నూరు కాపులకు నరకం చూపిస్తున్నారు. గతంలో తల్లిదండ్రులకు ఇచ్చిన సర్టిఫికెట్ల ఆధారంగా వారి పిల్లలకు సర్టిఫికెట్లు ఇవ్వడానికి కూడా అధికారులు నిరాకరిస్తున్నారు. గతంలో చింతకాని తహసీల్దార్లు ఇచ్చిన సర్టిఫికెట్లు కూడా ఆధారం కాదని తహసీల్దార్ కార్యాలయ అధికారులు వింత వాదన చేయుటం కొసమెరుపు. కుల సంఘం నుంచి తెచ్చిన ధ్రువీకరణ మాత్రమే రాజముద్ర అని వింత వాదన చేస్తూ సర్టిఫికెట్లు ఇవ్వటానికి నిరాకరిస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు అనేకమంది మున్నూరు కాపులు ఆంధ్ర నుంచి తెలంగాణకు వచ్చి స్థిరపడ్డారు. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలోనూ అనేక ప్రాంతాలలో మున్నూరు కాపులు స్థిరపడ్డారు. అటువంటి వారికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఖమ్మం జిల్లాలో గల మున్నూరు కాపులకు బీసీ-డీ సర్టిఫికెట్లను రెవెన్యూ అధికారులు జారీ చేశారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపులను బీసీ - డీగా గుర్తిస్తూ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ అధికారులు సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. అయితే నోటరీ కండిషన్ పెడుతున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ చింతకాని తహసీల్దార్ కార్యాలయం నోటరీతో పాటు కుల సంఘం నుంచి తాము మున్నూరు కాపులమని ధ్రువీకరణ పత్రం తీసుకొని వస్తేనే బీసీ -డీ సర్టిఫికెట్ ఇస్తామని తహసీల్దార్‌తో పాటు గిర్దావర్లు కూడా స్పష్టం చేయటం విశేషం. ఇంత వరకు కొంత బాగానే ఉంది.

అసలు సమస్య ఇక్కడ నుంచే ప్రారంభం...

గతంలో పనిచేసిన తహసీల్దారులు విద్యార్థుల తల్లిదండ్రులకు మున్నూరు కాపు బీసీ - డీ సర్టిఫికెట్లను రాష్ట్రం ఏర్పడిన తర్వాత జారీ చేశారు. గత సర్టిఫికెట్ల ఆధారంగా బీసీ - డీ సర్టిఫికెట్లు ఇవ్వటానికి ప్రస్తుత రెవెన్యూ అధికారులు తిరస్కరించటం విశేషం.

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు చింతకాని మండలానికి చెందిన ఒక వ్యక్తికి మున్నూరు కాపు బిసి-డి సర్టిఫికెట్ ను అధికారులు ఇచ్చారు. అయితే తెలంగాణ పేరుతో మున్నూరు కాపు బీసీ - డి సర్టిఫికెట్ అవసరం కావడంతో మరల ఆయన నాలుగు రోజుల క్రితం కార్యాలయానికి వచ్చాడు. దీంతో రెవెన్యూ అధికారులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఈ సర్టిఫికెట్ ఇచ్చారని ప్రస్తుతం ఆ సర్టిఫికెట్ ఆధారంగా నీకు మరల మున్నూరు కాపు బీసీ - డీ సర్టిఫికెట్ ఇవ్వటం కుదరదని స్పష్టం చేశారు. కుల సంఘం నుంచి ధ్రువీకరణ పత్రం తెస్తేనే మరలా మీకు మున్నూరు కాపు బీసీ - డీ సర్టిఫికెట్ ఇస్తామని చెప్పడంతో ఆ వ్యక్తి ఒక్కసారిగా బిత్తర పోయారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు ఒకరకంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ఒకరకంగా నా కులం ఉంటుందా అని రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా అవన్నీ మాకు అనవసరం మేము చెప్పినట్టు చేయాల్సిందేనని వెనుకకు తిరిగి పంపించి వేశారు.

గతంలో మండల తహసీల్దారులుగా పనిచేసిన అధికారులు జారీ చేసిన సర్టిఫికెట్లు ఆధారంగా తాము వారి పిల్లలకు సర్టిఫికెట్లు ఇవ్వలేమని, తప్పని సరిగా కుల సంఘం నుంచి తెచ్చిన ధ్రువీకరణ పత్రం ఆధారంగానే సర్టిఫికెట్లు ఇస్తామని షరతు విధించటం విమర్శలకు తావిస్తుంది.

అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్లకు విలువ లేదని, ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన సర్టిఫికెట్లు ఆధారంగానే కుల సర్టిఫికెట్లు ఇవ్వటం పట్ల పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతన్నాయి. ఇప్పటికైనా మండల అధికారులు వాస్తవ పరిస్థితుల ఆధారంగా సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతున్నారు.



కుల సంఘం జారీ చేసిన పత్రం కావాల్సిందే.. తహసీల్దార్ రమేష్

మున్నూరు కాపు సర్టిఫికెట్లకు కచ్చితంగా కుల సంఘము జారీ చేసిన పత్రం కావాల్సిందేనని స్పష్టం చేశారు. తల్లిదండ్రుల సర్టిఫికెట్ల ఆధారంగా వారి పిల్లలకు సర్టిఫికెట్లు ఇవ్వచ్చు కదా అని ప్రశ్నించగా అవన్నీ మాకు అనవసరం, అవి తెస్తేనే ఇస్తాం అనటం విశేషం. గతంలో తహసిల్దారులు ఇచ్చిన సర్టిఫికెట్లు కంటే ఓ ప్రైవేటు కుల సంఘం ఇచ్చే ధ్రువీకరణ పత్రం ఆధారం ఎలా అవుతుందని ప్రశ్నిస్తే మేము చెప్పినట్లు చేస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని తహసిల్దార్ స్పష్టం చేశారు. గిరిదావర్లను కూడా ప్రశ్నించగా తహసిల్దార్ చెప్పిన విషయాలనే చెప్పారు.



రాజుపేట గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి సేవ సమితి, సింగరేణి వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండల పంచాయతీ పరిధిలోని రాజుపేట గ్రామంలో ఆదివారం సింగరేణి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సింగరేణి సంస్థ పురోభివృద్ధికి సింగరేణీయులు ఎంతో కృషి చేస్తున్నారు. అలాగే సంస్థ విస్తరణకు ప్రాజెక్ట్ ప్రభావిత నిర్వాసితులు, పరిసర గ్రామాల ప్రజలు తమ వంతు బాధ్యతగా ఇతోధికంగా తమ వంతు సహకారం అందిస్తున్నారు. వారి సహకారాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి ద్వారా క్రమం మణుగూరు ఏరియా పరిసర ప్రాంత గ్రామస్తులకు అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను మరింతగా విస్తృత పర్చారు. అందులో భాగంగా ఆదివారం మండల పంచాయతీ పరిధిలోని రాజుపేట గ్రామస్తులను వైద్య పరీక్షలు నిర్వహించి బీపీ, షుగర్ పరీక్షలు చేయడంతో పాటు జ్వరం, కీళ్ల నొప్పులు, చర్మ వ్యాధులు, తదితర సీజనల్ వ్యాధుల నివారణకు కూడా మొత్తం 225 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రాజుపేటలో కాలువల వద్ద, పరిసర ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ప్రబల్లుతున్న సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పాటించవలసిన పరిసరాల, గృహ, వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించవలసిన ఆవశ్యకతపై సింగరేణి వైద్యులు రాజుపేట గ్రామస్తులకు అవగాహన కల్పించినట్టు డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్ తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సింగరేణి మెడికల్ సూపరిండెంట్ శేషగిరి రావు టి.సురేష్, వేంకట రమణయ్య, ఏరియా హాస్పిటల్ సిబ్బంది రూప, రవి, పీ.నందిని, కె.రవి, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, సేవ కో ఆర్డినేటర్ కె.వీ.మారేశ్వర రావు, మాజీ సేవ కో ఆర్డినేటర్ యండీ యూసఫ్, పెద్ద సంఖ్యలో రాజుపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

మణుగూరు ఏరియాలో అక్రమ బదిలీలను నిలిపివేయాలి

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు ఏరియాలో కొండాపురం గని నందు సర్ఫేస్ మజ్దూర్‌లుగా పనిచేస్తున్న కొంత మంది కార్మికులను యాజమాన్యం ఇష్టారీతిన బలవంతంగా బదిలీలు చేస్తూ, వారి కుటుంబ సభ్యులను మనోవేదనకు ఇబ్బందులకు గురి చేయడం సరికాదని ఏరియా టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షులు నాగెల్లి ఆదివారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేపీయూజీ మైన్ నందు పని చేస్తున్న 161 మంది అండర్ గ్రౌండ్ మజ్దూర్‌లకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌లుగా జులై 2023లో యాజమాన్యం పదోన్నతులు కల్పించిన సమయంలో యాజమాన్యమే కేపీయూజీ గని నందు ఉన్న ఉపరితల పనులను దృష్టిలో ఉంచుకొని కార్మిక అభిప్రాయం సేకరించకుండానే 11 మంది అండర్ గ్రౌండ్ కార్మికులకు కేపీయూజీ పేరిట సర్ఫేస్ పదోన్నతులు ఇచ్చినట్టు తెలిపారు. యాజమాన్యం ఇచ్చిన పోస్టింగ్ ఆర్డర్‌ను 11 మంది యువ కార్మికులు గౌరవించి రిపోర్టింగ్ చేసి సంవత్సరం పై బడి గని నందు విధులు నిర్వరించిన తర్వాతా నేడు అర్ధతరంగా కొంత మంది కార్మికులను ఉద్దేశ్య పూర్వకంగా ఏరియాలోని పీకేటీసీ 2కు బదిలీ చేయడం సరికాదని తెలిపారు. మణుగూరు ఏరియాలో కొందరు అధికారులు నియమా నిబంధనలు పక్కకు పెట్టి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని, వారి పద్ధతి మార్చుకొని సంస్థ పురోగతికి పాటుపడాలని కక్ష్య సాధింపు చర్యలు విడనాడాలని ఆయన కోరారు.



ఎంపీ విస్తృత పర్యటన

- పెద్దమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు
- డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల ఆధ్వర్యంలో ఘన స్వాగతం

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

ఖమ్మం పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికై మొదటిసారి పాల్వంచలో పర్యటనకు వచ్చిన రామసహాయం రఘురాంరెడ్డికి తెలంగాణా రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీగా కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాధపురం పెద్దమ్మతల్లి గుడి దేవాలయంలో ఈఓ రజనీకుమారి ఎంపీకి పూర్ణకుంభం, ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసారు. కొత్వాల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కార్యకర్తలు రఘురాంరెడ్డికి శాలువా, బొకేలతో సత్కరించారు.. ఈ కార్యక్రమాల్లో తెలంగాణా రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ అండ్ డీసీఎంస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు, జడ్పీ చైర్మెన్ కంచెర్ల చంద్రశేఖర్, జడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మండల అధ్యక్షులు కోండం వెంకన్న, నాయకులు జాలే జానకిరెడ్డి, బాలినేని నాగేశ్వరరావు, అడ్వకేట్ తుమ్మల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండ్లేండ్ల చిన్నారితో కలిసి తండ్రి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు

నవతెలంగాణ -కూసుమంచి



భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలో ఓ తండ్రి రెండేండ్ల చిన్నారిని తీసుకొని వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా పోలీసులు కాపాడిన ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని జీళ్ల చెరువు గ్రామానికి చెందిన జంపాల నరేష్ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో శనివారం రాత్రి తన రెండు సంవత్సరాల కుమార్తెను తీసుకుని పాలేరు రిజర్వాయర్ వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు 100కు ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన బ్లూకోడ్ పోలీస్ బ్రహ్మం, పోలీస్ సిబ్బంది వచ్చి కాపాడారు. వీరిని పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

జిల్లా అభివృద్ధికి కృషి...

- ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి

నవతెలంగాణ-కొత్తగూడెం



ఖమ్మం జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి అన్నారు. ఆదివారం కొత్తగూడెంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. మొదటిసారిగా ఎంపీ హెూదాలో కొత్తగూడెం నియోజకవర్గానికి విచ్చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. ఎంపీగా గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి కొత్తగూడెం నియోజకవర్గంలో 75 వేల ఓట్ల మెజారిటీని అందించిన నియోజకవర్గ ప్రజలందరికీ పాదాభి వందనాలన్నారు. ఖమ్మం జిల్లా చరిత్రలోనే అత్యధిక మెజారిటీ ఓట్లతో గెలిపించినందుకు మరోసారి ప్రజలకు, రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు. అందుకే తొలిసారిగా కొత్తగూడెం జిల్లాకు వచ్చిన సందర్భంగా తొలుత కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఆవరణలో జరుగుతున్న పలు అభివృద్ధి, ఆధునీకరణ పనులను పరిశీలించాని తెలిపారు. కొత్తగూడెం (భద్రాచలంరోడ్) రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులు పరిశీలించినట్లు తెలిపారు. వాటికి సంబంధించిన వివరాలు అధికారులు ఎంపీకి వివరించారని అన్నారు.పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ప్రయాణికులకు ఎటువంటి ఆటంకం కలిగించవద్దని సూచించినట్లు తెలిపారు. భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ నుండి నడిచిన రైళ్లను కోవిడ్-19 కారణంగా రైళ్లను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం తిరిగి రైళ్లను పునరుద్ధించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

కొత్తగూడెంలో అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బైపాస్ రోడ్ సమస్య పరిష్కారం చేస్తామన్నారు. జిల్లాలో గతంలో పరిశీలన చేసినప్పటికీ ముందుకు సాగని ఏయిర్ పోర్టు విషయం గురించి ప్రస్తవించారు. అవకాశం ఉంటే కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో జిల్లా జడ్పీ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు, జిల్లా మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ఆళ్ల మురళి, నాగేంద్ర త్రివేది, గోపాల్ రావు, కోనేరు సత్యనారాయణ, జేవిఎస్ చౌదరి, మేరెడ్డి జనార్ధన్ రెడ్డి, చీకటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం...

- రెవిన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందజేస్తామని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొండాపురం, ఆరెంపుల, గూడూరుపాడు, తనగంపాడు తదితర గ్రామాల్లో ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రేస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు. అతి త్వరలోనే అర్హులందరికి రేషన్ కార్డులు, ఇండ్లు అందిస్తామని తెలిపారు. ఆగస్టు 15లోగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. పాలేరు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరు ప్రతి ఇంట్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.గ్రామాల్లో మంత్రి పొంగులేటి మొక్కలు నాటారు. కొండాపురం గ్రామం నుండి గూడురుపాడు వెళ్తుండగా మార్గం మధ్యలోని యం.వెంకటాయపాలెం గ్రామం సమీపంలో మహిళా రైతు కూలీలు పొలంలో పనిచేస్తుండగా మంత్రి కాన్వాయ్ ఆపి రైతు కూలీల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారి నుండి రైతు భరోసాపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆరెకోడు గ్రామానికి చెందిన మహిళా రైతు కొంపెల్లి రామ నర్సమ్మ ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నానని మంత్రికి వివరించింది. గత ఐదేండ్లుగా వ్యవసాయంపై ఏమి మిగలడం లేదని నష్టాలపాలు అవుతున్నానని తెలిపింది. అయితే కౌలు రైతులకు అన్యాయం జరుగుతుందని పట్టాదారులకే న్యాయం జరుగుతుందని కౌలు రైతులను కూడా రైతు భరోసా కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని మంత్రిని కోరింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి, మద్ది వీరారెడ్డి, మద్ది మల్లారెడ్డి, మొక్క శేఖర్ గౌడ్, కేతినేని వేణు, సీపీఐ నాయకులు సురేష్, కమలాకర్, సుధాకర్, రాంమూర్తి నాయక్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో మేడేపల్లి విద్యార్థులకు బ్రాంజ్ మెడల్

నవతెలంగాణ-ముదిగొండ



రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్షిప్ ఈనెల 12 నుండి14 వరకు మూడు రోజులపాటు నాగర్ కర్నూలు జిల్లాలో కల్వకుర్తి జరిగిన లీగ్ మ్యాచెస్‌లో బి ఫుల్ నుండి మెదక్, మంచిర్యాలపై విజయం సాధించి సెమీస్‌కి ఎంపికై సెమీఫైనల్‌లో మహబూబ్‌నగర్‌పై ఒకటి..ఒకటి గోల్స్‌తో డ్రాగా నిలిచి మేడేపల్లి విద్యార్థులు బ్రాంచ్ మెడల్‌ను కైవసం చేసుకున్నారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బండి నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.తనుశ్రీ, భయ్యాం కీర్తి (గోల్ కీపర్) పోటీలో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సబ్ జూనియర్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్‌లో మేడేపల్లి నుంచి ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికై బ్రాంజ్ మెడల్ సాధించడం పట్ల పిటీలు బియ్యని కృష్ణయ్య, ఎస్ శ్రీనివాస్, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, గ్రామ మాజీ సర్పంచ్లు కొత్తపల్లి నాగలక్ష్మి, సామినేని రమేష్, గ్రామపెద్దలు భాస్కర్‌రావు, ఉపేందర్, పోటు ప్రసాద్, శంకర్‌రావు ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఫుడ్ మెనూ సక్రమంగా అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఖమ్మం

ఫుడ్ మెనూ సక్రమంగా అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్యూ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని పిడిఎస్యూ కమిటీ ఆధ్వర్యంలో బిసి ఆర్‌సిఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాన్ని సందర్శించడంతో పాటు విద్యార్థులతో సంభాషణ చేయడం ద్వారా అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గురుకులలో కనీసం సౌకర్యాలు లేవని, విద్యార్థులకు చికెన్, మటన్ మెనూ కూడా సక్రమంగా ఇంప్లిమెంట్ చేయడం లేదని ఆరోపించారు. 800 మంది విద్యార్థులకు కేవలం నాలుగు బాత్రూమ్స్ మాత్రమే ఉండటంతో పాటు విద్యార్థులు పలిగిన గచ్చుపై నిద్రించడంతో పాటు తరగతులు కూడా ఉపయోగిస్తున్న దౌర్భాగ్య పరిస్థితి నేడు ఖమ్మం జిల్లా గురుకులలో కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.. కార్యక్రమంలో నాయకులు పృథ్వీ శ్రీను, స్టాలిన్, విద్యార్థుల తల్లీ తండ్రులు భారతమ్మ సైదామ్మ తదితరులు పాల్గొన్నారు.

'కూచవల్లాల్' పూర్వ విద్యార్థుల కోలాహలం

- 50 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను పంచుకున్న 42 మంది స్టూడెంట్స్
- 1973- 74 ఏడో తరగతి ఉత్తీర్ణుల సందడే సందడి

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ఖమ్మంలోని కూచవల్లాల్ యూపీఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అత్యంత కోలాహలంగా కొనసాగింది. పాఠశాలలో 50 ఏళ్ల క్రితం 1973- 74లో ఏడో తరగతి చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఒకచోట చేరి సందడి చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి, శ్రీరామ్ హిల్స్ హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షులు మందడపు రామకష్టారెడ్డి నివాసంలో మరో పూర్వ విద్యార్థి కేవీ చారి నేతత్వంలో నాటి మధుర స్మతులను నెమరు వేసుకున్నారు. 42 మంది పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరి ఎలాంటి అరమరికలు లేని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు పుస్తకాలతో చెలిమి చేసిన వీరంతా నేడు కుటుంబం, పిల్లలు, మనవళ్లు మనవరాళ్లతో ఎలా గడుపుతున్నారో పరస్పరం తెలుపుకుంటూ ఆనందోత్సాహాల మధ్య రోజంతా గడిపారు. ఇలాంటి సమ్మేళనాలను మరిన్ని నిర్వహించుకోవాలని నిర్ణయించుకున్నారు. అందుకు తగిన ప్రణాళికనూ రూపొందించుకున్నారు. తమ ఆత్మీయ సమ్మేళనం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించుకున్నారు. నాటి, నేటి చదువుల్లో చోటు చేసుకున్న మార్పులు, పిల్లల ప్రవర్తనపై చర్చించారు. షేక్ హ్యాండ్లు, ఆత్మీయ ఆలింగనాలు, కుటుంబ సభ్యుల పరిచయాలు, ఆటపాటలతో ఎంజాయ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూచవల్లాల్ పాఠశాల పూర్వ విద్యార్థులు మందడపు రామకష్టారెడ్డి, జి. నాగమణి, పారుపల్లి సత్యనారాయణ, ఉదారి శ్రీనివాస్, టి. పద్మజ, కె. పద్మ, సుహాసిని, జె. పాపారావు, ఎ. రాధాకష్ణ, అక్బర్ పాష, బి. నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

12 ఏళ్లుగా పరిష్కారంగాని భూసమస్య

- పట్టించుకోని అధికారులు
- ఆత్మహత్యే శరణ్యమంటున్న బాధిత మహిళ

నవతెలంగాణ-ముదిగొండ



12 ఏండ్లుగా భూ సమస్య పరిష్కారంకాక ఓ బాధిత మహిళా రైతు అధికారుల చుట్టూ తిరుగుతోంది. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో సదరు మహిళ తనకు న్యాయం జరగకుంటే ఇక ఆత్మహత్యే శరణ్యమంటోంది. ఈ సంఘటన కమలాపురం రెవిన్యూ అయ్యగారిపల్లెలో చోటుచేసుకుంది. కమలాపురం గ్రామపంచాయతీ పరిధిలో శివారి గ్రామమైన అయ్యగారిపల్లికు చెందిన బొజ్జ సుశీల భర్త చిన్ననారాయణ దంపతులు 20 ఏళ్ల క్రితం కష్టపడి రెండు ఎకరాల భూమిని కొనుక్కొని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. సుశీల భర్త చిన్న నారాయణ అనారోగ్యానికి గురై మృతి చెందారు. సుశీల పొలం సమీపాన గెట్లు (హద్దులు) ఆనుకొని ఉన్న గ్రామానికి చెందిన బొజ్జ గాంధీ, పెద్దబాబు, చింతల చిన్నోడు, చింతల లక్ష్మడు నలుగురు కలిసి మహిళ రైతు సుశీల పొలం ఉన్న నాలుగు దిక్కుల గెట్లను (హద్దులు) 2013లో దున్ని మూడు కుంటల భూమిని ఆక్రమించుకొని పలు ఇబ్బందులు గురిచేస్తున్నారని బాధిత మహిళా రైతు సుశీల తెలిపింది. 2013లో తాసిల్దార్ కార్యాలయంతోపాటు, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగిన భూసమస్య పరిష్కారం నేటి వరకు కాలేదని నవతెలంగాణ దినపత్రిక ముందు ఆదివారం మహిళ రైతు బొజ్జ సుశీల కన్నీరు మున్నీరుగా విలపించింది. సర్వేనెంబర్ 177/11,177/15లో రెండు ఎకరాల 26 కుంటలు వ్యవసాయ భూమి ఉందని, తనకు అండలేరని, ఆ భూమిని నలుగురు కలిసి రాజకీయ నాయకుల అండతో ఆక్రమించుకొని, అధికారులను జోగుతూ భూసమస్యను పరిష్కారం కాకుండా అడ్డుకుంటున్నారని సుశీల ఆవేదన వ్యక్తం చేసింది. 2013 నుండి,2022 వరకు భూసమస్యపై రెవిన్యూ అధికారులను కలిసి డిఐ సర్వే చేయించి అధికారుల సమక్షంలో హద్దులు పెడితే ఆసర్వేని కూడా భూబకాసురులు ఒప్పుకోలేదని సుశీల నివ్వెరిపోయింది. కాగా కోర్టు నుండి 2023లో ఇంజక్షన్ ఆర్డర్ తనకు అనుకూలంగా వచ్చినా అధికారులు పెండింగ్లో ఉన్న భూసమస్యను పరిష్కరించకుండా అన్యాయానికి కొమ్ముగాస్తు నేటి వరకు కాలయాపన చేశారని మహిళా బాధిత రైతు సుశీల ఆక్రందన వెల్లబుచ్చింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి భూసమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోపోతే ఆత్మహత్యే శరణ్యమంటూ ఆవేదన వెలిబుచ్చింది.

వ్యాపారస్తుల ఇష్టారాజ్యం

- ఎమ్మార్పీ ధరలకు మించి అధిక రేట్లకు విక్రయం
- బెంబేలెత్తుతున్న కొనుగోలుదారులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

నవతెలంగాణ-ముదిగొండ



మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న కిరాణా షాపులు (డబ్బా కొట్టులు) ద్వారా సరుకులు గ్రామస్తులకు విక్రయించే దుకాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంట్లోకి అవసరమయ్యే కూరగాయలతో పాటు, నిత్యవసరవస్తువులు, సరుకులు, వ్యాపారస్తులు ఎమ్మార్పీ ధరల కంటే అధిక రేట్లకు విక్రయించి వినియోగదారులను దోపిడీ చేసి సొమ్ముచేసుకుంటున్నారు. అడిగేవారు లేరని సరుకులు కొనుగోలు చేసే వారికి దుకాణదారులు తమకు ఇష్టం వచ్చిన ధరలకు విక్రయం చేయటం, కొనుగోలుదారులు ధరల గురించి అడిగితే ఇంతే అమ్ముతాం మాఇష్టమని కిరాణా షాపుల వ్యాపారస్తులు వినియోగదారులను బెదిరిస్తున్నారు. గ్రామీణ ప్రాంత కిరాణా షాపుల్లో అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంతో దుకాణదారులు రెచ్చిపోయి దురుసుగా ప్రవర్తిస్తున్నారు. అంతా మాఇష్టమేనని కిరాణా షాపుల వ్యాపారులు మూడు గుడ్లు, 33 సరుకులతో విచ్చలవిడిగా వ్యాపారం చేస్తున్నారు. ఏవస్తువైనా ఎమ్మార్పీ రేటు కంటే ఎక్కువ విక్రయించరాదని చట్టం చెబుతుంది. చట్టానికి విరుద్ధంగా నిబంధనలను మరిచి కిరాణా షాపుల వ్యాపారస్తులు వస్తువులను ఇష్టం వచ్చిన ధరలకు విక్రయించి పల్లె ప్రజలను పరేషాన్ చేస్తూ బెంబేలెత్తిస్తున్నారు. కిరాణా షాపుల్లో కోడిగుడ్డు ధర 5 నుంచి ఆరు రూపాయలకి విక్రయించాలి. ఎనిమిది రూపాయలకు కోడిగుడ్డు విక్రయించి వినియోగదారుల జేబుకు చిల్లు పెడుతున్నారు. రేట్లు బాగా పెరిగాయని వ్యాపారస్తులు బుకాయిస్తున్నారు. పగలంతా కూలికి వెళ్లి కాయకష్టం చేసి సాయంత్రం ఇల్లు చేరుకొని, సరుకుల కోసం కిరాణా షాప్ దగ్గరికి వెళితే వస్తువుల రేట్లు చెప్పి వ్యాపారస్తులు చుక్కలు చూపిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. చిన్న గ్రామమైతే మూడు నుండి 5 కిరాణా షాపులు ఉన్నాయి. పెద్ద గ్రామమైతే ఐదు నుండి 10 కిరాణా షాపులు ఉన్నాయి. వీటికి తోడు కిరాణా షాపుల్లోనే మద్యం విక్రయిస్తూ మరింత దగా చేస్తున్నారు. మండలంలో ప్రధానంగా చిరుమర్రి, పమ్మి అమ్మపేట, వనంవారికిష్టాపురం, వల్లాపురం కమలాపురం, బాణాపురం, మల్లన్నపాలెం, మాదాపురం, యడవల్లి తదితర గ్రామాల్లో కిరాణా షాపుల నిర్వాహకుల వ్యాపారం ఇష్టారాజ్యమైంది. కిరాణా షాపుల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో ప్రజలకు అవసరమయ్యే నిత్యవసర సరుకులు బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నారు. ఇప్పటికైనా గ్రామాలలో నిత్యవసర సరుకులు విక్రయించే కిరాణా షాపులను సంబంధిత శాఖ అధికారులు సందర్శించి తనిఖీలు చేసి సరుకులను అధిక రేట్లు విక్రయించే షాపులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



చోరీ కి గురైన ట్రాక్టర్ రికవరీ

నవతెలంగాణ-అశ్వారావుపేట

చోరీకి గురైన ట్రాక్టర్‌ను 24 గంటలు లోపే స్థానిక పోలీస్‌లు రికవరీ చేశారు. బాధితుడు ట్రాక్టర్ యజమాని అశ్వారావుపేట వడ్డెర బజారుకు చెందిన వెంకన్న బాబు తన స్వరాజ్ 735 ఎఫ్ఈ నెంబర్ గల ట్రాక్టర్ ఇంజిన్ చోరీకి గురి అయిందని శనివారం సాయంత్రం ఎస్ఐ శివరామ్ క్రిష్ణకు పిర్యాదు చేసాడు. ఎస్ఐ తన సిబ్బందితో ఆదివారం ఉదయం తెలంగాణ - ఆంధ్ర సరిహద్దు ఆర్‌టీఏ చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అశ్వారావుపేటకు చెందిన నాగు అనే వ్యక్తి ట్రాక్టర్‌తో దొరికిపోయాడు.వంచనామా అనంతరం నాగును కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ శివరామ్ క్రిష్ణ తెలిపారు.

సెక్యూరిటీగార్డ్ అనుమానాస్పద మృతి

- బూచినెల్లి గడ్డపై ఉన్న మంగ్ల ట్యూబ్ పరిశ్రమలో ఘటన

నవతెలంగాణ-జహీరాబాద్

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని బూచినెల్లి గడ్డపై ఉన్న ఇండస్ట్రియల్ పార్కులోని 'మంగ్ల ట్యూబ్' పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీగార్డ్ ఆదివారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. దాంతో మృతుని కుటుంబ సభ్యులు పరిశ్రమ వద్ద ఆందోళనకు దిగారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన శివకుమార్ (62) కొన్నేండ్లుగా గ్లోబల్ సెక్యూరిటీ సర్వీసెస్‌లో సెక్యూరిటీగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ఆదివారం సెక్యూరిటీ గార్డ్‌గా మంగ్ల పరిశ్రమలో విధులకు వెళ్లిన శివ కుమార్.. అనుమానాస్పదంగా మృతి చెందాడు. అయితే హార్ట్‌ఎటాక్ రావడంతో మృతి చెందినట్టు పరిశ్రమ యాజమాన్యం చెబుతోంది. ఈ విషయమై మృతుని బంధువులు, స్నేహితులు ఆందోళనకు దిగారు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారని, వారి కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై స్థానికులు పరిశ్రమ యజమాన్యంతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. కాగా ఇంతవరకు తమకు ఎలాంటి రాతపూర్వక ఫిర్యాదు అందలేదని చిరాకుపల్లి పోలీసులు చెబుతున్నారు. ఫిర్యాదు అందితే దర్యాప్తు చేస్తామని తెలిపారు. కార్మికులతో పరిశ్రమ యాజమాన్యం 24 గంటల పాటు విధులు నిర్వహించుకుంటున్నా.. వారికి కనీసం ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా కల్పించట్లేదని మాజీ కౌన్సిలర్ రాములు నేత ఆరోపించారు. దాంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.



ఆత్మహత్య చేసుకున్న అశ్వారావుపేట ఎస్ఐ కుటుంబానికి

రూ.25లక్షల ఆర్థిక సాయం

నవతెలంగాణ-నల్లబెల్లి

అధికారుల వేధింపులతో మనస్థాపం చెంది ఇటీవల ఆత్మహత్య చేసుకున్న అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి 2014 ఎస్ఐ బ్యాచ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వెల్ఫేర్ సొసైటీ పేరుతో రూ.25లక్షలు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. శ్రీనివాస్ స్వగ్రామమైన హన్మకొండ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేట గ్రామానికి వెళ్లి.. ఆయన కుటుంబసభ్యులను కలిసిన సొసైటీ సభ్యులు.. శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.

హాస్టల్‌లో పిల్లల్ని చూసేందుకు వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
- మరో ఇద్దరికి గాయాలు



మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

నవతెలంగాణ - మాక్లూర్

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని దాస్ నగర్ సమీపంలో ఉన్న జ్యోతిబా పూలే హాస్టల్ వద్ద అతి వేగంగా వచ్చిన కారు.. నడుచుకుంటూ వెళుతున్న వారిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికీ తీవ్ర గాయాలయిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సీఐ సతీష్ వెల్లడించిన వివరాల ప్రకారం.. దాస్‌నగర్ సమీపంలోని జ్యోతిభా పూలే హాస్టల్ విద్యార్థినిలను కలవడానికి ప్రతినెలా రెండవ ఆదివారం తల్లి దండ్రులు వస్తుంటారు. వారి పిల్లలకు ఇంటి నుంచి తెచ్చిన భోజనాన్ని తినిపించి కొద్ది సేపు పిల్లలతో గడిపి వెళుతుంటారు.

ఈ నేపథ్యంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని హారికను కలిసేందుకు.. ఇందాల్‌వాయి మండలం సిర్నపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి తల్లి నీలా, అమ్మమ్మ కొత్తూరు పోషమ్మ (60) వచ్చారు. వీరు హారికతో కొంత సమయం గడిపి ఇంటి నుంచి తెచ్చిన భోజనం తినిపించి తిరుగు ప్రయాణమయ్యారు. అలాగే, 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఈశ్వరిని కలిసేందుకు బోధన్ మండలం చిన్న మావంది గ్రామానికి చెందిన విద్యార్థి తల్లి పద్మ (35) వచ్చారు. ఈ క్రమంలో వీరు తిరిగి వెళుతూ.. హాస్టల్ బయట నడుస్తుండగా.. వీరి వెనక నుంచి అతి వేగంగా వచ్చిన కారు వారిని ఢీ కొట్టడంతో పద్మ, పోషమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. విద్యార్థి ఈశ్వరికి తీవ్ర గాయాలవడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడినుంచి ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. హారిక తల్లి నీలాకు స్వల్పగాయాలవగా, ఆమె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది.


మృతులను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో సీఐతో పాటు నవీపేట్ ఎస్ఐ యాదగిరి గౌడ్, రూరల్ ఎస్ఐ మహేష్, స్థానిక ఎస్ఐ సుదీర్ రావు ఉన్నారు.

జమ్మూకాశ్మీర్‌కు బీజేపీ ద్రోహం

- ఎల్జీకి అధికారాలను తప్పుబట్టిన కాంగ్రెస్
- మోడీ సర్కారు నిర్ణయాన్ని 'సంవిధాన్ హత్యా దివస్'గా అభివర్ణించిన హస్తం పార్టీ



న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ)కు కేంద్రం మరిన్ని అధికారాలను కట్టబెట్టటంపై లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం తీసుకున్న మోడీ సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సెప్టెంబరు 30లోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ.. అలా చేయకుండా కేంద్రపాలిత ప్రాంతం(యూటీ) జమ్మూకాశ్మీర్‌కు బీజేపీ ద్రోహం చేస్తున్నదని ఆరోపించింది. జమ్మూకాశ్మీర్ ఎల్జీకి మరిన్ని అధికారాలను అప్పగించాలనే మోడీ ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ 'సంవిధాన్ హత్యా దివస్'గా అభివర్ణించింది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. "మార్పులు రెండు అర్థాలను సూచిస్తున్నాయి. మోడీ ప్రభుత్వం జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణను ఆలస్యం చేయాలనుకుంటున్నది. లేదా రాష్ట్ర హోదా పునరుద్ధరించబడినప్పటికీ.. కొత్తగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాన్ని అణచివేయటం ద్వారా ఎల్జీ దయలో ఉంచాలనుకుంటుంది" అని అన్నారు.



అద్దె భవనాల్లోనే..

అరకొర వసతుల్లోనే జ్యోతిబాపూలే పాఠశాలలు

- కోళ్లఫారాలు, స్టేడియంలు, ప్రయివేటు భవనాల్లోనే నిర్వహణ
- మౌలిక వసతుల్లేక విద్యార్థుల అవస్థలు
- ఐదేండ్ల నాటి మెనూయే ఇప్పటికీ అమలు
- ప్రభుత్వం దృష్టి సారించాలి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత.. విద్యకు ప్రాధాన్యత ఇస్తామన్న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఎస్సీ, ఎస్టీల గురుకులాలతోపాటు వెనుకబడిన తరగతుల వారి పిల్లల కోసం మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలను ఏర్పాటు చేసింది. వీటి ఏర్పాటుపై ప్రారంభంలోనే సరైన ప్రణాళిక లేకపోవడంతో అన్నీ సమస్యలే నెలకొన్నాయి. నిర్వహణ లేదు.. పక్కా భవనాలు నిర్మించలేదు. ప్రయివేటు భవనాలు, కోళ్లఫారాల్లో పాఠశాలలను కొనసాగిస్తున్నారు. మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. మెనూ సమస్యలు వెంటాడుతున్నాయి. భోజనం దగ్గర నుంచి.. చదువు, మౌలిక సదుపాయాలు ప్రతిదీ సమస్యగానే ఉన్నాయి. బీజీ గురుకులాలపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. సమస్యలున్నా.. పేదరికం మూలాన తమ పిల్లలను ప్రభుత్వ గురుకులాల్లోనే తల్లిదండ్రులు చదివిస్తున్నారు.





నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా 350 మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 280 పాఠశాలలు ప్రయివేటు భవనాల్లోనే కొనసాగుతున్నాయి. మిగతావి కూడా ఇతర ప్రభుత్వ రంగాల కోసం ఏర్పాటు చేసిన భవనాల్లో తాత్కాలికంగా నడిపిస్తున్నారు. వీటిలో లక్షా 68 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒక్కో పాఠశాలలో 16 మంది ఉపాధ్యాయుల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 5600 మంది ఉన్నారు. బోధనేతర సిబ్బంది 2100 మంది పనిచేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 28 పాఠశాలలున్నాయి. రెండే పాఠశాలలకు పక్కా భవనాలు ఉన్నాయి.. మిగతావి అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ప్రయివేటు భవనాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

ఐదేండ్ల కిందటి మెనూ..

ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ఐదేండ్ల కిందట నిర్ణయించిన మెనూనే ఇప్పటికీ అమలవుతోంది. ఈ ఐదేండ్లలో నిత్యావసరాల సరుకుల ధరలు రెండు మూడింతలు పెరిగాయి. అయినా ప్రభుత్వం మెనూ పెంచడం లేదు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కూడా దృష్టిసారించలేదని తెలుస్తోంది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు ఒక విద్యార్థికి మూడో తరగతి నుంచి ఏడో తరగతి వరకు రూ.950 మాత్రమే మెనూను ప్రభుత్వం ఇస్తోంది. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు నెలకు రూ.1100 ఇస్తోంది. ఇందులోనే రైస్‌తో పాటు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి డిన్నర్, స్నాక్స్ ఇవ్వాల్సి ఉంది. నెలలో రెండ్రోజులు రోజుకు 50 గ్రాముల చొప్పున మటన్, నాలుగు రోజులు 100 గ్రాముల చొప్పున చికెన్ పెడతారు. కాస్మోటిక్ చార్జీల కింద విద్యార్థికి నెలకు రూ.113 ఇస్తున్నారు. సబ్బులు, కొబ్బరినూనె తదితర ఖర్చులకు ఏమాత్రం సరిపోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇరుకు గదుల్లో చదువు

నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలో బీసీ విద్యార్థుల కోసం మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలను ప్రయివేటు వ్యక్తికి చెందిన కోళ్లఫారంలో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలను 'నవతెలంగాణ' పరిశీలించింది. ఇక్కడ 480 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికోసం 24 మరుగుదొడ్లు ఉన్నాయి. అవి అందరికీ సరిపోక.. బహిర్భూమి కోసం ఆరుబయటకు వెళ్తున్నారు. వర్షం, గాలి వచ్చినప్పుడు విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కిటికీలు, తలుపులు సైతం అంతంత మాత్రమే ఉన్నాయి. ఇదే పరిస్థితి జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు మహాత్మాజ్యోతిబా పూలే బాలికల పాఠశాలలోనూ ఉంది. ఇక్కడ ఐదు నుంచి 10 తరగతులకు 480 మంది ఉన్నారు. ఇక్కడ కూడా ప్రయివేటు భవనం కావడం చేత టాయిలెట్లు, స్నానపు గదుల సమస్య తీవ్రంగా ఉంది. పెబ్బేరు మండల కేంద్రంలోని బీసీ గురుకులంలో 188 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇరుకు గదులతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రహరీ గోడలు లేక.. బిక్కుబిక్కుమంటున్నారు.

పక్కా భవనాలు నిర్మించాలి

జ్యోతిబా పూలే పాఠశాలలకు పక్కా భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలలు కోళ్లఫారాలు, స్టేడియాల్లో నడిపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి జ్యోతిబా పూలే పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలి. పెరిగిన ధరలకు అనుకూలంగా మెనూకు బడ్జెట్ పెంచాలి.

ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మహబూబ్‌నగర్

ఇక్కడ మౌలిక వసతులు బాగున్నాయి..

మౌలిక వసతులు బాగానే ఉన్నాయి. టాయిలెట్లు, నీటి సమస్యలు ఏమీ లేవు. పక్కా భవనం నిర్మిస్తే ఇంకా మెరుగ్గా ఉంటుంది. బీసీల కోసం ఏర్పాటు చేసిన జ్యోతిబా పాఠశాలల్లో విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుతున్నాం.

ప్రశాంతి, ప్రిన్సిపాల్, జ్యోతిబా పూలే వెనకబడిన పాఠశాల, తెలకపల్లి

గ్రామీణ పేదలందరినీ

ఒకే గొడుగు కిందకు చేరాలి

- వ్యకాస జాతీయ అధ్యక్షుడు ఏ.విజయ రాఘవన్ పిలుపు
- వ్యవసాయ, వ్యవసాయేతర కార్మికులనూ సమీకరించాలి : ఏఐఏడబ్ల్యూయూ జాతీయ కౌన్సిల్ తీర్మానం



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలందరినీ ఒక గొడుగు కిందకు తీసుకువస్తేనే కార్పొరేట్, కమ్యూనల్ శక్తులను అడ్డుకోగలమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు ఎ. విజయ రాఘవన్ అన్నారు. తమిళనాడులోని తిరుచిరాపల్లిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల ప్రారంభ సభలో అధ్యక్షుడు ఎ. విజయ రాఘవన్ జెండావిష్కరణ చేశారు. అనంతరం సభలో మాట్లాడుతూ కార్పొరేట్ శక్తుల ప్రభావంతో వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు గ్రామీణ పేదల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని అన్నారు. పంటల సీజన్‌లో వ్యవసాయ కూలీలుగా, ఆ పనులు లేని కాలంలో వ్యవసాయేతర పనులు చేస్తున్న గ్రామీణ పేదలు మౌలికావసరాలు తీరక దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులను దోచి సంపన్నులకు దేశ సంపదను కట్టబెట్టే విధానాలను పాలకులు అనుసరిస్తున్నారన్నారు. ఫలితంగా హంగర్ ఇండెక్స్‌లో భారత్ 116వ స్థానానికి చేరిందన్నారు. 74 శాతం ప్రజలకు పౌష్టికాహారం అందట్లేదని తెలిపారు. పోషక విలువలు అందక మహిళలు, చిన్నారులు తీవ్రంగా అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనాలు పెరగటం లేదని, పెరుగుతున్న జీవన వ్యయంతో కుటుంబావసరాలు తీర్చుకోలేని స్థితిలో గ్రామీణ పేదల జీవితం దారుణంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిధులు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. వంద రోజులు కల్పించాల్సిన పనిదినాలను సగటున 46 రోజులు కూడా కల్పించడం లేదని తెలిపారు. ఇది ఉపాధి పేదలకు తీవ్రమైన సమస్యగా మారిందన్నారు. పాలకులు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద రైతులు, వ్యవసాయ కూలీలతో పాటు, గ్రామీణ పేదలందర్నీ ఒక గొడుగు కిందకు సమీకరించాలన్నారు.

వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానాలు క్రమంగా పుంజుకుంటున్నాయన్నారు. మూడు దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక విధానాలను ఎన్డీఏ ప్రభుత్వం గత పదేండ్లుగా వేగవంతంగా అమలు చేస్తున్నదని తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించి తెచ్చిన మూడు నల్ల చట్టాల అమలును ప్రజా పోరాటాలతో తాత్కాలికంగా వెనక్కి కొట్టగాలిగామన్నారు. బీజేపీ అనుసరిస్తున్న కార్పొరేట్ కమ్యూనల్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ప్రతిఘటనలోకి వస్తున్నారన్నారు. మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఈ విధానాలను అనుసరిస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. బీజేపీ హిందుత్వ ఎజెండాతో ఉత్తరాది రాష్ట్రాల్లో సృష్టిస్తున్న అరాచకాన్ని సహించేది లేదనే విషయాన్ని ఆయా రాష్ట్రాల ప్రజలు నిరూపించారన్నారు. బీజేపీ బలాన్ని కూడా ఎన్నికల్లో ప్రజలు తగ్గించారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం ఇప్పటివరకు ప్రధానంగా వ్యవసాయ కూలీలను సమీకరిస్తున్నదని, ముందు గ్రామీణ పేదలందరినీ ఐక్యం చేసే ఉద్యమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశాల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ కార్యక్రమాల సమీక్ష, భవిష్యత్తు కర్తవ్యాలను ప్రవేశపెట్టారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన ప్రతినిధులు ఆ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఏఐఏడబ్ల్యూయూ ఉపాధ్యక్షులు గోవిందన్ మాస్టర్, సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి నాగయ్య, పి. వెంకట్రాములు, నారి అయిలమ్మ పద్మ, జగన్, మచ్చ వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హామీలు

అమలు చేయట్లే..

- కార్మికులను మోసగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ-మహబూబాబాద్

కార్మికులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీలను అమలు చేయకపోగా కార్మికులకు నష్టం వాటిల్లే చర్యలు చేపట్టి కార్మికులను మోసగిస్తుందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విమర్శించారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జగన్నాథం భవనంలో జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు అధ్యక్షతన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలతో పాటు ఉద్యోగులకు, కార్మికులకు.. కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా కార్మికుల సమస్యల పరిష్కారం గురించి ఊసే లేదన్నారు. ముఖ్యమంత్రి.. పారిశ్రామిక వేత్తలు, ఐటీ అధిపతులు, ఫార్మా యాజమాన్యాలతో పాటు మధ్యతరగతి పరిశ్రమల యాజమాన్యాలు, పెద్ద పెద్ద కాంట్రాక్టర్లతో అనేకమార్లు చర్చలు జరిపారని, కానీ ఒక్కసారి కూడా కార్మిక సంఘాలతో చర్చించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా కార్మిక సంఘాలకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గిందని, 73 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు పైసా పెంచకుండా నూతన జీవోలను జారీచేసి కార్మికుల్ని మోసం చేసిందని తెలిపారు. అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆశ వర్కర్లకు మరల పరీక్ష పెట్టే విధానాన్ని అమలు చేస్తుందని, అంగన్‌వాడీలకు నష్టం చేసే విధంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ తగ్గించి జీవో 10ని జారీ చేసిందని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు ఎనిమిది నెలలుగా వేతనాలు లేక అవస్థలు పడుతున్నా చోద్యం చూస్తుందని విమర్శించారు. ఐకేపీ వీవోఏలు, మధ్యాహ్న భోజన, మున్సిపల్, అసంఘటిత రంగ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్మికుల డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, జిల్లా ఆఫీస్ బేరర్స్ సమ్మెట రాజమౌళి, కందునూరి శ్రీనివాస్, దుండి వీరన్న, కుమ్మరికుంట్ల నాగన్న, పోతుగంటి మల్లయ్య, చింతా మౌనిక, తాడబోయిన శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాలు గర్వకారణం

- నా గుండె సిద్దిపేట, సిద్దిపేట అని కొట్టుకుంటుంది
- భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానం సాధించాలి : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవ తెలంగాణ-సిద్దిపేట

మిమ్మల్ని కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల రుణం తీర్చుకునే అవకాశం ఇదని, పదవ తరగతి ఫలితాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించిన 75 మంది విద్యార్థులకు స్వంత ఖర్చుతో ఒక్కొక్కరికి రూ10 వేల విలువైన ఐ ప్యాడ్స్‌ను హరీశ్ రావు ఉచితంగా అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట పదవ తరగతి ఫలితాల్లో వరుసగా ఐదు సార్లు అగ్రగామిగా నిలిచిందని, సిద్దిపేట పేరును నిలబెట్టిన మీకు అభినందనలని అన్నారు. ఒక ఎమ్మెల్యేగా తనకు గర్వంగా ఉందని, సిద్దిపేట పేరు చరిత్ర పుటల్లో నిలిపారని, ఉత్తమ ఫలితాలు పొందినప్పుడు కలిగే అనుభూతి గొప్పదన్నారు. పదవ తరగతి ఫలితాలు వచ్చిన సమయంలో తాను అమెరికాలో ఉన్నానని, పిల్లల తల్లిదండ్రులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి అభినందనలు తెలిపానని తెలిపారు. ఎక్కడ ఉన్నా నా గుండె ఎప్పుడూ సిద్దిపేట కోసమే తపన పడుతుందని, అందరికి గుండె లయ లబ్ డబ్ కొట్టుకుంటుందని, అది తనకు మాత్రం సిద్దిపేట, సిద్దిపేట అని వినిపిస్తుందని అన్నారు. మంచి ర్యాంక్ వస్తే ఇంటి పెద్ద, తండ్రి ఎలా సంతోషంగా ఉంటాడో అలాగే తనకు సంతోషంగా ఉందన్నారు. అన్ని రకాలుగా విద్యార్థుల ఫలితాల కోసం తపన పడ్డానని, స్వంత ఖర్చుతో టిఫిన్, డిజిటల్ పుస్తకాలు ఇచ్చానని, పోయిన ఏడాది కంటే మన జిల్లా ఈసారి ఎక్కువ ఉత్తీర్ణత సాధించిందన్నారు. సిద్దిపేట నియోజకవర్గం రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్‌లో ఉందని, బాసరలో అత్యధికంగా సీట్లు వచ్చాయని, మీ ఫలితాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు రోజా శర్మ, ఫారూఖ్ హుస్సేన్, రాజనర్సు, రెడ్డి ప్రభాకర్ రెడ్డి, గుండు భూపేష్ తదితరులు పాల్గొన్నారు.



సెమాగ్లుటైడ్‌తో

దృష్టిని కోల్పోయే ప్రమాదం

- బోస్టన్ పరిశోధకుల అధ్యయనం

న్యూఢిల్లీ : బోస్టన్ పరిశోధకులు నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం ప్రముఖ యాంటీ డయాబెటిక్ డ్రగ్ సెమాగ్లుటైడ్ దృష్టిని కోల్పోయే ప్రమాదంతో ముడిపడి ఉండే అవకాశమున్నది. 2024లో సెమాగ్లుటైడ్ మార్కెట్ పరిమాణం 27.55 బిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. ఇది 2029 నాటికి 50.34 బిలియన్ డాలర్లకు చేరుతుందనీ, ఇది 12.8 శాతం సమ్మేళన వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) వద్ద పెరుగుతుందని అంచనా. డానిష్ డ్రగ్ మేజర్ నోవో నార్డిస్క్ ద్వారా ఈ ఔషధాన్ని వెగోవి, రైబెల్సస్, ఓజెంపిక్ బ్రాండ్ పేర్లతో విక్రయిస్తున్నారు. 'రిస్క్ ఆఫ్ నానార్టెరిటిక్ యాంటీరియర్ ఇస్కీమిక్ ఆప్టిక్ న్యూరోపతి ఇన్ పేషెంట్స్ ప్రిస్క్రైబ్డ్ సెమాగ్లుటైడ్' అనే పేరుతో ఈ అధ్యయనం మెడికల్ జర్నల్ 'జామా' ఆప్తాల్మాలజీలో ప్రచురించబడింది.

గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రియాజ్‌కు

టీజీజేఎల్ఏ 475 అభినందనలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రియాజ్‌కు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 సంఘం అభినందనలు తెలిపింది. ఆదివారం ఈ మేరకు రియాజ్‌కు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, డాక్టర్ వసుకుల శ్రీనివాస్, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, నాయకులు పి.జగన్నాథం, సంగీత, విశాలాక్ష్మి, రజిత, లావణ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సురేశ్, శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యావేత్త, పోటీపరీక్షల నిపుణుడు, అభ్యుదయ వాది గ్రంథాలయ చైర్మెన్‌గా నియమితులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో తమకు హామీ ఇచ్చిన విధంగా రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలలకు ఉచితంగా దినపత్రికలు, పోటీపరీక్షల మ్యాగజైన్లు వేయించాలని కోరారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే బీద విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

వ్యాయామానికి సమయం కేటాయిద్దాం...

ప్రస్తుత రోజుల్లో అత్యధిక శాతం కుర్చీలకు అంటి పెట్టుకునే ఉద్యోగాలే. సాఫ్ట్‌వేర్, ఇతర వర్క్ ఫ్రం హెూం ఉద్యోగాలు కావడం.. పైగా మహిళలకు శారీరక శ్రమ లేకపోవడం, సరైన సమయానికి ఆహారం అందకపోవడంతో వయసుతో సంబంధం లేకుండా చాలా వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ముఖ్యంగా యుక్తవయసు వారికి అధిక బరువుతో అనేక సమస్యలు వస్తున్నాయి. వ్యాయామం లేక ఆరోగ్యలపై చూపిస్తున్న నిర్లక్ష్యం కారణంగా ఆసుపత్రుల చుట్టూ తిరగక తప్పడంలేదు. రోజూ వ్యాయామం చేయడం ద్వారా బరువు తగ్గి చాలా వ్యాధులకు దూరంగా వుండొచ్చంటున్నారు నిపుణులు.

యుక్త వయసు నుంచి వృద్ధుల వరకు అందరూ రోజూ ఏదో ఒక సమయంలో వీలు కల్పించుకుని అరగంట నుంచి గంట వరకూ వ్యాయామం చేయాలంటున్నారు. అంటే ఒంటికి చెమట పట్టేలా... శ్రమిస్తే ఏ వ్యాధులు దరిచేరవు అంటున్నారు.

మహిళలు వ్యాయామం చేయకపోవడం, జీవనశైలిలో చాలా మార్పుల నేపథ్యంలో బరువుతో పాటు వారికి పొట్ట కూడా పెరుగుతుంది. అలాంటప్పుడు కొవ్వు పదార్థాలు తగ్గించడమే కాదు.. కొన్ని పోషక పదార్థాలను కూడా రోజూ తీసుకోవాలంటున్నారు నిపుణులు.



క్లైమేట్ రియాలిటీ లీడర్

గాయత్రి కుప్పేంద్ర రెడ్డి... డీప్‌టెక్ క్లైమేట్, సస్టైనబిలిటీ స్టార్టప్‌లను శక్తివంతం చేస్తున్నారు. ఉపాధిని వెదుకుతూ నగరానికి తరలి వస్తున్న జనంతో కాంక్రీట్ జంగిళ్లుగా మారిపోతున్న నగరాల్లో పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నారు. దీని కోసమే ఆమె ప్రత్యేకంగా ఓ వెంచర్ స్టూడియో ప్రారంభించారు. క్లైమేట్ రియాలిటీ లీడర్‌గా ఎదుగుతున్నారు. తన స్టూడియో ఆధ్వర్యంలో వాతావరణ సమస్యల పరిష్కారం కోసం వినూత్న పద్ధతులను అన్వేషిస్తూ సాగుతున్న ఆమె ప్రయాణం నేటి మానవిలో...

బెంగళూరుకు చెందిన గాయత్రి తన కుటుంబం నుండి వాతావరణ అవసరాలను గుర్తించే సామర్థ్యాన్ని నేర్చుకుంది. తన కంపెనీని స్థాపించడానికి తొమ్మిదేండ్ల ముందు నౌ వెంచర్ స్టూడియోస్ (నో అదర్ వరల్డ్)-డీప్‌టెక్, డీప్-సైన్స్ వెంచర్ స్టూడియో గురించి అవగాహన పెంచుకుంది. గాయత్రి తండ్రి, డి కుప్పేంద్ర రెడ్డి. ఆయన కర్నాటక హైకోర్టులో పునరుద్ధరణను డిమాండ్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. బెంగళూరులోని



బెల్లందూర్, అగరా, వర్తుర్ సరస్సులను పునరుద్ధరించడం ఆయన లక్ష్యం. ఈ సరస్సులను విజయవంతంగా పునరుద్ధరించడంతో పాటు ఆమె కుటుంబ వ్యాపారం, ఆర్‌జే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్, లీడర్‌షిప్ ఇన్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ డిజైన్ (LEED)-సర్టిఫైడ్ ప్రాజెక్టలలో పెద్ద ఎంఎన్‌సీల కోసం పనిచేసింది.

అకడమిక్ కోణం నుండి

యూకేలోని యూనివర్శిటీ ఆఫ్ బాత్ నుండి అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీస్‌లో మాస్టర్స్ పూర్తి చేసిన తర్వాత ఆమె కుటుంబ వ్యాపారం చూసుకునేందుకు దేశానికి తిరిగి వచ్చింది. 'మాస్టర్స్‌లో రిస్క్, ఛేంజ్ మేనేజ్‌మెంట్‌లో నాకు అవగాహన ఉంది. కాబట్టి నేను అకడమిక్ కోణం నుండి వాతావరణ మార్పులను అంచనా వేయడానికి, అర్థం చేసుకోవడానికి మార్గాలను అధ్యయనం చేశాను. నా కుటుంబ వ్యాపారంలో పని చేయడం నా మొదటి ఉద్యోగం. ఈ రంగంలో ప్రొఫెషనల్‌గా ఉండేందుకు ఇదే నాకు పునాదిగా నిలిచింది.

మార్గాన్ని కనుగొనడం

కుటుంబ వ్యాపారంలో పని ప్రారంభించిన కొన్నేండ్ల తర్వాత గాయత్రి సొంతంగా శాఖను ప్రారంభించాలని నిర్ణయించుకుంది. ఒక కేఫ్‌ను ప్రారంభించింది edtech, విద్యార్థి వసతి మొదలైన రంగాలలో పెట్టుబడులు పెట్టింది. 'వ్యాపారంతో పాటు నేను పర్యావరణ సమస్యలను పరిష్కరించాలనుకునే వ్యవస్థాపకులను కలుస్తున్నాను, వారి మద్దతు నాకు అవసరం. చాలా సార్లు వారి ఆలోచనలపై నేను దృష్టి పెట్టలేదు. కానీ రియల్ ఎస్టేట్ పర్యావరణ వ్యవస్థలో వారితో, వారి ఆలోచనలతో ఎన్నో ప్రయోజనాలుంటాయి. అలాంటి మార్గదర్శకులు, వ్యక్తులను కలుసుకుని వారి సహాయం తీసుకోవడం ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు' ఆమె చెప్పింది.

అంతరాలను తగ్గించడం

గాయత్రి ఎంతో ఆసక్తితో నౌ వెంచర్ స్టూడియో కోసం బ్లూప్రింట్‌ను అభివృద్ధి చేసింది. బిల్ట్ ఎన్విరాన్‌మెంట్, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, సిమెంట్, స్టీల్ వంటి సెక్టార్‌ల డీకార్బనైజేషన్‌ను దాని ఫోకస్ ఏరియాలుగా మార్చింది. ఇప్పుడు వెంచర్ స్టూడియో డీప్‌టెక్ స్థిరత్వం, క్లైమేట్ వెంచర్‌లను అభివృద్ధి చేయడం, వెంచర్-బిల్డింగ్ ప్రక్రియలో నష్టాలను తగ్గించడం, మార్కెట్‌కి వారి మార్గాన్ని వేగవంతం చేయడంలో సహకరిస్తుంది. ఇది వ్యాపార అవకాశాలు, కాన్సెప్ట్ ధ్రువీకరణ, ఎంవీపీ బిల్డింగ్, కస్టమర్‌ను గుర్తించడం, ఔత్సాహికులు, పరిశోధకులు, విద్యార్థులు, పరిశ్రమ నిపుణుల కోసం మొదటి సంస్థాగత నిధులను సేకరించడంలో సహాయపడుతుంది.



ఫౌండేషన్ ద్వారా...

2019లో గాయత్రి KReate అనే ఫౌండేషన్‌ను ప్రారంభించింది. ఇది బెంగళూరులో పట్టణ ప్రణాళిక, నీటి నిర్వహణపై కొంతమందితో కలిసి పనిచేస్తుంది. వాటర్ యాక్టివిస్ట్, అర్బన్ ప్లానర్ విశ్వనాథ్ శ్రీకాంతయ్య బెంగళూరులో 'డిగ్గింగ్ ఎ మిలియన్ వెల్స్'తో ఫౌండేషన్ భాగస్వామిగా ఉంది. 'మేము సరస్సుల చుట్టూ ఈవెంట్‌లను ప్లాన్ చేసాం. నగరాల్లో వర్షపు నీటి సేకరణ ప్రాముఖ్యతను చర్చించి పాఠశాలలతో కలిసి పని చేస్తున్నాం' ఆమె అంటుంది. 2023లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో వారి తరం ఎదుర్కొంటున్న సమస్యలపై గళం విప్పిన దావోస్50 యువ నాయకురాళ్లలో ఒకరిగా గాయత్రి ఎంపికయ్యింది. 'నేను శిక్షణ పొందిన క్లైమేట్ రియాలిటీ లీడర్‌గా మారాను. దీని ద్వారా వాతావరణ మార్పుల ప్రమాదాల గురించి శాస్త్రీయ అవగాహనను పెంచుకున్నాను. మన భవిష్యత్ తరాలకు వైవిధ్యం కలిగించే విధంగా వాటిని సమగ్రంగా ఎలా చేరుకోవాలి' అని గాయత్రి చెబుతుంది. క్లైమేట్ రియాలిటీ లీడర్‌లకు నోబెల్ గ్రహీత, యునైటెడ్ స్టేట్స్ మాజీ వైస్ ప్రెసిడెంట్ అల్ గోర్ తన సంస్థ అయిన ది క్లైమేట్ రియాలిటీ ప్రాజెక్ట్ కింద శిక్షణనిస్తారు.

వినూత్న పరిష్కారాలు

'సమగ్ర పరిష్కారాలను అభివృద్ధి చేయడం, విస్తరించడం మాకు చాలా కీలకం. ప్రతి స్థాయిలో వాతావరణ సవాళ్లను సమగ్రంగా పరిష్కరించకపోతే, అది ఇప్పటికే ఉన్న సమస్యను మరింత పెంచుతుందని మేము గట్టిగా నమ్ముతున్నాం. పనితో పాటు మంచి అవకాశాల కోసం ప్రజలు నిరంతరం నగరాలకు వస్తుంటారు. ఉండేందుకు వసతి కోసం భవనాలు, వెళ్లేందుకు ప్రయాణ రీతులు అభివృద్ధి చెందడం వల్ల పట్టణ వాతావరణం కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతుంది. ఈ నష్టాన్ని తగ్గించేందుకు అధునాతన పదార్థాలు, భవనాలు, పచ్చని ప్రదేశాలను సృష్టించేందుకు వినూత్న పరిష్కారాలను మేము పరిశీలిస్తాం' అని ఆమె వివరిస్తుంది.

పరిశోధనలకు మించి

తగినంత డబ్బు అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని సమయాల్లో మంచి ఆలోచనలు తట్టవు. అటువంటి సమస్యలు రాకుండా గాయత్రి తగు జాగ్రత్తలు తీసుకుంటుంది. దీని గురించి ఆమె మాట్లాడుతూ 'ఐఐటీ మద్రాస్ నుండి ఒక టెక్ గ్రాడ్యుయేట్, మార్కెటింగ్, వ్యాపారాన్ని నిర్వహించడానికి వారి పరిశోధనలకు మించి వెళ్ళవలసి ఉంటుంది. వారి స్టార్టప్ కోసం రిజిస్ట్రేషన్, నియామకం వంటివి అవసరం. మేము దీని కోసం ఫండింగ్, అనుకూలీకరించిన భాగస్వామ్య సేవలను అందజేస్తాం' అంటుంది. జనవరి 2024లో ప్రారంభించినప్పటి నుండి నౌ వెంచర్ స్టూడియోకి 1,500 అప్లికేషన్‌లు, 130మందికి పైగా పెట్టుబడి భాగస్వాములు ఉన్నారు.

స్టూడియోలో స్త్రీల పాత్ర

గాయత్రి ఇటీవలే ఉమెన్ క్లైమేట్ ఇనిషియేటివ్‌లో భాగంగా ఎంపిక చేయబడింది. ఇది భారతదేశంలో



మహిళలను కలుపుకొని వాతావరణ చర్యకు సాధికారత కల్పించే సంఘం. తక్కువ మంది మహిళలున్న ఈ రంగంలో పాల్గొంటున్న గాయత్రికి ఈ వాతావరణం చాలా కొత్త. అయినప్పటికీ మహిళలు తమ జీవిత అనుభవం నుండే ఎన్నో నేర్చుకుంటారని ఆమె అంటున్నారు. 'వాతావరణ సమస్యల్లో పరిష్కారం కోసం మహిళలు సమిష్టిగా పనిచేయడానికి, వారి ఆలోచనలను అమలు చేయడానికి తగినంత మద్దతు, అవకాశాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. కనుక ఈ రంగంలోకి వచ్చేందుకు మహిళలకు ఇది గొప్ప సమయం' అని ఆమె చెప్పింది.

కులవృత్తులకు ప్రోత్సాహం



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

'గౌడన్నల కులవృత్తిని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. కులవృత్తులపై ఆధారపడిన సోదరులకు విజ్ఞప్తి చేస్తున్నా.. మీ పిల్లలను ఉన్నత చదువులు చదివించండి.. వాళ్లను ఉన్నతాధికారులుగా తీర్చిదిద్దండి. రాష్ట్ర పునర్నిర్మాణంలో వారు భాగస్వాములు కావాలి. చట్టాలు రూపొందించే స్థాయికి మీ పిల్లలు ఎదగాలి. బలహీన వర్గాలు పాలకులుగా మారాలంటే చదువే ఏకైక మార్గం' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గీత కార్మికుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం 'కాటమయ్య రక్షణ కవచం' అందిస్తుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని లష్కర్‌గూడలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'కాటమయ్య రక్షణ కవచం' పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. సేఫ్టీ కిట్స్‌తో తాటి చెట్లు ఎక్కిన గీత కార్మికులతో సీఎం ముచ్చటించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కాటమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు.

పౌరుషానికి, పోరాటానికి మారుపేరు గౌడన్నలని, సర్వాయి పాపన్న, ధర్మభిక్షం లాంటి మహా నాయకులు మనకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఎవరెస్టు ఎక్కిన వారి అనుభవంతో రక్షణ కవచం కిట్లు తయారీ చేయించామని తెలిపారు. బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని చెప్పారు. వైఎస్‌ఆర్ హయాంలో బలహీన వర్గాల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకొచ్చారని, దాన్ని మళ్లీ పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ భూముల్లో తాటి, ఈత చెట్లు పెంచేలా చర్యలు చేపట్టేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రాష్ట్రంలో వన మహోత్సవంలో భాగంగా తాటి, ఈత చెట్ల పెంపకం చేపట్టాలని మంత్రి జూపల్లికి సూచించారు. చెరువు గట్లపై కూడా మొక్కలు నాటేలా ఇరిగేషన్ విభాగంతో మాట్లాడాలని మంత్రి శ్రీధర్ బాబుకు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్, ఫార్మా ఇండస్ట్రీ, అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ తెచ్చింది కాంగ్రెస్ కాదా..? ఎవరు తెచ్చారో ఓడిపోయి ఫామ్‌హౌస్‌లో ఉన్నోళ్లు సమాధానం చెప్పాలని అన్నారు. వారు తెచ్చిందల్లా రాష్ట్రానికి డ్రగ్స్, గంజాయి తప్పా ఏమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పని అయిపోయిందని అన్నవాళ్లే.. ఇప్పుడు వాళ్ల వైపు ఎంతమంది ఉన్నారో లెక్కపెట్టుకునే పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ అభివృద్ధిలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వస్తున్నారని, మీరు ప్రభుత్వాన్ని పడగొడతామంటే ప్రభుత్వాన్ని నిలబెట్టాలని వాళ్ల వస్తున్నారని స్పష్టం చేశారు. పదేండ్లపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పాలకులు తెలంగాణను అప్పులకుప్పగా మార్చారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ ముందుకెళ్తోందన్నారు. త్వరలోనే హయత్‌నగర్‌కు మెట్రో రాబోతుందని, ఇందుకు సంబంధించి అన్ని ప్రణాళికలు పూర్తయ్యాయని ప్రకటించారు. ఫార్మా కంపెనీల కోసం సేకరించిన భూమిలో వివిధ యూనివర్సిటీలు, మెడికల్ టూరిజం, పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. న్యూయార్క్ నగరంతో పోటీ పడేలా మహేశ్వరంలో ఒక అద్భుతమైన నగరం నిర్మించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. అద్భుతమైన రాచకొండ ప్రాంతాన్ని ఫిల్మ్ ఇండస్ట్రీకి అణువుగా మార్చబోతున్నామని చెప్పారు. రంగారెడ్డి జిల్లాకు మహర్దశ రాబోతోందని, ప్రపంచంలోనే అద్భుతమైన పర్యాటక కేంద్రంగా జిల్లాను తీర్చిదిద్దుతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి, శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బూర వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ శశాంక తదితరులు హాజరయ్యారు.

కాంగ్రెస్ లోక్‌సభ ఉపనేతగా గౌరవ్ గొగోయ్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో లోక్‌సభలో ప్రజావాణిని బలంగా వినిపిస్తామని కేసీ వేణుగోపాల్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

దేశంలో నిరుద్యోగం సమస్య : ఖర్గే

దేశవ్యాప్తంగా నిరుద్యోగం సమస్య పెరిగిపోతున్న వేళ కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోడీకి సూటి ప్రశ్న వేశారు. 4 ఏండ్లలో 8 కోట్ల ఉద్యోగాలు ఇచ్చామని మోడీ చెప్పారని, అదంతా ఫేక్ అంటూ ఖర్గే ధ్వజమెత్తారు. "ఉద్యోగాల కల్పనపై మోడీ అన్నీ అబద్ధాలే చెప్పారు. నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ(ఎన్‌ఆర్‌ఏ) అనేక పరీక్షలను నిర్వహించాల్సి ఉన్నా ఆ పని చేయలేదు. ఈ నాలుగేండ్లలో ఎన్‌ఆర్‌ఏ ఒక్క పరీక్షా నిర్వహించలేదు. బడ్జెట్‌లో నిర్వహణకు కేటాయించిన మొత్తం రూ.1,517 కోట్లలో, రూ. 58 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఎన్‌ఆర్‌ఏ ఉద్యోగాల నియామకానికి ఏర్పాటు చేశారా? లేదా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు లాక్కోవడానికి చేశారా? నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని పరీక్షలను తారుమారు చేయడానికి, పేపర్‌లను లీక్ చేయడానికి ఉపయోగించుకున్నారు. ఎన్‌టీఏ కూడా ఎలాంటి పరీక్షలు నిర్వహించలేదు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ విద్యా వ్యవస్థను నాశనం చేస్తామని ప్రతిజ్ఞ చేశాయి. యువకుల భవిష్యత్తును నాశనం చేయడమే వారి లక్ష్యం" అని ఖర్గే విమర్శించారు.

హిందువులు, ముస్లింలు కలిసి జీవించటమే భారత సంప్రదాయం

(మొదటిపేజీ తరువాయి)

చరిత్రను పరిశీలిస్తే.. హిందువులు, ముస్లింలు యుగయుగాలుగా సంపూర్ణ సమన్వయంతో సామరస్యంతో కలిసి పనిచేస్తున్నారు. ఇది 'జుక్తోసాధన' అని క్షితిమోహన్ సేన్ తన పుస్తకంలో నొక్కిచెప్పారు. ఈ 'జుక్తోసాధన' ఆలోచనను మనం నొక్కి చెప్పాలి" అని ఆయన అన్నారు. "మీరు ఉస్తాద్ అలీ అక్బర్ ఖాన్, పండిట్ రవిశంకర్‌ల మధ్య వారి మతపరమైన గుర్తింపులను వేరు చేయగలరా? వారి స్వంత శాస్త్రీయ సంగీత శైలి కోసం వారిని వేరు చేయవచ్చు" అని ఆయన అన్నారు. భారతదేశ బహువచన లక్షణాన్ని అణచివేసే ప్రయత్నాలకు వ్యతిరేకంగా హెచ్చరిస్తూ, ఉపనిషత్తులను పార్సీలోకి అనువదించిన కొద్దిమందిలో ముంతాజ్ కుమారుడు దారా షికో ఒకడని అమర్త్యసేన్ చెప్పారు. ఆయన హిందూ గ్రంథాలు, సంస్కృత భాషలో చాలా ప్రావీణ్యం కలిగి ఉన్నాడని ఇది చూపిస్తున్నదని అన్నారు. "తాజ్ మహల్ చాలా అందంగా కనిపించటం, చాలా గొప్పతనాన్ని కలిగి ఉండటం పట్ల ఒక అభిప్రాయం వ్యతిరేకించగా, స్మారక చిహ్నం పేరును ముస్లిం పాలకులతో సంబంధం లేకుండా మార్చాలని కోరుకునే మరొక వర్గమున్నదని ఆయన తెలిపారు.

డబుల్ ఇండ్లకు సదుపాయాలు కల్పించండి

(మొదటిపేజీ తరువాయి)

కల్పనకు రూ.700 కోట్లు అవసరమని జీహెచ్‌ఎంసీ, హౌసింగ్ అధికారులు చెబుతున్నారని, రాబోయే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇండ్ల నిర్మాణాన్ని చాలా జాప్యం చేసిందని, కనీస సదుపాయాలు కల్పించకుండానే ఎన్నికల ముందు హడావిడిగా ఇండ్ల కేటాయింపు జరిపిందన్నారు. దాని కారణంగానే పేదలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలు అందులో నివసించకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయని తెలిపారు. ఇండ్లను గత ప్రభుత్వం ఇచ్చిందన్న రాజకీయాలకు తావు లేకుండా డబులు బెడ్‌రూమ్ ఇండ్లలో సదుపాయాలు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ (ఎం) నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ.. సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో లబ్దిదారులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు వి. విజయకుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు కావాల్సింది ఇండ్లు అని, రాజకీయాలు కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదలను అర్థం చేసుకోవాలన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వం బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. శ్రీనివాసరావు, ఎం. దశరథ్, ఎం. మహేందర్, ఐద్వా నగర కార్యదర్శి కె. నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ రికవరీలు ఆపండి : సీఎస్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

డబుల్ పెన్షన్లు తీసుకుంటున్న వారి నుంచి పింఛన్ రికవరీలు నిలుపుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి, విధివిధానాలు ఖరారు చేశాక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సంక్షేమ పథకాల్లో అనర్హులు లబ్ధి పొందినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందనీ, అర్హులు మాత్రమే లబ్ధిపొందేలా త్వరలోనే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అప్పటి వరకు ఎవరికీ రికవరీ నోటీసులు ఇవ్వొద్దని ఆదేశించారు. డబుల్ పింఛన్‌లు తీసుకుంటున్న 1,826 మందికి ప్రభుత్వం రికవరీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కే తారకరామారావు 'ఎక్స్' వేదికగా తప్పుపట్టారు. వృద్ధులకు ఇచ్చే పింఛన్‌లను రేవంత్‌రెడ్డి సర్కారు రికవరీ చేస్తూ, మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నదని ట్వీట్ చేశారు. దీనిపై ప్రభుత్వం కూడా వివరణ ఇచ్చింది. తాజాగా ఆదివారం సీఎస్ శాంతికుమారి పై ఉత్తర్వులు జారీ చేశారు.

డీఎస్సీ రద్దు కుదరదు

(మొదటిపేజీ తరువాయి)

పోస్టులతో మరో డీఎస్సీ త్వరలోనే నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు. దీంతోపాటు జాబ్ క్యాలెండర్ విడుదలకు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఐదు వేల పోస్టులతో నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించకపోవడంతో తమ ప్రభుత్వం రాగానే 11వేలకు పైగా పోస్టులతో మళ్లి నోటిఫికేషన్ ఇచ్చామని గుర్తు చేశారు. 16వేల టీచర్ పోస్టులుఖాళీగా ఉన్నట్టు గుర్తించామనీ, 19,718 టీచర్ల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టామని వివరించారు. ఇప్పటికే రెండున్నర లక్షలకు పైగా అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం 2లక్షల 79వేలమంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పదేండ్లు డీఎస్సీని ఎందుకు నిర్వహించలేదని బీఆర్‌ఎస్‌ని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ విడుదల చేసి ఓట్ల కోసం తాపాత్రయ పడ్డారని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీని పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. మరో డీఎస్సీ కూడా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. త్వరలోనే పోస్టుల సంఖ్యతో నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వం రాగానే గ్రూప్ వన్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించామని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో నిరుద్యోగ యువకులు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని గుర్తించామని అన్నారు. గ్రూప్ 2 కూడా గత ప్రభుత్వం మూడు సార్లు వాయిదా వేసిందని తెలిపారు. తమ ప్రభుత్వం మళ్లీ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసిందన్నారు. ఇవి కాక వివిధ శాఖల్లో పోస్టులు 13321 టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్నామన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కొట్లాడి రాష్ట్రాన్ని తెచ్చుకున్నది ఉద్యోగాల కోసమేనన్నారు. అనేక ఉద్యమాలు, విద్యార్థుల ఆత్మబలిదానాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని చెప్పారు. అందుకే తమ ప్రభుత్వం ఉద్యోగాలపై దృష్టి సారించిందనీ, ఇప్పటికే 30వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని వెల్లడించారు. విద్యా వ్యవస్థ బలోపేతం, పేద విద్యార్థులకు మంచి విద్యనందించాలని డీఎస్సీ ప్రకటించామని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు, నిరుద్యోగ యువతీ యువకులకు గమనించాలని విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

యువతరానికి క్షమాపణ చెప్పండి

సీఎంపై మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుద్యోగ యువకులు, విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కే తారకరామారావు డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఆందోళనలపై నిర్లక్ష్యంగా, నిర్లజ్జగా, ముఖ్యమంత్రి స్థాయిని దిగజారుస్తూ, అత్యంత దివాళకోరుతనంతో మాట్లాడారని విమర్శించారు. నిరుద్యోగుల కోసం పోరాటం చేస్తున్న మోతీలాల్ ని అవమానించారన్నారు. అశోక్‌నగర్ కోచింగ్ సెంటర్లకు వెళ్లి ఉద్యోగాలు సంపాదించుకున్న రేవంత్‌రెడ్డి అదే కోచింగ్ సెంటర్లను, వారిని అవమానించేలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. 8 నెలల్లో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదనీ, వచ్చే నాలుగు నెలల్లో ఏవిధంగా రెండు లక్షల నోటిఫికేషన్లు ఇస్తారో చెప్పాలని నిలదీశారు. దీనిపై క్షేత్రస్థాయిలో విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి కొట్లాడతామని చెప్పారు.

పాలనపై ఫోకస్..

(మొదటిపేజీ తరువాయి)

తనిఖీ చేసి విద్యార్థులు ఏ మేరకు నేర్చుకుంటున్నారు..? ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటున్నారా..? మధ్యాహ్న భోజనం ఎలా ఉంది..? వంటివి అంచనా వేయాలి. నీటి సరఫరా, పారిశుధ్యంపై తనిఖీలు చేయాలి. ప్రజలకు సురక్షిత నీరు అందుబాటులో ఉందా..? పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంది..? అనే అంశాలను, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించనున్నారు. గ్రామాలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో రోడ్ల పరిస్థితి, ప్రజా రవాణా, ఇతర మౌలిక సదుపాయాలను సమీక్షించాలి. లబ్దిదారులకు బియ్యం, ఇండ్లు, ఇతర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..? అనే వివరాలను సేకరించాలి. వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పింఛన్లు వంటి సాంఘిక సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మహిళలు, శిశువులకు అందుతున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను తనిఖీ చేయాలి. మున్సిపాల్టీల్లో అన్ని కార్యక్రమాలు, పథకాల అమలు తీరును పర్యవేక్షించాలి. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

ఇప్పటికే సమీక్షలు, ఆకస్మిక తనిఖీలు

సీఎస్ నుంచి ఉత్వర్వులు రావడంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ రంగంలోకి దిగారు. ఇప్పటికే వనమహోత్సవంపై సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్.. మున్సిపాల్టీలు, ఎంపీడీఓలు, జిల్లా అధికారులకు కేటాయించిన లక్ష్యాలపై దిశా నిర్దేశం చేశారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలలు, ప్రజాపాలన కేంద్రాలు, మహిళా శక్తి కార్యక్రమాలపై సమీక్షించారు. ఉప్పల్, జవహర్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీల్లో ఎమర్జెన్సీ అండ్ డ్రెస్సింగ్, ఇమ్యూనైజేషన్, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషెంట్ రూంలను పరిశీలించారు. బీపీ, షుగర్ టాబ్లెట్లు, ల్యాబ్ పరికరాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, సీజన్ వ్యాధుల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనితీరును పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. విద్యా బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో డైనింగ్ హాల్, తాగునీరు, వాష్ ఏరియా లాంటి మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రితో సమావేశం అనంతరం కలెక్టర్ పాలనలో మరింత దూకుడు పెంచనున్నారు.

ప్రతి నెలా సీఎస్‌కు రిపోర్టు

జిల్లా కలెక్టర్ నెలలో ఏ యే పనులు చేశారు..? ఎన్ని తనిఖీలు, సమీక్షలు, పర్యటనలు చేశారు వంటి వివరాలన్నింటితో ప్రతి నెలా 5వ తేదీలోగా 'టూర్ డైరీ' రూపంలో సీఎస్‌కు నివేదిక పంపాలి. ఇలా పంపిన కలెక్టర్ల క్షేత్ర స్థాయి పర్యటనలు, నిబద్ధత వంటి అంశాలను కలెక్టర్ల పనితీరును అంచనా వేసే సందర్భంలో పరిగణలోకి తీసుకుంటారు. ఈ రిపోర్టు ఆధారంగానే కలెక్టర్లకు రివార్డులు, పనిష్మెంట్లు ఉండనున్నాయి.



సిరీస్ సొంతమాయె!

- ఐదో వన్డేలో భారత్ ఘన విజయం
- 4-1తో టీ20 సిరీస్ భారత్ వశం
- సమిష్టిగా మెరిసిన యువ ఆటగాళ్లు

ఆరంభం ఆందోళనకు దారితీసినా.. ముగింపు మెప్పించింది. జింబాబ్వేతో ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌ను టీమ్ ఇండియా సొంతం చేసుకుంది. సమిష్టిగా రాణించిన యువ ఆటగాళ్లు 4-1తో పొట్టి సిరీస్‌ను సొంతం చేసుకున్నారు. టీ20 ప్రపంచకప్ విజేత టీమ్ ఇండియా చేతిలో ఆతిథ్య జింబాబ్వే చిత్తుగా ఓడింది.

సంజు శాంసన్ (58) అర్థ సెంచరీతో కదం తొక్కాడు. మిడిల్ ఆర్డర్‌లో విలువైన ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. ముకేశ్ కుమార్ (4/22) నాలుగు వికెట్ల ప్రదర్శనకు తోడు శివం దూబె ఆల్‌రౌండ్ జోరుతో ఆఖరు మ్యాచ్‌లో భారత్ 42 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ తొలి ప్రయత్నంలోనే భారత్‌కు టీ20 సిరీస్ విజయాన్ని కట్టబెట్టాడు.

నవతెలంగాణ-హరారే

విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా పొట్టి ఫార్మాట్‌కు దూరం అయ్యారు. దిగ్గజాలు లేకుండానే బరిలోకి దిగిన యువ క్రికెటర్లు.. జింబాబ్వేలో జైత్రయాత్రకు శ్రీకారం చుట్టారు. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌ను 4-1తో సొంతం చేసుకున్నారు. నామమాత్రపు ఐదో మ్యాచ్‌లో ఆతిథ్య జింబాబ్వేపై 42 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన భారత్.. పొట్టి సిరీస్ ట్రోఫీతో స్వదేశానికి రానుంది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ సంజు శాంసన్ (58, 45 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) అర్థ సెంచరీతో మెరువగా, ఆల్‌రౌండర్ శివం దూబె (26, 12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) డెత్ ఓవర్లలో ధనాధన్ ఇన్నింగ్స్‌తో శివమెత్తాడు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ సంజు శాంసన్, శివం దూబె మెరుపులతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 167 పరుగులు చేసింది. ఛేదనలో జింబాబ్వే చతికిల పడింది. పేసర్ ముకేశ్ కుమార్ (4/11) నిప్పులు చెరిగే ప్రదర్శనతో 18.3 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. డియాన్ మేయర్స్ (34, 32 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), ఫరాజ్ అక్రమ్ (27, 13 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆతిథ్య జట్టుకు మూడెంకల స్కోరు అందించారు. పేస్ ఆల్‌రౌండర్ శివం దూబె 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా.. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. 4-1తో టీ20 సిరీస్ విజయం అందుకున్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పొట్టి సిరీస్ ట్రోఫీ అందుకోవటంతో టీమ్ ఇండియా శిబిరంలో సంబురాలు మొదలయ్యాయి.

ముకేశ్, దూబె నిప్పులు : 168 పరుగుల ఛేదనలో ఆతిథ్య జింబాబ్వే ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. పేసర్ ముకేశ్‌కుమార్ పవర్‌ప్లేలో రెండు వికెట్లతో జింబాబ్వేను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. ఆ తర్వాత స్పిన్, పేస్ ఉచ్చులో పడిన జింబాబ్వే బ్యాటర్లు కోలుకోలేదు. టాప్ ఆర్డర్‌లో మారుమని (27), డియాన్ మేయర్స్ (34)లు మెరిసినా.. మిడిల్ ఆర్డర్ నిరాశపరిచింది. కెప్టెన్ సికిందర్ రజా (8), జొనాథన్ కాంప్‌బెల్ (4), క్లైవ్ (1) తేలిపోయారు. టెయిలెండర్లలో ఫరాజ్ అక్రమ్ (27) మెరవటంతో జింబాబ్వే వంద పరుగుల మార్క్ దాటేసింది. ముకేశ్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. దూబె రెండు వికెట్లతో చెలరేగాడు. వాషింగ్టన్ సుందర్, అభిషేక్ శర్మ, తుషార్ దేశ్‌పాండే తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

సంజు శాంసన్ మెరుపుల్ : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ ఇండియాకు ఈసారి ఓపెనర్లు ఆశించిన ఆరంభం అందించలేదు. నాల్గో టీ20లో అజేయ అర్థ సెంచరీలు బాదిన యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్‌లు పవర్‌ప్లేలోనే వికెట్ కోల్పోయారు. యశస్వి (12), గిల్ (13), అభిషేక్ (14) నిరాశపరచగా భారత్ 40/3తో ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో సంజు శాంసన్ (58) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. మిడిల్ ఆర్డర్‌లో రియాన్ పరాగ్ (22, 24 బంతుల్లో 1 సిక్స్), శివం దూబె (26)తో కలిసి ఇన్నింగ్స్‌కు ముందుకు తీసుకెళ్లాడు. పరిస్థితులకు అనుగుణంగా ఆడిన సంజు శాంసన్ నాలుగు ఫోర్లతో 39 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. ఆఖర్లో శివం దూబె ధనాధన్‌తో స్కోరు బోర్డు వేగం పుంజుకుంది. రింకూ సింగ్ (11 నాటౌట్) ఓ సిక్సర్‌తో అలరించాడు. జింబాబ్వే బౌలర్లలో బ్లెసింగ్ (2/19), సికిందర్ రజా (1/37), బ్రాండన్ మావుట (1/39) రాణించారు.

స్కోరు వివరాలు :

భారత్ ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (బి) రజా 12, గిల్ (సి) రజా (బి) రిచర్డ్ 13, అభిషేక్ (సి) మదాండె (బి) ముజరబాని 14, సంజు శాంసన్ (సి) మారుమని (బి) ముజరబాని 58, రియాన్ పరాగ్ (సి) రిచర్డ్ (బి) మవుట 22, శివం దూబె రనౌట్ 26, రింకూ సింగ్ నాటౌట్ 11, వాషింగ్టన్ సుందర్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 10, **మొత్తం :** (20 ఓవర్లలో 6 వికెట్లకు) 167.

వికెట్ల పతనం : 1-13, 2-38, 3-40, 4-105, 5-135, 6-153.

బౌలింగ్ : సికిందర్ రజా 4-0-37-1, రిచర్డ్ 4-0-29-1, ఫరాజ్ అక్రమ్ 4-0-39-0, బ్లెస్సింగ్ ముజరబాని 4-0-19-2, బ్రాండన్ మవుట 4-0-39-1.

జింబాబ్వే ఇన్నింగ్స్ : వెస్లీ (బి) ముకేశ్ 0, మారుమని (ఎల్బీ) వాషింగ్టన్ సుందర్ 27, బ్రియాన్ బెనెట్ (సి) దూబె (బి) ముకేశ్ కుమార్ 10, డియాన్ మేయర్స్ (సి) అభిషేక్ శర్మ (బి) దూబె 34, సికిందర్ రజా రనౌట్ 8, జొనాథన్ కాంప్‌బెల్ (సి) దేశ్‌పాండే (బి) దూబె 4, క్లైవ్ మాదండె (సి) శాంసన్ (బి) అభిషేక్ 1, ఫరాజ్ అక్రమ్ (సి) శాంసన్ (బి) ముకేశ్ కుమార్ 27, బ్రాండన్ మవుట (సి,బి) దేశ్‌పాండే 4, బ్లెస్సింగ్ నాటౌట్ 1, రిచర్డ్ (బి) ముకేశ్ కుమార్ 0, ఎక్స్‌ట్రాలు : 9, **మొత్తం :** (18.3 ఓవర్లలో ఆలౌట్) 125.

వికెట్ల పతనం : 1-1, 2-15, 3-59, 4-85, 5-87, 6-90, 7-94, 8-120, 9-123, 10-125.

బౌలింగ్ : ముకేశ్ కుమార్ 3.3-0-22-4, తుషార్ దేశ్‌పాండే 3-0-25-1, రవి బిష్ణోయ్ 3-0-23-0, వాషింగ్టన్ సుందర్ 2-0-7-1, అభిషేక్ శర్మ 3-0-20-1, శివం దూబె 4-0-25-2.

రాజు అల్కరాజే



- ఫైనల్లో జకోవిచ్‌పై గెలుపు
- మెన్స్ సింగిల్స్ టైటిల్ సొంతం
- వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ 2024

లండన్ (ఇంగ్లాండ్) : రారాజుపై యువరాజు పైచేయి సాధించాడు. ఏడాది క్రితం ఉత్కంఠభరిత ఐదు సెట్ల మహా సమరంలో సెర్బియా యోధుడు నొవాక్ జకోవిచ్‌ను ఓడించి ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌ను తొలిసారి ముద్దాడిన యువ స్పెయిన్ బుల్ కార్లోస్ అల్కరాజ్.. ఆదివారం ఆల్ ఇంగ్లాండ్ టెన్నిస్ సెంటర్ కోర్టులో సీన్ పునరావృతం చేశాడు. కానీ ఈసారి రారాజును ఓడించేందుకు కుర్ర స్పెయిన్ బుల్‌కు మూడు సెట్లు సరిపోయాయి. 6-2, 6-2, 7-6(7-4)తో జకోవిచ్‌పై ఘన విజయం సాధించిన కార్లోస్ అల్కరాజ్ వరుసగా రెండో ఏడాది వింబుల్డన్ పురుషుల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోనూ కార్లోస్ అల్కరాజ్ చేతిలో భంగపడిన నొవాక్ జకోవిచ్ మరోసారి అతడి చేతిలోనే వింబుల్డన్ రికార్డు టైటిల్‌కు దూరమయ్యాడు.

వరల్డ్ నం.1 జకోవిచ్‌పై వరల్డ్ నం.3 కార్లోస్ అల్కరాజ్ అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. మూడు సెట్ల మ్యాచ్‌లో మెరుపు విజయం సాధించి కెరీర్ నాల్గో గ్రాండ్‌స్లామ్ గెల్చుకున్నాడు. ఐదు బ్రేక్ పాయింట్లు సాధించిన అల్కరాజ్.. తొలి సర్వ్‌లోనే 84 శాతం పాయింట్లను సాధించాడు. జకోవిచ్ తొలి సర్వ్‌లో 66 శాతం పాయింట్లే నెగ్గాడు. ఇక 42 విన్నర్లు సహా జకోవిచ్ సర్వ్‌లో ఏకంగా 42 పాయింట్లు సాధించిన అల్కరాజ్ గెలుపు సునాయాసం చేసుకున్నాడు. జకోవిచ్ ఒక్క బ్రేక్ పాయింట్ మాత్రమే సాధించగలిగాడు. పాయింట్ల పరంగా 109-87తో అల్కరాజ్ స్పష్టమైన ఆధిపత్యం చెలాయించాడు. చారిత్రక కెరీర్ 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో జకోవిచ్‌కు మరోసారి నిరాశే ఎదురైంది.

జెపిఎల్ నిర్వహణ అభినందనీయం

బీసీసీఐ మాజీ చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్
అట్టహాసంగా ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం



నవతెలంగాణ-హైదరాబాద్

'నిత్యం పని ఒత్తిడితో ఉండే పాత్రికేయులకు ఆటవిడుపుగా ప్రొఫెషనల్ స్థాయిలో జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ (జెపిఎల్) నిర్వహించనుండటం అభినందనీయం. తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ఆరంభం అవుతున్న జెపిఎల్ టీ20 లీగ్.. త్వరలోనే దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఓ క్రికెట్ లీగ్‌గా ఎదగాలని ఆశిస్తున్నాను' అని భారత మాజీ చీఫ్ సెలక్టర్, మాజీ క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్నారు. శనివారం ఎల్బీ స్టేడియంలోని సమావేశం మందిరంలో జరిగిన జెపిఎల్ ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెస్కే ప్రసాద్.. శాట్జ్ చైర్మెన్ శివసేనారెడ్డి, కెఎస్‌జి చైర్మెన్ అభిషేక్ రెడ్డి, తృక్ష ఫుడ్స్ ఎండీ భరత్ రెడ్డి, లైఫ్‌స్పాన్ ప్రతినిధి భరణిలతో కలిసి జెపిఎల్ ట్రోఫీలను ఆవిష్కరించారు. ఈ నెల 20న ఆరంభ మ్యాచ్‌తో షురూ కానున్న జెపిఎల్.. 25న టైటిల్ పోరుతో ముగియనుంది.

'జెపిఎల్ నిర్వహణతో క్రీడల ప్రాధాన్యతపై ప్రజలకు ఒక మంచి సందేశం వెళ్లనుంది. ఇటువంటి మంచి కార్యక్రమాలకు శాట్జ్, ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుంది' అని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్జ్) చైర్మెన్ శివసేనా రెడ్డి తెలిపారు. 'జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ ఆలోచన గొప్ప విషయం. లీగ్‌లో పోటీపడుతున్న అన్ని జట్లకు శుభాకాంక్షలు' అని అభిషేక్ రెడ్డి అన్నారు. 'సమాజహితం కోరే జర్నలిస్టులు అందరూ ఇలా ఒకే వేదికపై క్రికెట్ లీగ్ ఆడనుండటం కన్నులపండుగగా ఉందని' భరత్ రెడ్డి చెప్పారు. జెపిఎల్‌లో పోటీపడుతున్న జర్నలిస్టులు అందరూ తమ క్రికెట్ నైపుణ్యం ప్రదర్శించానలి, లీగ్ విజయవంతం కావాలని భరణ ఆకాంక్షించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల నుంచి జర్నలిస్టులు, స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (ఎస్‌జెఏటీ) ప్రతినిధులు సహా లీగ్‌లో పోటీపడుతున్న పది జట్ల కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కన్నప్పలో నాథనాధుడిగా ఉగ్రరూపం


శరత్‌కుమార్

హీరో విష్ణు మంచు నిర్మిస్తున్న 'కన్నప్ప' ప్రాజెక్ట్ మీద భారీ అంచనాలు ఏర్పడ్డాయి. రీసెంట్‌గా విడుదల చేసిన టీజర్‌తో ఈ సినిమా మీద మరింత బజ్ ఏర్పడింది. సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్ గురించి అందరూ మాట్లాడుకున్నారు. ఈ సినిమా ఎప్పుడెప్పుడు వస్తుందా? అని ప్రేక్షకులంతా ఎదురుచూస్తున్నారు. ఇటీవల కన్నప్ప వాడిన విల్లు విశేషాలు నెట్టింట్లో ట్రెండ్ అయ్యాయి.

తాజాగా ఈ చిత్రం నుంచి శరత్ కుమార్ పాత్రకు సంబంధించిన అప్డేట్ వచ్చింది. శరత్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం ఆయన క్యారెక్టర్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో ఆయన నాథనాధుడిగా కనిపించబోతున్నారు. తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో ఆయన ఉగ్రరూపాన్ని మనం చూడొచ్చు. ఓ యోధుడిలా శరత్ కుమార్ కనిపిస్తున్నారు.

అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద ఈ చిత్రాన్ని డా.మోహన్ బాబు నిర్మిస్తున్నారు. ఈ మూవీకి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. స్టీఫెన్ దేవస్సీ సంగీతాన్ని అందిస్తున్నారు. విజువల్ ట్రీట్ ఇచ్చేలా, ఇండియన్ స్క్రీన్ మీద మునుపెన్నడూ చూడ నటువంటి గ్రాండియర్‌తో ఈ చిత్రం రానుంది.


మోహన్ లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్ బాబు, బ్రహ్మానందం, ప్రీతి ముకుందన్, కాజల్ అగర్వాల్ వంటి భారీ తారగణంతో తెరకెక్కిన ఈ చిత్రం డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

'ఈ సినిమా నుంచి ఎప్పటికప్పుడు వస్తున్న అప్‌డేట్స్ అందరిలోనూ ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. మోహన్‌లాల్, ప్రభాస్, శరత్‌కుమార్, అక్షయ్‌కుమార్, మోహన్‌బాబు, విష్ణు వంటి హేమాహేమీలు ఈ సినిమాలో ఎవ్వరూ ఊహించని పాత్రలతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. పాన్ ఇండియా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే సినిమాగానే కాకుండా మన చరిత్రను తెలిపే సినిమాగా 'కన్నప్ప'గా ఉండనుంది' అని చిత్ర బృందం తెలిపింది.

మరో కీలక పాత్రలో..

హీరో సిద్దార్థ్ నటించబోయే తన 40వ సినిమాను '8 తొట్టక్కల్' ఫేం శ్రీ గణేష్ దర్శకత్వంలో చేయ బోతున్నారు. శాంతి టాకీస్ పై బ్లాక్ బస్టర్ హిట్ 'మావీరన్' నిర్మాత అరుణ్ విశ్వ తెలుగు - తమిళ్ లో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

తాజాగా ఈ ప్రాజెక్ట్ నుంచి ఓ సర్‌ప్రైజింగ్ అనౌన్స్ మెంట్ వచ్చింది. ఈ చిత్రంలో శరత్ కుమార్, దేవయాని కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. వీరి క్యారెక్టర్స్ కథలో చాలా క్రూషియల్‌గా ఉండబోతున్నాయి. సిద్దార్థ్ 40 సినిమా కోసం డైరెక్టర్ శ్రీ గణేష్ పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారు. హై బడ్జెట్, టాప్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో ఈ సినిమా రూపొందనుందని చిత్ర యూనిట్ తెలిపింది.


రామ్

మార్ ముంత చోడ్ చింత

రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రాబోతున్న పాన్ ఇండియా మూవీ 'డబుల్ ఇస్మార్ట్'. ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్‌లు బ్లాక్‌బస్టర్ నోట్‌లో ప్రారంభమయ్యాయి. ఫస్ట్ సింగిల్ 'స్టెప్పా మార్' సెన్సేషనల్ హిట్‌గా మారింది. మేకర్స్ ఇప్పుడు సెకండ్ సింగిల్ 'మార్ ముంత చోడ్ చింత..'కి సంబంధించి అప్‌డేట్ ఇచ్చారు.

'మార్ ముంత చోడ్ చింత' అనేది ఈ సిరీస్‌లో హీరో పాపులర్ డైలాగ్. పోస్టర్ సూచించినట్లు ఈ పాట మాస్ బ్లాస్ట్‌ను అందించబోతోంది. రామ్ రెండు బాటిళ్ల కల్లును ఆస్వాదిస్తూ కనిపించారు. సెట్ వైబ్రెంట్‌గా కనిపిస్తోంది. ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందించారు.

పూరి కనెక్ట్స్ బ్యానర్‌లో పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మించిన ఈ చిత్రంలో సంజయ్ దత్ పవర్ ఫుల్ పాత్రలో నటించగా, రామ్ సరసన కావ్య థాపర్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రానికి సామ్ కె నాయుడు, జియాని గియాన్నెలి సినిమాటోగ్రఫీ అందించారు. ఆగస్ట్ 15న ఈ సినిమా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

నవచిత్రం

మా ఊరి జాతరలో..


అమృత అయ్యర్, అల్లరి నరేష్

హీరో అల్లరి నరేష్ తన అప్ కమింగ్ మూవీ 'బచ్చల మల్లి'లో ఇంటెన్స్ రోల్‌లో కనిపించబోతున్నారు. 'సోలో బ్రతుకే సో బెటర్' ఫేమ్ సుబ్బు మంగదేవి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన హీరో నరేష్ మాస్-అప్పీలింగ్ బర్త్ డే గ్లింప్స్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.

ఇప్పుడు మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్‌ని కిక్ స్టార్ట్ చేస్తున్నారు. ఫస్ట్ సింగిల్ 'మా ఊరి జాతరలో' అంటూ సాగే పాటను ఈనెల 16న విడుదల చేస్తున్నారు. 'సీతారామం' ఫేం విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమా కోసం చార్ట్ బస్టర్ ఆల్బమ్ కంపోజ్ చేశారు.

ఈ మూవీలో నరేష్ ఇంతకు ముందు ఎన్నడూ చేయని మాస్ క్యారెక్టర్‌లో ఆదరగొట్టబోతున్నారు. డైరెక్టర్ సుబ్బు నరేష్‌ని మునుపెన్నడూ చూడని అవతార్‌లో ప్రెజెంట్ చేస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అల్లరి నరేష్ సరసన అమృత అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రోహిణి, రావు రమేష్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరి తేజ, ప్రవీణ్, వైవా హర్ష తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.

ఈ చిత్రానికి కథ, మాటలు, దర్శకత్వం - సుబ్బు మంగదేవి, నిర్మాతలు - రాజేష్ దండా, బాలాజీ గుత్తా, స్క్రీన్ ప్లే: విప్పర్తి మధు, ఎడిషనల్ స్క్రీన్ ప్లే: విశ్వనేత్ర, సంగీతం- విశాల్ చంద్రశేఖర్, డీవోపీ- రిచర్డ్ ఎం.నాథన్, ఎడిటింగ్- ఛోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైన్- బ్రహ్మ కడలి.

భిన్న కాన్సెప్ట్..


రవికృష్ణ

'నటుడిగా అన్ని తరహా పాత్రలు చేస్తూ నాకంటూ ఓ గుర్తింపు పొందాలి. సినిమా అంటే పిచ్చి. ప్రేమతో మంచి అవకాశాల కోసం వెయిట్ చేస్తున్నాను. ఇప్పుడు నటుడిగా మంచి సినిమాలు చేస్తున్నందుకు హ్యాపీగా ఉంది' అని అన్నారు బిగ్‌బాస్ ఫేం రవికృష్ణ. 'విరూపాక్ష'తో మంచి గుర్తింపు పొందిన రవికృష్ణ నటిస్తున్న తాజా చిత్రం 'ది బర్త్‌డే బాయ్'.

రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్‌కనకాల ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో పలువురు నూతన నటీనటులు నటిస్తున్నారు.

'ఈ చిత్రాన్ని బొమ్మ బొరుసా పతాకంపై ఐ.భరత్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి విస్కి దర్శకుడు. ఈనెల 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రవికృష్ణ ఆదివారం మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'విరూపాక్ష సమయంలోనే ఈ సినిమా ఆఫర్ వచ్చింది. ఎన్ఆర్ఐ నిర్మాతలు ఒక ట్రూ ఇన్సిడెంట్‌తో ఈ సినిమా చేస్తున్నామని చెప్పారు. వాస్తవ సంఘటనలతో రూపొందే కథలంటే నాకు చాలా ఇష్టం. అందుకే ఈ కథ విన్నాను. నచ్చింది. వెంటనే ఓకే చెప్పాను. పుట్టినరోజు నాడు జరిగిన ఓ ఘటనతో ఓ స్నేహితుడు చనిపోతాడు. అప్పటి నుండి ఆ పరిస్థితిని వాళ్లు ఎలా హ్యాండిల్ చేశారు అనేది కథ. వాళ్లు పోలీసుల నుండి ఎలా తప్పించుకున్నారు? ఒకవేళ అరెస్ట్ అయితే వాళ్లు ఈ కేసు నుండి ఎలా బయటపడ్డారు అనేది కథ. చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమాలో ఐదుగురు స్నేహితులు ఉంటారు. ఒకతని బర్త్‌డే రోజు అతను చనిపోతాడు. అందులో ఒకతనికి సోదరుడు పాత్రలో నటిస్తున్నాను. నాది ఫుల్‌లెంగ్త్ పాత్ర. ఇదొక ట్రూ ఎమోషన్, ట్రూ డ్రామా తప్పనిసరిగా ఇలాంటి కథలు ప్రేక్షకులకు థ్రిల్లింగ్‌గా ఉంటాయి. సినిమా మొదలు నుండి చివరి వరకు చాలా గ్రిప్పింగ్‌గా ఉంటుంది. 'బిగ్‌బాస్' తరువాత సినిమాలపై దృష్టి పెట్టాను. విరూపాక్ష సక్సెస్ తర్వాత సినిమాల్లో మంచి అవకాశాలు రావడం ఆనందంగా ఉంది. 'ఏ1 ఏ2 ఏ3' అనే సినిమాలో హీరోగా చేస్తున్నాను. విజయ్‌దేవరకొండ సినిమాతో పాటు సాయిధరమ్ తేజ సినిమాలో నటిస్తున్నాను'.

ఉల్లాసంతో మ్యాజికల్ ట్రీట్..


ప్రియాంక అరుల్ మోహన్, నాని

'సరిపోదా శనివారం' నుంచి వచ్చిన ఫస్ట్ సింగిల్ 'గరం గరం' హీరో నాని ఫెరోషియస్ క్యారెక్టర్‌ని ప్రజెంట్ చేసింది. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు. మాస్ ఫీస్ట్ తర్వాత, మేకర్స్ తాజాగా సెకండ్ సింగిల్ 'ఉల్లాసం..' సాంగ్‌ని రిలీజ్ చేశారు. ఇది మ్యాజికల్ ట్రీట్‌ను అందిస్తుంది.

ఇది క్లాసికల్, జాజ్ మ్యూజిక్ ఫ్యూజన్, రొమాంటిక్ ఇన్‌స్టంట్ నెంబర్ హిట్ అయ్యింది. విన్న వెంటనే ట్యూన్‌తో లవ్‌లో పడతారు. సనరే రాసిన లిరిక్స్ నాని, ప్రియాంక మోహన్‌ల ఫీలింగ్స్‌ని బ్యూటీఫుల్‌గా ఎక్స్‌ప్రెస్ చేస్తోంది. సంజిత్ హెగ్డే తన వోకల్స్‌తో పాటకు ప్రాణం పోయగా, కృష్ణ లాస్య ముత్యాల కూడా తన ఎక్స్‌ప్రెస్సివ్ వాయిస్‌తో మ్యాజిక్ చేసింది. రిథమిక్ ఇన్స్ట్రుమెంట్స్ చాలా బాగున్నాయి. ఇంటర్‌లూడ్‌లు చాలా కూల్‌గా ఉన్నాయి. మ్యాజికల్ త్రయం (కంపోజర్, సింగర్, లిరిక్ రైటర్) మనల్ని హ్యాపీ ట్రాన్స్‌లోకి తీసుకువెళుతుంది. నాని, ప్రియాంక మోహన్‌ల జంట తమ నేచురల్ ఎక్స్‌ప్రెషన్స్‌తో విజువల్స్‌కు బ్యూటీని యాడ్ చేశారు. ఆగస్ట్ 29న ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886